lోపలి పేజీల్లో...


ప్రజాపంథా


సి.పి.ఐ (ఎం.ఎల్ - న్యూడెమోక్రసీ) పక్షపత్రిక


సంపుటి : 25 సంచిక : 13 01-11-2008 పేజీలు : 16 ప్రచురణస్థలం : హైదరాబాద్ ఎడిటర్ : మాదాల నారాయణస్వామి వెల : 10

భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ప్రాణాలర్పించిన

విప్లవ యోధులకు జోహార్లు


చంద్ర పుల్లారెడ్డి


సత్యనారాయణసింగ్


దేవులపల్లి వెంకటేశ్వరరావు


తరిమెల నాగిరెడ్డి


చారు మజుందార్

నవంబర్ మొదటి వారాన్ని అమరవీరుల సంస్మరణ వారంగా పాటిద్దాం!

నాలుగు దశాబ్దాల క్రితం నయారివిజనిస్టు విధానాలకు వ్యతిరేకంగా సీపీయంలో పోరాడిన కమ్యూనిస్టు విప్లవకారులు స్వంత నిర్మాణం ఏర్పాటు చేసుకొన్నారు. ఒకే నిర్మాణంలో కొనసాగడానికి వీలుగాని విధానాల మూలంగా సీపీయం విధానాలను, దాని నిర్మాణాన్ని విప్లవకారులు త్రోసిపుచ్చారు. ఆ తదుపరి తమకంటూ ప్రత్యేక విధానాలను, నిర్మాణాన్ని రూపొందించుకొన్నారు. వాటి అమలు కోసం అహర్నిశలు కృషి సల్పారు. అకుంఠిత దీక్షతో పోరాడారు. అనుపమ త్యాగాలు చేశారు. అత్యున్నతమైన తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించారు. వారందరికి పేరు పేరునా సీపీఐ (యం-యల్-న్యూడెమోక్రసీ) ఎర్రెర్రని పోరాటపు లాల్ సలామ్‌లు తెలియజేస్తున్నది.

కమ్యూనిస్టు విప్లవ యోధులు, సారధులు, అగ్రనాయకులు కామ్రేడ్స్ చారుమంజుందార్, సత్యనారాయణసింగ్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డిలకు సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) అరుణాంజలి ఘటిస్తోంది.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం తరువాత మరొక్కమారు దేశం ఎజండాపైకి వచ్చిన సాయుధ బరి నక్సల్బరి రైతాంగ పోరాటం. దీని ప్రభావంతో దేశంలో, యితర ప్రాంతాల్లో విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన వేలాది అమరమూర్తులందరికి శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి అమరత్వం పొందిన కామ్రేడ్స్ పంచాది కృష్ణమూర్తి, చాగంటి భాస్కరరావు, సుబ్బారావు పాణిగ్రాహి, నిర్మల, గణపతి, దేవినేని మల్లిఖార్జునుడు, వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం, రాజారాంరెడ్డి మొదలగు వందలాది విప్లవమూర్తులకు మా రెడ్ శల్యూట్.

గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటనా పోరాటంలో అమరత్వం పొందిన విప్లవవీరులందరికీ ఎర్రెర్రని దండాలు.

'అత్యవసర పరిస్థితి' చీకటి రోజుల్లో పార్టీ రాష్ట్ర కేంద్ర బాధ్యతలు నిర్వహిస్తున్న కా॥ నీలం రాంచంద్రయ్యను, పీడీయస్‌యు నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ని క్రూరంగా ఫాసిస్టు కాంగ్రెస్ పొట్టన పెట్టుకొంది. ఆ మరుసటి సం॥రం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కా॥ పొట్ల రామనర్సయ్యను, కామ్రేడ్స్ గొట్టిముక్కల జానకిరాంరెడ్డి, శ్రీపాద శ్రీహరి, నారాయణలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాంగ్రెసు ప్రభుత్వం దారుణంగా కాల్చి చంపింది. పోరాట ప్రారంభ దినాల్లోనే రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ బత్తుల వెంకటేశ్వరరావుని, సూర్యనారాయణని కాంగ్రెసు ప్రభుత్వం బలికొన్నది. రాష్ట్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్స్ చంద్ర కృష్ణమూర్తి, ధర్మన్న, సురేష్‌లను క్రూరంగా పోలీసులు కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. కాచనపల్లి, ముస్మి ప్రాంతాల్లో కామ్రేడ్స్‌ను పట్టుకొని కాల్చి చంపి ఇదే కట్టు కథను వల్లించారు. వీరందరికి వినమ్రంగా పార్టీ రాష్ట్ర కమిటి జోహార్లు ప్రకటిస్తోంది.

అతివాద, అరాచకవాదులచే హత్య చేయబడిన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కా॥ విక్రం, పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు, సుదీర్ఘకాలం అజ్ఞాత జీవితంలో గడిపిన కా॥ గడ్డం వెంకట్రామయ్య (దొరన్న), కా॥ యానాల మల్లారెడ్డి, కా॥ బోగా శ్రీరాములుతోపాటు వివిధ జిల్లాల్లో అమరులైన కామ్రేడ్స్ అందరికీ పార్టీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది.

ఇటీవలే మరణించిన సీపీఐ (యం-యల్) ప్రధాన కార్యదర్శి కా॥ కె. రాంచంద్రన్, ఒరిస్సా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు

ఖమ్మంలో 10 వేల మంది మహిళల మహా ప్రదర్శన





23.10.2008న ఖమ్మం పట్టణం మహిళల ర్యాలీతో ఎరుపెక్కింది. వివిధ నినాదాల ప్లేకార్డులు, పీఓడబ్ల్యూ జెండాలు ధరించిన పది వేల మంది మహిళలు పట్టణపురవీధులలో కదం తొక్కారు. సుమారు 3 గం॥లపాటు ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతాన్నంతా దిగ్బంధనం చేశారు. ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) సంఘాల ఆధ్వర్యంలో వేలాది మహిళలు తమ సమస్యల మీద ర్యాలీ చేయడం యిటీవల కాలంలో విశేషమైనది. అందునా ఒక్క జిల్లాకు చెందిన మహిళలే యింత మంది పెద్దయెత్తున కదిలిరావడం పుర ప్రముఖుల్లో, రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది.

ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు కదిలి వచ్చారు. ముఖ్యంగా అంతా శ్రామిక మహిళలే. గిరిజన ప్రాంతాల నుంచి, మైదాన ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లా కేంద్రానికి 200 కి.మీ. నుంచి, 5 కి.మీ. దాకా ఉద్యమ జెండాలతో కదిలి వచ్చారు. చంకన చంటి పిల్లలను ఎత్తుకుని వచ్చిన వారు, కాళ్ళకు చెప్పులు సైతం తగిన విధంగా లేనివారు యీ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) గ్రామీణప్రాంతంలోని ఇందిరా క్రాంతి పథం పేరున ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం సహాయక సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులనూ, స్వయం సహాయక సంఘాలలో చేరిన సభ్యులను కలిపి "ఐకెపి వర్కర్స్ అండ్ మెంబర్స్ యూనియన్" ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పరిచింది. యీ ఆర్గనైజింగ్ కమిటీని 25 మందితో నియమించింది. జిల్లా స్థాయి జనరల్ బాడీ జరిపి వారి సమస్యలను చర్చించి వివిధ కార్యక్రమాలను తీసుకున్నది. సెప్టెంబర్‌లో గ్రామ పంచాయతీ స్థాయిలో ధర్నాలు జరిపి వారి సమస్యలను గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రాలు యివ్వాలని కార్యక్రమం తీసుకున్నది. యీ కార్యక్రమం జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరిగింది.

అలానే అక్టోబర్ 1 నుంచి 7 వరకు మండల స్థాయిలో

(మిగతా 15వ పేజీలో)


రాజేందర్ కె. షడంగికి విప్లవ జోహార్లు!


ఈ అమరవీరులందరూ తాము నమ్మిన ఆశయ సిద్ధి కోసం మొక్కవోని ధైర్యంతో పోరాడారు. వీరెవ్వరూ వ్యక్తిగత, కుటుంబ, యితర ప్రత్యేక అవసరాల కోసం మరణించలేదు. అందుకే వీరి ఆశయం ఉన్నతమయింది. అది సాధించే వరకు మరో మాట లేకుండా సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) పోరాడి తీరుతుంది. అమరవీరుల ఆశయ సాధనకి కృషి సాగిస్తుంది. ఈ క్రమంలో విప్లవోద్యమానికి ఆటంకంగా తలెత్తుతున్న సమస్యలను ఎలా చూడాలి? ఎలా తొలగించుకోవాలి?


సీపీయం నుండి విప్లవకారులు వేరుబడిన ఈ నాలుగు దశాబ్దాల కాల సమీక్షలో ఆనాడు సీపీయం నుండి విడివడటం ఎంతో సరయిందని రుజువయింది. సీపీయం తన రివిజనిస్టు విధానాల నుండి నేడు పాలకవర్గ విధానాలను రూపొందించుకొనే స్థాయికి దిగజారింది. రాష్ట్రంలో, కేంద్రంలో ఏ దళారీ పార్టీ అధికారంలోకి రావాలన్నా, దిగిపోవాలన్నా తమపై ఆధారపడే ఎత్తుగడలను రూపొందించుకొనే స్థాయికి చేరుకొంది. సూటిగా చెప్పాలంటే ఈ పార్టీ పూర్తిగా ఈ వ్యవస్థ పరిధికి లోబడి పోయింది. విప్లవ పంథాపై, పోరాటాలపై రాజకీయ, భౌతిక దాడులే లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అందుకే దీని నుండి విప్లవకారులు వేరు చేసుకోవడం నూటికి నూరుపాళ్ళు సరైంది.


కమ్యూనిస్టు విప్లవకారులు దేశ రాజకీయ పరిస్థితిపై ఆధారపడి తాము రూపొందించుకొన్న 'దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా' కోసం పోరాడటం, దాని కోసం త్యాగాలు చేయడం వృధా కాదు. హిమాలయ పర్వతం కంటే వీరి త్యాగాలు ఎత్తయినవి. విలువయినవి. వీరి త్యాగం కమ్యూనిస్టు ప్రతిష్టని పెంచింది. దేశంలో మార్క్సిజాన్ని- లెనినిజాన్ని పరిరక్షించింది. కమ్యూనిస్టు ముసుగు తగిలించుకొన్న సీపీఐ, సీపీయంల విధానాలను చీల్చి చెండాడింది. ఈ అమరత్వం భవిష్యత్‌పై విశ్వాసాన్ని అందించింది. ఎన్నో ఉన్నత ఫలితాలు సాధించింది. విప్లవకారుల నాలుగు దశాబ్దాల పోరు లేకపోతే దేశంలో నేటి మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం మిగిలేది కాదు. దాని అభివృద్ధికి సాగుతున్న కృషి వుండేది కాదు. భవిష్యత్ చీకటి మయమయ్యేది. అమరుల స్ఫూర్తి మార్గదర్శకంగా దేశంలో సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా అన్ని సవాళ్ళని ఎదుర్కొని విప్లవోద్యమం పురోగమిస్తోంది.


అదే సమయంలో ఏ స్థాయిలో విప్లవం విజయం సాధించాలో అది సాధించలేక పోయింది. దీనికి ప్రపంచంలో ముఖ్యంగా రష్యా, చైనా తదితర సోషలిస్టు దేశాల్లో జరిగిన మార్క్సిస్టు వ్యతిరేక పరిణామాలు తోడ్పడ్డాయి. అదే విధంగా దేశంలో వ్యూహం, ఎత్తుగడలు, నిర్మాణం అంచనాల్లో వుండే విభేదాలను విప్లవకారులు ఒక పద్ధతిగా, ఒక క్రమంలో పరిష్కరించుకోవడం గాకుండా వాటిని తీవ్రతరం చేసుకొన్నారు. కొన్ని సందర్భాల్లో మిత్ర వైరుధ్యాలను శత్రు వైరుధ్యాలుగా భావించారు. శత్రుపూరిత దూషణలకి, భౌతిక దాడులకి ఉపక్రమించారు. తత్ఫలితంగా విప్లవకారులు అనేక చీలికలకి పీలికలకి గురయ్యారు. ప్రారంభంలో చీలికల పరంపర కొనసాగింది. ఆ తదుపరి చీలికలు - ఐక్యతలు, తిరిగి చీలికలు - తిరిగి ఐక్యతలు కొనసాగుతున్నాయి. ఈ వాతావరణం విప్లవోద్యమంపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తున్నది.



పోట్ల రామనర్సయ్య



నీలం రాంచంద్రయ్య


విక్రం (మందడి సత్తిరెడ్డి)



బోగా శ్రీరాములు


చంద్ర కృష్ణమూర్తి


ధర్మన్న


ఆదిబట్ల కైలాసం


పంచాది కృష్ణమూర్తి


వెంపటాపు సత్యం


బత్తుల వెంకటేశ్వరరావు


దోరన్న

కొంత మంది ఎందుకు చీలుతున్నారో ఆ నిర్మాణంలోని కామ్రేడ్స్‌కే అర్థం కాదు. వీరు తమ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయం ఇంతా అంతా కాదు. ఈ వాతావరణంలో ఎంత పిచ్చివాడైనా ఒక పార్టీ పెడితే పదిమందిని పోగు చేసుకోగలుగుతామని పనికి మాలిన తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఆ పది మంది సమీకరణనేనా వారి లక్ష్యం? విప్లవం సాధించడం వారి లక్ష్యం కాదా? తాము ఉద్యమాలను ఏమి అభివృద్ధి పర్చాము? రాజకీయ ప్రభావాలు ఎంత వరకు కల్గిస్తున్నాము? వాటి భౌతిక శక్తి ఏ స్థాయిలో పురోగమిస్తున్నది? ఇవేవీ వీరికి అక్కరలేదు. వారి పేరు, వారి సంస్థ పేరు ఉనికిలో వుంటే అదే ఘనతగా భావిస్తున్నారు. డబ్బులు చేసుకోవడం, దేనికి జవాబుదారితనం లేక పోవడం వారి విధానంగా కొనసాగుతున్నది. ఎవరికీ జవాబుదారీ తనంగా ఉండకుండా, ఏ విషయాన్ని చర్చించని నిర్మాణాల క్రింద జీవించాలను కొంటున్నారు. వీరు జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో వుండరు, కనీస ఉద్యమాలకి సంబంధించిన ప్రయత్నాలుండవు. వారు జిల్లా కమిటీని ఏర్పర్చుకొంటారు. దీనికి ఎలాంటి లైసెన్సు అవసరం లేదు. వీరి ప్రయోజనాలకి అవసరమయితే రాష్ట్ర స్థాయి నిర్మాణం అని పేరు కూడా పెట్టుకొంటారు. వీరు స్వార్థ ఫలితాలు ఎక్కువగా పొందగలుగుతామనుకొంటే దేనికైనా సిద్ధపడతారు. ఇలాంటి వారికి రాజ్యం, పాలకవర్గాలు లక్ష్యం గాదు. ప్రజా పోరాటాలు, నిర్మాణం వీరి పని కాదు. విప్లవకారులపై విమర్శలకే వీరు అధిక ప్రాధాన్యతనిస్తారు. ఆ విధంగా విప్లవకారులకి వ్యతిరేకంగా, అతిమంగా విప్లవోద్యమాలకి వ్యతిరేకంగా, శత్రు ప్రయోజనాలకి లాభకరంగా వ్యవరిస్తుంటారు.

ఒకే విప్లవపార్టీ నిర్మాణంలో వుంటే ఇలాంటి అవకాశవాదులకి, అరాచకవాదులకి, స్వప్రయోజనదారులకి అవకాశం వుండేది కాదు. విప్లవ పార్టీల చీలికల మూలంగా కొన్ని పార్టీలు తమ నిర్మాణాలను కూడా చక్కదిద్దుకోలేక పోతున్నాయి. ఈ పార్టీల్లో వ్యక్తమయ్యే విభేదాలు పార్టీ పద్ధతుల్లో పరిష్కరించుకోవడం గాకుండా చీలికలకి దారితీసే స్థాయికి వెళుతున్నాయి.

చీలిపోయిన విప్లవకారులు ప్రధానంగా మూడు భాగాలుగా కొనసాగుతున్నారు. 1) ప్రజా యుద్ధ పంథాపై ఆధారపడిన మాస్‌లైన్ పార్టీలు 2) ఎన్నికలను వ్యూహాత్మకంగా బహిష్కరిస్తూ, ప్రజాపంథాని వ్యతిరేకిస్తూ లీగల్ ఆర్థిక, చట్టబద్ధ పోరాటాలను మొత్తంగానే బహిష్కరిస్తూ, దళాల ద్వారానే రాజ్యాన్ని ఎదుర్కోవడమే ఏకైక కర్తవ్యంగా భావించే అతివాదులు. 3) మితవాద విధానాలు ప్రధానంగా కలిగి వుంటారు. అవసరమని భావించినప్పుడు వీరు సీపీఐ, సీపీయంలతో ఎన్నికల పోత్తులకు అర్రులు చాస్తారు.

అందుకే ఒకటవ రకంగా భావించే విప్లవకారులు విడివిడిగా వుండాల్సిన ఆవశ్యకత ఎంత మాత్రం లేదు. వీరి మధ్య ఐక్యతా చర్చలు జరగాలి. ఇవన్నీ ఐక్యమయి ఒకే విప్లవ పార్టీగా ఏర్పడాలి. అంటే ఒకే రోజున ఇవి అలా ఏక పార్టీగా ఏర్పడతాయని కాదు. దాని కోసం కావల్సిన పరిపక్వతను, ఇంటిగ్రేషన్‌ని సాధించాలి. దాని కోసం యిరువైపులా కృషి వుండాలి. ఆ క్రమంలో ఐక్యతని సాధించాలి.

రెండవ వారయిన అతివాదులకు యితరులకు మధ్య కొనసాగుతున్న శత్రుపూరిత దూషణలను, భౌతిక దాడులని తక్షణం నివారించుకోవాలి. సిద్ధాంత, రాజకీయ సమస్యలపై ఐక్యకార్యాచరణకి కృషి జరగాలి. వీటిలో అభివృద్ధి సాధింపు మూలంగానే యిరువురి మధ్య శత్రుపూరిత విధానాలను నివారించుకోగల్గుతాం.

మూడవ వారితో రాజకీయ సమస్యలపై, ప్రజా సమస్యలపై ఐక్యకార్యాచరణను కొనసాగించాలి.

ఈ మూడు రకాల సంస్థల మధ్య శత్రుపూరిత వాతావరణాన్ని లేకుండా చేసుకోవాలి. వీటి మధ్య వాటి స్థాయిలో చర్చలు జరగాలి. అన్నింటి మధ్య ఒకేసారి చర్చలు జరగడానికి అవకాశం లేనప్పుడు అవకాశం వున్నవాటి మధ్యనైనా జరగాలి. ఒక వేళ ఏదేని రెండు సంస్థలే చర్చలకి సిద్ధమయితే ఆ రెండు సంస్థలూ చర్చించవచ్చు. కనీసం వీటి నుండి తగు కార్యాచరణనైనా అభివృద్ధి పరచాలి.

దేశంలో పరిస్థితులు అనుకూలంగా వున్న వాటిని కమ్యూనిస్టు విప్లవకారులు తగిన విధంగా సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. ప్రజలు మార్పుని కోరుకొంటున్నారు. ఆ మార్పు ఎలా వుండాలో నిర్ణయించుకొనే చైతన్యం వారిలో కొరవడింది. దాని ఫలితంగా పాలకవర్గాలు, రివిజనిస్టులు ప్రజలను తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఈ తతంగంలోన్నే, కొత్త కొత్త పార్టీలు పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ ఒకే తానులోని గుడ్డలే. అందుకే ప్రజల జీవన పరిస్థితిలో మౌలికమైన మార్పులు రావడం లేదు. ప్రజా అసంతృప్తిని, అలజడిని, ఆందోళనని తమకి అనుకూలంగా వీరు మరల్చుకొంటున్నారు. వీటన్నింటికి నిజమైన ప్రత్యామ్నాయం విదేశీ, దేశీయ దళారీల దోపిడీ, పీడన లేని నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనే ఒక్కటే పరిష్కారం. ఈ పోరాట దృక్పథాన్ని ప్రజా అసంతృప్తికి, అలజడికి, ఆందోళనకి గురవుతున్న కోటానుకోట్ల ప్రజలకి అందివ్వాలి. దాని బాధ్యత కమ్యూనిస్టు ~~విప్లవకారులపైనసే వున్నది. అంత~~ గురుతరమైన బాధ్యత కలిగిన కమ్యూనిస్టు విప్లవకారుల శక్తి ప్రజా అవసరాలకి తగినట్లుగాలేదు. అందుకే దాని కోసం శక్తివంతమైన విప్లవోద్యమాన్ని నిర్మించాలి. అలా నిర్మించేందుకు శక్తివంతమైన విప్లవ పార్టీ ఆవశ్యకత నేడు ఎంతైనా వుంది. అందుకే ఐక్యతను సాదిద్దాం. చీలికలని నివారిద్దాం. వర్గ పోరాటాలను ఉధృతం చేద్దాం.

వీటికి ఆటంకంగా వుండే అతివాద, మితవాద, అవకాశవాద, అరాచక ధోరణులను ఓడిద్దాం. అలవాటుపడిన ఈ సాంస్కృతిక భావజాలానికి వ్యతిరేకంగా చైతన్యవంతమవుదాం. విప్లవోద్యమాన్ని మెట్టు మెట్టుగా అభివృద్ధి పరుచుదాం. అమరవీరుల రక్తం వృధా కాదు. అది మనల్ని హెచ్చరిస్తోంది. బాధ్యతను గుర్తు చేస్తోంది. వారు మనకి ఆదర్శప్రాయులు. మార్గదర్శకులు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వెలుగులో నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయ లక్ష్యంగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా మార్గాన పోరు కొనసాగించడం ఫలితంగానే అమరవీరుల కలలను సాకారం చేసిన వారమవుతాం. వారికి నిజమైన విప్లవాంజలి ఘటించిన వారమవుతాం. అందుకే ప్రతి సంవత్సరం నవంబరు మొదటి వారాన్ని అమరవీరుల సంస్మరణవారంగా పాటిస్తున్నాం. దానిలో భాగంగానే ఈ సంవత్సరం నవంబరు మొదటి వారాన్ని రాష్ట్ర వ్యాపితంగా అమరవీరుల వర్ధంతి సభలను దిగ్విజయంగా జరుపుకుందాం.

అమరవీరులకి విప్లవ జోహార్లర్పిద్దాం. అమరవీరుల ఆశయ సాధన కోసం తుదికంటా పోరాడుదాం.

- సూర్యం

ప్రజలను ప్రక్కదారి పట్టించే పాలకవర్గాల పన్నాగాలు

సంపాదకీయం

అమెరికా ఆర్థిక సంక్షోభం మన దేశంపైన ఎంతో కొంత ప్రభావాన్ని చూపక తప్పదని కూని రాగాలు తీస్తూనే, అయితే పెద్దగా మాత్రం ప్రభావం చూపదని ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరం ప్రజలకు పదే, పదే భరోసా యిస్తూ వచ్చారు. వాళ్ల 'భరోసా'లో పస యెంత మాత్రం లేదని నిత్యం జరుగుతున్న పరిణామాలు తిరుగు లేకుండా రుజువు చేస్తున్నాయి. అన్ని ముఖ్యమైన రంగాలలోనూ డిమాండు పడిపోయి, వుత్పత్తుల సూచి నేల చూపు చూడటం మనం గమనిస్తున్నదే. పెట్టుబడిదారులు, వ్యాపారుల ప్రముఖ అఖిల భారత సంస్థ 'అసోచాం' తాజాగా విడుదల చేసిన ప్రకటన ఈ వాస్తవానికే అద్దం పడుతున్నది. 'దీపావళి తర్వాత ఉద్యోగాల పరిస్థితి' అనే దాని అధ్యయన పత్రంలో దీపావళి తర్వాత 10 రోజులలో తమ సిబ్బందిలో 25 నుండి 30 శాతం వుద్యోగులను యింటికి పంపటానికి ఏడు ముఖ్యమైన రంగాలలోని పారిశ్రామిక సంస్థలు పథకాలు రూపొందించుకున్నట్లు అసోచాం పేర్కొంది. ఈ సంస్థలు ఈ దీపావళికి బోనసును కాని, ఎక్స్‌గ్రేషియాను కాని తమ కార్మికులకు చెల్లించ లేక పోయాయి. దీనికి తోడు యిప్పుడు కార్మికులను పెద్ద మొత్తంలో తగ్గించటానికి పూనుకుంటున్నాయి. ఇన్‌ఫర్మేషను టెక్నాలజీ, విమానయానం, ఉక్కు, ద్రవ్య సేవలు, రియల్ ఎస్టేట్, సిమెంట్, నిర్మాణరంగం - ఈ ఏడు రంగాలలోనూ కార్మికుల కత్తిరింపుకు పథకాలు రూపొందుతున్నాయని అసోచాం పేర్కొంది. అమెరికా ఎగుమతుల మీద ప్రధానంగా ఆధారపడి వున్న బట్టలు, వజ్రాలు, రత్నాలు మొదలైన రంగాలలోనూ వుత్పత్తిలో కోత, కార్మికుల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఆటో మొబైల్ రంగం యిదే పరిస్థితిని యెదుర్కొంటున్నది. అశోక లేలాండ్ కంపెనీ - వారంలో ఐదు రోజులే ఫ్యాక్టరీని నడపాలని, మిగతా రెండు రోజులకు వేతనాలలో కోత కోయదలచుకున్నామని ప్రకటించింది. ఏతా, వాతా తేలుతున్నదేమిటంటే దేశంలో కార్మికులూ, ఉద్యోగులూ తీవ్రమైన కష్టకాలాన్ని యెదుర్కో బోతున్నారు. మరోప్రక్క అన్ని వస్తువుల ధరలు, ముఖ్యంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతూ, సామాన్య ప్రజల జీవన పరిస్థితులను తీవ్రంగా దిగజారుస్తున్నాయి. రైతుల, నేత కార్మికుల, యితర చేతి వృత్తుల శ్రామికుల ఆత్మహత్యల పర్వం నిరాఘాటంగా కొనసాగుతూనే వుంది. విద్యుత్ కొరత, ఎరువుల కొరత, విత్తనాల కొరత, రుణాల కొరత, అధిక వడ్డీలు, గిట్టుబాటు ధరల సమస్య - ఎప్పుడూ ఏదో సమస్య రైతులను వేధిస్తూనే వుంది. వీధుల్లోకి తెస్తూనే వుంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా ఆర్థిక సంక్షోభ ప్రభావం 'గోరు చుట్టు మీద రోకలి పోటు'లా తయారయింది.

ఈ సమస్యలేవీ ఏ పాలకవర్గ పార్టీకి పట్టలేదు. వీటికి వారి వద్ద పరిష్కార మార్గం కూడా లేదు. అందుచేత ప్రజలను ఈ సమస్యల నుండి ప్రక్కదారి పట్టించే మార్గమేదో వారికి కావాలి. సంఘ్ పరివార్ 'హిందుత్వ' నినాదాన్ని మళ్లీ దుమ్ము దులిపి బయటకు తీసింది. జమ్మూ కాశ్మీర్‌లో హిందూ, ముస్లిముల మధ్య గొడవలు సృష్టించింది. ఒరిస్సా, కర్నాటకలలో క్రైస్తవ మైనారిటీల మీద దాడులకు పూనుకుంది. దహనకాండలకు, హత్యాకాండలకు, అత్యాచారాలకు పూనుకుని, హిందూ, క్రైస్తవ మతస్తుల మధ్య విద్వేషాన్ని రగుల్కొలపటానికి పూనుకుంది. ఆ విధంగా హిందువుల రక్షకుడిగా గుర్తింపు సంపాదించుకొని వచ్చే ఎన్నికలలో హిందూ ఓట్లను కొల్లగొట్టాలనేది దాని దుష్ట పన్నాగం. ఈ లక్ష్య సాధన కోసం అది దేశ వ్యాపితంగా ఎక్కడ, ఏ అవకాశం దొరికినా ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టించటానికి పూనుకుంటున్నది. ఈ కుట్రలో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా భైంసాలో కావాలని పనిగట్టుకొని మత ఘర్షణలు సృష్టించి ముగ్గురిని బలితీసుకుంది. పటోలి గ్రామంలో, పసిపాపలతో సహా ఆరుగురి దారుణహత్యకు కారణమయింది. ఆగస్టు 24న కాన్పూర్‌లోని రాజీవ్‌నగర్‌లో ఒక లాడ్జిలో బాంబులు తయారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు భజరంగ్ దళ్ కార్యకర్తలు చనిపోవటం, ఘటనా స్థలం నుండి 8 కిలోల పేలుడు పదార్థాలు పోలీసులకు దొరకటం విశేషం. కాన్పూరు, ఫిరోజాబాద్‌లలో బాంబులు పేల్చి మత ఘర్షణలు సృష్టించటానికి రూపొందించుకున్న పథకాల పత్రాలు మృతుల వద్ద పోలీసులకు దొరికాయి. కొన్ని సంవత్సరాల క్రిందట నాందేడ్‌లో బాంబులు తయారు చేసే క్రమంలో అవి పేలి ఇద్దరు ఆర్.యస్.యస్. కార్యకర్తలు గాయపడిన వార్తను కూడా మనం గుర్తుంచుకోవాలి. దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న బాంబు పేలుళ్లలో సంఘ్ పరివార్ శక్తుల పాత్ర త్రోసి వేయదగింది యెంత మాత్రం కాదు. ముస్లిం మైనారిటీలకు చెందిన కొందరు యువకులు కూడా మతం పేరుతోనో, కక్ష సాధింపు పేరుతోనో ప్రక్కదారి పట్టి వినాశకరమైన, ఆత్మహత్యా సదృశమైన టెర్రరిస్టు చర్యలకు పూనుకుంటున్నారు. వీరి ఈ చర్యలను హిందూ మతోన్మాద శక్తులు మత ఘర్షణలను సృష్టించటానికి, బాంబు విస్ఫోటనాలకు సాకులుగా వుపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఈ చర్యలను సాకులుగా వుపయోగించుకొని అమాయక ముస్లిం యువతీ, యువకులను వేధించటానికి, అరెస్టులు, చిత్రహింసల పాల్జేయటానికి, బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపటానికి వుపయోగించుకుంటున్నారు. ఒక వైపు హిందూ మతోన్మాద శక్తులు హిందువులను వారి సమస్యల నుండి ప్రక్కదారి పట్టిస్తూ వారిని ఓటు బ్యాంకులుగా మార్చుకో చూస్తుంటే, మరోప్రక్క ముస్లిం మతోన్మాద శక్తులు ముస్లిం రక్షకులుగా తమను తాము చిత్రించుకుంటూ, వారిని ప్రక్కదారి పట్టిస్తున్నారు. తమ ఓటు బ్యాంకులుగా మార్చుకో చూస్తున్నారు. (భారత దేశంలోని ముస్లిములను పాలక వర్గాలూ, ముస్లిం మతోన్మాద సంస్థలూ యెలా నిర్లక్ష్యం చేశాయో, ముస్లిముల ఆర్థిక, సాంఘిక, రాజకీయ వెనుకబాటు తనాన్ని లెక్కలతో రుజువు చేసిన సచార్ కమిటీ నివేదిక బట్టబయలు చేసింది). భారతదేశంలో జరిగిన యిటీవలి బాంబు ప్రేలుడు సంఘటనల వెనుక అమెరికా, ఇజ్రాయిల్ గూఢచారి సంస్థల పాత్ర వుందని రష్యా పత్రికలలో వచ్చిన వార్తలు కొట్టిపారేయ దగినవి కావు. ప్రజలను నిజ సమస్యల నుండి ప్రక్కదారి పట్టించటానికి, వారి వర్గ ఐక్యతను దెబ్బతీసి, వారి పోరాటాలను నీరుగార్చటానికి సామ్రాజ్యవాద శక్తులు, వారి అడుగులకు మడుగులొత్తే దేశీయ పాలకవర్గాలు యెంతకైనా తెగిస్తాయని చరిత్ర చెబుతోంది.

ప్రాంతీయ దురహంకారాన్ని, వివిధ ప్రాంతాల ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి తన ఓటు బ్యాంకును పెంపొందించుకోవాలని మహారాష్ట్ర నవ నిర్మాణ్ సమితి నాయకుడు రాజ్ ఠాక్రే రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటున్నాడు. పర్యవసానంగా మహారాష్ట్రలో, ముఖ్యంగా ముంబాయిలో ఉత్తరాది వారిపై దారి తప్పిన మరాఠీ యువకుల దాడులు జరుగుతున్నాయి. సామాన్య శ్రామిక ప్రజల ఆస్తులు ధ్వంసమవుతున్నాయి. వారి ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. పర్యవసానం ఠాక్రే మరాఠీల హీరోగా మారుతున్నాడు. మరోప్రక్క ఈ దాడులకు వ్యతిరేకంగా గొంతు విప్పటం ద్వారా బీహార్‌లో రాజకీయ బద్ధ శత్రువులైన లాలూ, నితీష్‌లు సంయుక్తంగా బీహారీల రక్షకులుగా రూపుదాలుస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో వరుసగా పాలకులుగా వుండి ప్రజల సమస్యలకు కారకులైన, వారి అసంతృప్తికి గురి కావలసిన మాయావతి, ములాయంలు హిందీ ప్రజల చాంపియనులుగా మారుతున్నారు.

ప్రజలు ఈ పరిణామాలను హెచ్చరికగా తీసుకోవాలి. దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు తమ మధ్య ఐక్యతను పెంపొందుకోవాలి. అభివృద్ధి నిరోధక శక్తుల కుట్రలను భగ్నం చేయాలి. ప్రజలను చైతన్య పరచాలి. ఐక్యం చేయాలి. అసలైన సమస్యలపై పోరాటాలకు సమీకరించాలి.

(అస్సాంలో 22 చోట్ల వరుస బాంబు ప్రేలుళ్లు జరిగాయని, డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారని, వందలాది మంది గాయాల పాలయ్యారని ఈ సంపాదకీయం రాస్తున్న సమయంలో (తే. 30.10.08) టెలివిజన్లు ప్రసారం చేస్తున్నాయి. ప్రజలు, ప్రజాస్వామిక శక్తులు అజాగరూకులై వుంటే, అనైక్యంగా వుంటే అభివృద్ధి నిరోధక శక్తులు - వారి పేరు, రంగు, మతం, జాతి ఏదైనా యెంత విచ్చలవిడిగా, ప్రజాకంటకంగా వ్యవహరించగలరో ఈ సంఘటన మరో రుజువు. మరో హెచ్చరిక)

కుల వ్యవస్థ - ఆచరణాత్మక కార్యక్రమం - ఫలితాలు

సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) గత కొన్ని సంవత్సరాల నుండి కుల సమస్యపైన ప్రత్యేకంగా ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 24 నుండి 30 వరకు కుల నిర్మూలన-ఆచరణాత్మక కార్యక్రమం నిర్వహిస్తున్నది. పార్టీ పిలుపు మేరకు ఈ సంవత్సరం ఈ సమస్యపై 25 మందితో ఉన్న కొమరారం పార్టీ శాఖ (ఖమ్మం జిల్లా, ఇల్లెందు మండలం) సమావేశం జరుపుకుని, కుల నిర్మూలన సమస్యను చర్చించింది. అలాగే, గ్రామంలో కుల ప్రభావం గతంలో, ఇప్పుడూ ఎలా ఉందో పరిశీలించాలని నిర్ణయించింది. గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులను (కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు) ఆహ్వానించి, ది. 24.09.2008న గ్రామంలో సభ జరిపి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా వీరికి కొన్ని బహుమతులను అందజేశాం.

గ్రామంలో 80 సంవత్సరాల క్రితం కుల కట్టుబాట్లు కొనసాగిన తీరును, ప్రస్తుతం కుల ప్రభావం ఏ విధంగా ఉందనే విషయాన్ని పరిశీలించడం జరిగింది. కుల నిర్మూలనకు పార్టీ చేసిన కృషిని కూడా పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలన కోసం 25 మంది పార్టీ సభ్యులు, గ్రామంలోని వివిధ కులాలకు చెందిన 30 మందితో మాట్లాడటం జరిగింది.

దళితులు చెప్పిన రిపోర్టు:- "గ్రామానికి దళితుల గుడిసెలు, ఇతర కులాల వారి ఇండ్లకు దూరంగా ఉండేవి. గ్రామంలోని ఇతర కులాల వారిండ్లకు మేము ఏదైనా పని మీద పోతే, మేము కులం తక్కువ వాళ్ళమని, మా గాలి సోకితే మైల బడిపోతారని వారింటికి దూరంగా వాకిట్లో ఉంచేవారు. మేము తిరగొచ్చాక, మేము నిలబడిన భూమితో సహా మైలబడిందనీ, యాపాకులతో పసుపునీళ్ళు చల్లుకునే వారు" అని గ్రామ దళితులు మాకు చెప్పారు.

"మాకు వీరు అన్నం పెట్టాల్సి వస్తే, వారింటి ఇదుపుల దగ్గర కందువ పరచుకోమని పై నుంచి కుక్కకు పెట్టినట్లుగా పెట్టేవారు. మాకు మంచినీళ్ళు యివ్వాల్సివస్తే, దోసిళ్ళు చాపమని, వారు చెంబులతోటి ఎత్తిపోస్తే త్రాగే వాళ్ళం" అని చెప్పారు.

"శూద్ర వర్ణానికే చెందిన మంగలి మాకు క్షవరాలు చేయాల్సి వస్తే, మైల బడతామని నడుముకు గోనె సంచులు చుట్టుకునేవారు. మాకు క్షవరాలు చేసిన తర్వాత మైల అంటిందని స్నానాలు చేసేవారు. ఆ తర్వాత పై కులాల వారికి క్షవరాలు చేసేవారు.

బిసిలు కొంత మంది దళితులను పాలేర్లుగా పెట్టుకునే వారు. మాతోటి వ్యవసాయ పనులతోపాటు, తమ ఇంటి దగ్గర వాడుకోవడానికి గాబులలోకి నీరు తెప్పించే వారు. ఇలాంటి అనేక రకాలైన పనులను చేయించుకునేవారు."

"మాతో వడ్లు దంపుడు, జొన్నలు తొక్కడం లాంటి పనులు చేయించుకునేవారు. అదే ఈ దళిత పాలేరుకు అన్నం తీసుకు పోవాల్సి వస్తే, పాలేరు ఇంటి నుంచి సద్ది వస్తే, ఆ సద్దిని ముట్టుకుంటే మైలబడతామని, కర్రకు తగిలించుకుని, మనిషికి తగలకుండా తీసుకుపోయి, దూరంగా పెట్టి తినమనేవారు. మాతో చేయించుకునే పనులకు అంటని మైల అన్నం ముట్టుకుంటేనే అంటుతుందా?" అని వారు ప్రశ్నించారు.

గ్రామంలో, పూర్వకాలంలో ప్రభుత్వం తీయించిన మూడు పాత బావులున్నాయి. ఆనాడు నీళ్ళకు బాగా ఎద్దడి సమస్య ఉండేది. ఆ రోజులలో నీళ్ళు తోడుకోవడానికి బకెట్లు కూడా లేవు.

ఆ కాలంలో దళితులు పశువుల చర్మంతో తయారుచేసిన తోలు బకెట్లు ఉండేవి. వీటి ద్వారా అన్ని కులాల ప్రజానీకం బావుల నుండి నీరుతోడుకునే వారు. అదే దళితులను ఆ బావి మీద చేయి వేయనిచ్చేవారు కాదు. వారు పొరపాటున నీళ్ళకు పోతే, ఇతర కులాలు ఎవరో ఒకరు తోడి పోసేంత వరకు దూరంగా ఉండాల్సిందే. దళితులు తయారు చేసిన తోలు బకెట్లతో మాత్రం నీళ్ళు చేదుకోవచ్చు. కాని, వారిని మాత్రం నీళ్ల చేదుకోనివ్వరన్న మాట! ఇదే బావులను మాత్రం మళ్ళీ అదే దళితులు తవ్వుతారు. అప్పుడులేని మైల ముట్టుకుంటే వస్తుందట!

దళిత విద్యార్థులు బడులకు వెళితే, వీరిని వేరుగా కూర్చోబెట్టి, విద్యను బోధించేవారు. గ్రామంలో హోటళ్లలో, వివిధ షాపులలో దళితులకు వేరే గ్లాసులు పెట్టే వారు. రెండు గ్లాసుల పద్ధతి కొనసాగింది. గ్రామంలో కుల ఆచార, వ్యవహారాల వుల్లంఘనల గురించి పంచాయతీలు జరుగుతున్న దగ్గరకు దళితులు పోవడానికే వీలులేదు. ఒకవేళ వాళ్ళ సమస్య ఏదైనా వుండి పోయినా, ఆమడ దూరంలో ఉండి చెప్పాల్సిందే.

దళితులు చేసిన పనులకు మేరల రూపంలో, కుప్పకొట్టిన రోజున వడ్లను ఇచ్చేవారు. కుప్ప గొట్టిన దగ్గరకు దళితుడు వెళితే, వడ్లకు మైలంటుతుందని కల్లంలో ఉన్న వడ్లన్నీ కొలుసుకుని ఇంటికి చేర్చుకున్నాక, పొద్దస్తమానం ఉంచుకుని సాయంత్రం తనకివ్వాల్సిన మేరను కొల్సిచ్చేవారు.

ఇతర కులాల వారు దళితులను సంబోధించే తీరు ఈ విధంగా కొనసాగేది. పురుషులను 'అరె, ఒరె, ఏమిరా" అని పిలిచేవారు. స్త్రీలను "అసే, ఒసే, ఏమే?" అని పిలిచే వారు. ఈ విషయాలన్నీ 80 సంవత్సరాల నాడు గ్రామంలో అమలయ్యేవి. ఈ విషయాన్నీ దళితులు చెప్పారు. ఇవి వాస్తవంగా జరిగాయని, బిసి, ఓసి, ఎస్‌టి మహిళలు, పురుషులు ఒప్పుకున్నారు. బిసి, ఓసి, మహిళలు, పురుషులతో మాట్లాడిన సందర్భంగా ఈ పద్ధతులన్నీ గ్రామంలో అమలయ్యాయనీ, వీటన్నిటినీ "మేం కూడా ఆచరించిన వారమేనని" తమ అనుభవాలను చెప్పినారు.

ఈ విధానం 80 సంవత్సరాల క్రితం కొనసాగింది. ఈ గ్రామంలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఏర్పడినాక కొన్ని ఊహించని మార్పులు జరిగాయని గ్రామ ప్రజలు ఈ క్రింది వివరాలు వెల్లడించారు.

ఈ రోజు దళితుల ఇండ్లల్లో ఫంక్షన్లు జరిగితే, యాభై శాతం ఇతర కులాల ప్రజలు వచ్చి భోజనాలు చేస్తున్నారు. ఇతర కులాల వారు కూడా వారిండ్లల్లో జరుగుతున్న ఫంక్షన్లకు దళితులను పిలుస్తున్నారు. బడులలో వేర్వేరుగా కూర్చునే పద్ధతి తొలగిపోయి, ఒకే కుటుంబంలోని సభ్యుల్లాగా వ్యవహరిస్తున్నారు. దళితులు ఇతర కులాల ఇండ్లల్లోకి ఇతర కులాలు దళితుల ఇండ్లల్లోకి వచ్చిన సందర్భంగా కుర్చీలు, మంచాల మీద కూర్చునే వాతావరణం ఏర్పడింది. దళిత వాడలు వేరుగా ఉంచే పరిస్థితి మారి, దళితులు, యితర కులాల వారు ఒకే దగ్గర నివాసం వుంటూ అందరూ కలిసిపోయే స్థితి వచ్చింది.

ఒకనాడు పాలేరుకు సద్ది తీసుక పోవడానికి కర్రతో పట్టుకపోయివారే, ఈనాడు ఆ పాలేరింట్లో వండినది వీరు తినడం, వీరింట్లో వండినది వారికి పెట్టడమనే మార్పు దాకా వచ్చింది.

ఒకనాడు దళితులకు క్షవరాలు చేస్తే, మైలంటుతుందని గోనె సంచులు చుట్టుకుని స్నానాలు చేసే స్థితి నుంచి దళితుల నుండే ఒకతను ఈ వృత్తి నేర్చుకుని అన్ని కులాల వారికి క్షవరాలు, గడ్డాలు చేసే స్థితి వరకు మార్పు వచ్చింది.

మంచినీళ్ళు దోసిల్లతో త్రాగిన వారి చేతులతోనే, ఈ రోజు నీళ్ళు అందిస్తే, త్రాగే పరిస్థితి ఏర్పడింది.

ఇంటి ముందుకు దళితులు వస్తే, పసుపు నీళ్ళు చల్లుకునే స్థితి మారిపోయి, వారిండ్లలోనే దళితులు అన్ని రకాల పనులు చేస్తున్నారు.

ఊరిలో బావిని ముట్టుకుంటేనే మైలంటుతుందనే స్థితి నుంచి దళిత వాడల బావుల నుంచి నీళ్ళు తోడుకు పోతున్నారు.

దళితులను "అరే, ఒరే, అసే, ఒసే ఏమే, ఏమిరా" అనే స్థితి నుండి పేరు పెట్టి పిలవడం లేదా అక్కా, అన్నా అని పిలిచే పరిస్థితి ఏర్పడింది.

గ్రామంలో హోటళ్లలో, ఇతర షాపుల దగ్గర దళితులకు వేరుగా గ్లాసులను ఏర్పాటు చేసే విధానం పూర్తిగా రూపుమాపబడింది.

ఈ గ్రామంలో కులాంతర వివాహంతో కుటుంబంలో వచ్చిన మార్పులు

ఈ గ్రామంలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ)కి సానుభూతిపరులుగా వుండే ఒక బిసి కుటుంబం వుంది. ఈ కుటుంబంలో నలుగురు అన్నదమ్ములున్నారు. వీరి తల్లిదండ్రులు కుల కట్టుబాట్లను, సాంప్రదాయాలను బలంగా నమ్మేవారు. వందకు వంద శాతం అమలు చేసే వారు కూడా. దళితులను అంటుకుంటే మైలబడతామని భావించి వారిని ఆమడ దూరంలో ఉంచడంలో వీరి తల్లి కొమరారంలో మొదటి మహిళగా చెప్పుకోవచ్చు. ఏ విషయంలోనైనా రాజీ పడుతుంది కానీ, కులం పట్టింపుల విషయంలో మాత్రం ససేమిరా అంటుంది. ఈ నలుగురన్నదమ్ములలో ముగ్గురన్నదమ్ములు పార్టీ సభ్యులైనారు. వీరిలో మూడవ వాడు పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ ఈ క్రమంలోనే దళితుల అమ్మాయిని ప్రేమించాడు. ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే ఆత్మహత్యే శరణ్యమని తల్లిదండ్రులు హుకుం జారీ చేసినారు. దళితుల్లో కూడా పూర్తిగా వెనుకబడిన కులమైన అమ్మాయిని నీవు చేసుకోవడమేమిటనీ, చేసుకోవద్దని, ప్రధానంగా అబ్బాయి తల్లి తీవ్రంగా వత్తిడి చేసింది. ఈ వత్తిడులనన్నింటినీ అదిగమించి ఎట్టకేలకు బిసి అబ్బాయి దళిత అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత ఈ జంటను అబ్బాయి కుటుంబ సభ్యులు కొంత కాలం ఇంటికి రానివ్వలేదు. క్రమంగా కాలం గడిచిన కొద్దీ జరుగుతున్న మార్పులతో ఈ జంట వారింటికి పోవడం, ఆ కుటుంబం, వీరింటికి రావడం క్రమంగా జరుగుతూ వచ్చింది. "కోడలుగా వద్దని, దళితురాలని, దళితులను ముట్టుకుంటేనే మైలబడతామని ఒకనాడు పూర్తిగా వ్యతిరేకించిన అత్తే, ఈనాడు అదే కోడలితో కలిసి జీవనం కొనసాగిస్తున్నది. ఇదొక పెద్ద మార్పు. ఈ మార్పును తీసుకురావడం వెనుక సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) కృషి ఎంతగానో వుంది. ఈ చెప్పుకోతగిన గొప్ప మార్పు ఉన్నప్పటికి, ఈ జంట కొన్ని శుభకార్యాలు జరిగిన సందర్భంగా అవమానాలకు గురవుతూనే వున్నది. కులాంతర వివాహం చేసుకున్న ఈ జంట సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ)లో పూర్తి కాలం కార్యకర్తలుగా పనిచేస్తూ పీడిత ప్రజల సేవకే జీవితాలను అంకితం చేసుకున్నారు.

నాటి నుండి నేటి మార్పుల వరకు న్యూడెమోక్రసీ చేసిన కృషి

కొమరారం గ్రామంలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) గత 40 సంవత్సరాల నుండి పనిచేస్తున్నది. ఈ గ్రామంలో వివిధ కులాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

బంజారాలు 167 కుటుంబాలు, వడ్రంగులు 27 కుటుంబాలు, గౌడులు 25, తెలగలు 18, చాకలి 11, మాదిగలు 36, మాలలు 38, పద్మశాలీలు 2, కుమ్మరి 5, వైశ్యులు 2, బ్రాహ్మణులు 1, మంగలి 1, ముస్లిములు 1, గొల్లలు 25, కమ్మ 2, కోయలు 75. మొత్తం 436 కుటుంబాల వారు ఈ గ్రామంలో నివసిస్తున్నారు. వీరిలో మిగతా కులాలతో పోల్చుకున్నప్పుడు దళితులు బాగా ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా వెనుకబడిన వారు. సాంఘికంగా ఎన్నో అవమానాలకు, అణచివేతలకు గురైనారు. న్యూడెమోక్రసీ ఈ గ్రామంలో ప్రవేశించిన తర్వాత దళితుల కోసం, ప్రత్యేకంగా కృషి చేయడం ప్రారంభించింది. సాంఘికంగా మార్పులు తీసుకరావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది.

ముఖ్యంగా, ఆర్థికంగా వీరిని అభివృద్ధి చేయడానికి కృషి చేసింది. అన్ని కులాలకు ముఖ్యంగా పేద వర్గాలకు పోడు భూములను నరికిస్తున్న సందర్భంలో వీరికి కూడా సారవంతమైనటువంటి పోడు భూములను సాధించి పెట్టడం జరిగింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నీటి వనరుల పథకాలను, పండ్ల తోటల మొక్కలను తదితర ప్రభుత్వ పథకాలను వీరికి వర్తింపజేసి ఈ భూములలో అమలు జరిగే విధంగా ప్రత్యేకమైన కృషిని కొనసాగించింది. వీరిని ఆర్థికంగా అభివృద్ధి పథంలో తీసుకరావడానికి తన కృషిని చెప్పుకోదగిన విధంగా కొనసాగించింది.

గ్రామంలో కుల వివక్షత, అంటరానితనం ప్రభావాలను తగ్గించటానికి సదస్సులు, సమావేశాలను పార్టీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు వందల సంఖ్యలో నిర్వహించటం జరిగింది. వర్గ సమాజ నిర్మూలన ద్వారా అన్ని రకాల దోపిడీల నిర్మూలన, ఉపరితల అంశమైన కుల నిర్మూలన కూడా అంతిమంగా జరుగుతుందనే శ్రామిక వర్గ చైతన్యాన్ని, దృక్పథాన్ని అభివృద్ధి చేయడానికి తీవ్రంగా కృషి చేసింది. గ్రామంలో కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నది. ఈ సంవత్సరం ప్రత్యేక వేదికను ఏర్పాటుచేసి, వేలాది మంది ప్రజలను సమీకరించి 5 జంటలకు కులాంతర వివాహాలను నిర్వహించింది. సహపంక్తి భోజనాలను, ఒకరి యియింటిలో ఒకరు భోజనాలు చేసే కార్యక్రమాలను కొనసాగిస్తున్నది. బయట ప్రాంతాల నుంచి వేర్వేరు కులాల జంటలొస్తే కులాంతర వివాహాలను నిర్వహించి, వారికండగా నిలబడి ప్రోత్సహించింది. గ్రామంలో అగ్రకులాల పెత్తనాన్ని వ్యతిరేకించి, పెత్తందార్ల దౌర్జన్యాలను ఎండగట్టి దళితులను నాయకత్వ స్థానంలోకి తీసుకొచ్చింది.

ఈ గ్రామంలో 25 మంది పార్టీ సభ్యులుండగా, ఇందులో 8 మంది దళితులు. వీరు వివిధ ప్రజాసంఘాలలో ప్రధాన బాధ్యతలలో ఉన్నారు. గ్రామంలో వీరు అన్ని వర్గాల ప్రజానీకానికి నాయకత్వం వహిస్తున్నారు.

పార్టీ ఆధ్వర్యంలో నరికించిన పోడు భూములలో దళితులు ఆధునికమైన పంటలను పండించి ఆర్థికంగా అభివృద్ధి అయ్యారు. తమ పిల్లలను కూడా చదివించడానికి పూనుకున్నారు. దీనితో వారి సంస్కృతిలోనూ మార్పు వచ్చింది. ఈ మార్పులతో కుల కట్టుబాట్లు సడలుతూ వచ్చాయి. గత సనాతన సాంప్రదాయాలు, అస్పృస్యత తగ్గడానికి వారి ఆర్థిక జీవనంలో వచ్చిన మార్పే ముఖ్య కారణం.

భౌతికంగా వస్తున్న మార్పులతోపాటు న్యూడెమోక్రసీ పార్టీ సాగించిన కృషి గ్రామంలో కుల సంబంధాలలో కొన్ని ముఖ్యమైన అనుకూల మార్పులు రావటానికి కారణమయింది. పార్టీ సాగించిన కృషి వల్ల వివిధ కులాల పేద ప్రజల్లో వర్గ చైతన్యం పెంపొందింది. వారిలో వర్గ ఐక్యత పెంపొందటానికి, ఫలితంగా వర్గ పోరాటాలు అభివృద్ధి కావటానికి దారి తీసింది. కుల నిర్మూలన పోరాటాన్ని వర్గ పోరాటంతో జోడించటం వల్లే ఈ ఫలితం సాధ్యమయింది. అయినా, కుల భావన పాలక వర్గాల చేత ప్రజల్లో లోతుగా నాటబడి శతాబ్దాలుగా వారి సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వచ్చింది. ఇది ప్రజల జీవన విధానంలో, ఆలోచనా విధానంలో భాగంగా మారి అలవాటుగా కరడుగట్టుకు పోయింది. కనుక, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని పునాది స్థాయిలో, సాంస్కృతిక స్థాయిలో నిర్విరామంగా, పట్టుదలతో కొనసాగించాల్సిందే.

కొమరారం గ్రామంలో చోటుచేసుకున్న మార్పులు న్యూడెమోక్రసీ పనిచేస్తున్న ఈ ప్రాంతంలోని గ్రామాలన్నింటిలోనూ తరతమ స్థాయిల్లో చోటుచేసుకున్నాయి. అన్ని గ్రామాల సమగ్ర అధ్యయనానికి పూనుకోవటం ద్వారా ఈ రంగంలో మన భవిష్యత్ కర్తవ్యాలను నిర్దిష్టంగా రూపొందించుకోవటానికి తోడ్పడుతుంది. ఇందుకు మనం పూనుకోవాలి.

అమెరికా సబ్ -ప్రైమ్ సంక్షోభం

అమెరికాలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం సబ్-ప్రైమ్ తనఖా రుణాల సంక్షోభంగా ప్రారంభమయింది. తర్వాత ఈ సంక్షోభం ప్రముఖ తనఖా బ్యాంకుల దివాలాకు, మదుపు బ్యాంకుల దివాలాకు, బీమా సంస్థల దివాలాకు, ప్రపంచంలోని వివిధ దేశాల ద్రవ్య సంస్థల సంక్షోభానికి దారి తీసింది. ఇదంతా యెలా జరిగిందో చూద్దాం.

అమెరికాలో 1973 తర్వాతి నుండి ఆర్థిక రంగంలో వుత్పాదక సామర్థ్యానికి, ప్రజల కొనుగోలు శక్తికి మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. ఫలితంగా వుత్పాదక శక్తి కన్నా చాల తక్కువగా వుత్పత్తి జరుగుతూ వచ్చింది. నయా ఉదారవాద విధానాల వల్ల 1980, 90, 20 దశకాలలో ఈ వైరుధ్యం మరింత పెరిగింది. ఒకవైపు సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణల వల్ల వుత్పాదక సామర్థ్యం భారీ స్థాయిలో పెరిగింది. మరోప్రక్క, దీనికి తగిన విధంగా డిమాండు పెరగనందువల్ల కార్మికులను భారీ యెత్తున తగ్గించాల్సి వచ్చింది. దేశంలోనూ, ప్రపంచంలోనూ పెట్టుబడిదారుల మధ్య పోటీ వల్ల, తమ లాభాలను కాపాడుకోవటానికి, పెంచుకోవటానికి కార్మికుల నిజ వేతనాలలో కోతలకు, సౌకర్యాలలో కోతలకు పెట్టుబడిదారీ వర్గాలు పూనుకున్నాయి. అమెరికా కార్మికుల దినసరి నిజవేతనం 1964లో 302.52 డాలర్ల నుండి 2004లో 277.57 డాలర్లకు తగ్గిపోయింది. ఇందువల్ల దేశంలో శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి మరింత పడిపోయి, సరుకులకు డిమాండు పడిపోవటమో, స్తబ్దతకు గురికావటమో జరిగింది. పర్యవసానంగా వుత్పత్తి రంగంలో మదుపు పెట్టే అవకాశాలు లేక పెట్టుబడులు వృధాగా కుప్పపడ్డాయి. ఇదే పరిస్థితి యూరపు దేశాలకూ, జపానుకూ కూడా వర్తిస్తుంది.

పెట్టుబడులు వృధాగా పడివుంటే, అది పెట్టుబడిదారులకు అదనపు లాభాలను సమకూర్చి పెట్టదు. కనుక పెట్టుబడిదారులు ఒక మార్గాన్ని కనుగొన్నారు. రుణాలు కల్పించి వినియోగాన్ని పెంచటమే ఆ మార్గం. క్రెడిట్ కార్డుల ద్వారా పెద్ద యెత్తున వినియోగవస్తువుల వాడకాన్ని పెంచారు. బ్యాంకుల ద్వారా కార్ల కొనుగోలుకు రుణాలను యిచ్చి కార్లను కొనిపించారు. ఈ విధంగా ఆటో మొబైల్ రంగం కొంతకాలం అమెరికా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ఇంజనుగా పనిచేసింది. ఇటీవలి కాలంలో గృహ నిర్మాణరంగం అమెరికా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ఇంజనుగా పనిచేస్తూ వచ్చింది. అమెరికా బ్యాంకులు ఇళ్లు కొనుగోలు చేయదలచుకున్న వారికి భారీగా రుణాలివ్వ సాగాయి. ఈ రుణాలు అమెరికా జి.డి.పి. (జాతీయ ఉత్పత్తి)లో 70 శాతానికి చేరాయి. సుమారు 20 లక్షల మందికి యిలాంటి రుణాలను యిచ్చారు. 1986లో ప్రారంభమైన ఈ రుణాలు 2006-'07 నాటికి బాగా వూపందుకున్నాయి. మొదట రుణాలు పొందటానికి కొన్ని ప్రామాణికాలు పాటించేవారు. రుణగ్రహీతకు తగిన స్థిరమైన, శాశ్వతమైన ఆదాయ వనరు వుందా? అతడికి ఏమైనా ఆస్తిపాస్తులున్నాయా? మొదలైన ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుని రుణాలు యిచ్చేవారు. కొన్ని రేటింగు ఏజెన్సీలు లబ్ధిదారుల అర్హతలను పరిశీలించి తమ ధృవీకరణలను బ్యాంకులకు అందజేసేవి.

20-30 సంవత్సరాలలో తీర్చాల్సిన దీర్ఘకాలిక రుణాలు కనుక లబ్ధిదారులు స్వంత యిల్లు సమకూర్చుకోవాలనే తాపత్రయంతో పెద్ద యెత్తున యెగబడ్డారు. దీనితో పెట్టుబడిదారులు యిళ్ల రేట్లను పెంచి వేశారు. ఈ రుణాలపై వడ్డీ రేట్లనూ పెంచి వేశారు. ఈ రుణాలపై భారీగా వడ్డీలు లభిస్తుండటంతో అమెరికా తనఖా బ్యాంకులు వృధాగా మూల్గుతున్న పెట్టుబడులన్నిటినీ ప్రపంచం నలుమూలల నుండి సమీకరించి మరింత భారీ స్థాయిలో గృహ రుణాలు యివ్వటానికి పూనుకున్నాయి. రుణాలివ్వటానికి ఈ వెర్రి పోటీ రుణగ్రహీతల అర్హతల కుదింపుకు దారి తీసింది. స్థిరమైన వుద్యోగ అర్హతను సడలించారు. కనీస ఆస్తిపాస్తుల అర్హతను సడలించారు. గతంలో ఎప్పుడైనా అప్పు తీసుకుని తిరిగి చెల్లించిన చరిత్ర వుందా? అనే గీటు రాయినీ సడలించారు. చివరికి ఏ గీటురాయీ, ఏ అర్హతా లేకుండానే రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం లేనివారికి కూడా ఒక యింటి కొనుగోలు కోసం 45 లక్షల రూపాయల భారీ మొత్తాలను రుణాలుగా యిచ్చే పరిస్థితి యేర్పడింది. మరోప్రక్క రేటింగు ఏజన్సీలు లంచాలు మరిగి ఎవరికైనా తప్పుడు ధృవీకరణపత్రాలు యివ్వసాగాయి. ఈ రుణాలు 'ఏ ఆదాయమూ, ఏ ఉద్యోగమూ, ఏ ఆస్తీ అవసరం లేని' నీన్‌జా (NINJA - No Income, No job or asset) రుణాలుగా ప్రసిద్ధి చెందాయి. గతంలో రుణాలు తీసుకొని చెల్లించిన చరిత్రలేని వారికి, రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం లేని వారికి యిచ్చిన రుణాలనే 'సబ్-ప్రైమ్ రుణాలు' అని పిలుస్తారు. స్థిరమైన ఆదాయ వనరులుండి, గతంలో అప్పులు తీసుకుని తిరిగి చెల్లించిన చరిత్ర కలిగిన వారికి యిచ్చే రుణాలను 'ప్రైమ్' రుణాలు అంటారు.

తిరిగి చెల్లించే స్తోమతులేని వారికి రుణాలు యిస్తే అసలుకే మోసం వస్తుందని బ్యాంకుల వారికి తెలియదా? ఇలాంటి రుణాలివ్వడానికి వారెందుకు ఆరాటపడ్డారు? ఇళ్ల రుణాలిచ్చే బ్యాంకులను తనఖా బ్యాంకులని పిలుస్తారు. తమ రుణాలతో నిర్మించే యిళ్లను తనఖా పెట్టుకొని ఈ బ్యాంకులు రుణాలిస్తాయి. ఇళ్ల రేట్లు నిత్యం పెరుగుతున్నాయి కనుక (మూడు సంవత్సరాలలో రెట్టింపయ్యాయి), లబ్ధిదారులు రుణవాయిదాలు చెల్లించటంలో విఫలమైతే, ఆ యిళ్లను స్వాధీనం చేసుకొని మరొకరికి యెక్కువ రేటుకు అమ్ముకోవచ్చుననే ధైర్యంతో తనఖా బ్యాంకులు యిలాంటి అప్పులిచ్చాయి. అంతేకాకుండా, తాము పొందిన తనఖా పత్రాలను కొనుగోలు చేసి డబ్బు చెల్లించే మదుపు బ్యాంకులు (Investment Banks) అమెరికాలో తయారుగా వున్నాయి. లేమెన్స్ బ్యాంకు యిలాంటిదే. మరి మదుపు బ్యాంకులు ఈ రుణాలను (తనఖా పత్రాలను) తనఖా బ్యాంకుల నుండి ఎందుకు కొనుగోలు చేస్తాయి? రుణగ్రహీత నెలసరి చెల్లించే వడ్డీలో నుండి (వీటినే Easy Monthly Instalments (EMI) లేక తేలిక నెలసరి వాయిదాలు అని పిలుస్తారు) తనఖా బ్యాంకు కొంత వుంచుకొని, మిగిలిన దానిని మదుపు బ్యాంకుకు కమీషనుగా చెల్లిస్తుంది. ఈ కమీషను కోసమే మదుపు బ్యాంకులు తనఖా పత్రాలను కొనుగోలు చేస్తాయి. అంతేకాకుండా, మళ్లీ మదుపు బ్యాంకులు తమ దగ్గరున్న తనఖా పత్రాలను వేరు, వేరు నిధులుగా తయారుచేసి వివిధ దేశాలలోని మదుపు సంస్థలకు అమ్మి వేస్తాయి. వీటిని 'కోలేటరలైజ్‌డ్ డెట్ ఆబ్లిగేషన్స్ (CDOs)' అని పిలుస్తారు. 'చెల్లింపు గ్యారంటీ చేయబడిన అప్పు పత్రాలు' అని మనం వీటిని తెలుగులో పిలుచుకోవచ్చు. ఈ సీడీఓలు మూడు రకాలుగా వుంటాయి. ఒకే రకమైన రుణమొత్తాలు కలిగిన తనఖా పత్రాలన్నీ కలిపి ఒక నిధిగా చేస్తారు. ఒకే రకమైన వడ్డీ రేటు కలిగిన తనఖా పత్రాలన్నీ ఒక నిధిగా చేస్తారు. ఒకే రకమైన చెల్లింపు కాల వ్యవధి కలిగిన తనఖా పత్రాలన్నీ లేక రుణాలన్నింటిని కలిపి ఒక నిధిగా చేస్తారు. ఈ నిధులను 'హైగ్రేడ్ స్ట్రక్చర్డ్ క్రెడిట్ ఎన్‌హాన్సుడ్ లెవరేజ్ ఫండు' అని పిలుస్తారు. 'తిరిగి చెల్లించటానికి అన్ని విధాల గ్యారంటీలు కలిగిన వున్నత శ్రేణి రుణాల నిధి' అని మనం దీనికి అర్థం చెప్పుకోవచ్చు. ఒక కంపెనీలో వాటా పెట్టుబడి లాగా ఈ నిధులను పరిగణిస్తారు. ఈ నిధులలో వాటాలను అమ్ముతారు. లేమన్ కంపెనీ లాంటి 'మదుపు బ్యాంకులు' ఈ వాటాలను వివిధ దేశాల మదుపు దారులకు (ఇవి బ్యాంకులైనా కావచ్చు. మ్యూచువల్ ఫండ్స్ లాంటి ద్రవ్య సంస్థలైనా కావచ్చు) అమ్ముతాయి. వీటిని 'స్ట్రక్చర్డ్ ఇన్‌వెస్టుమెంటు వెహికల్స్ (SIV)' అని పిలుస్తారు. తెలుగులో 'నిర్మిత మదుపు సాధనాలు' అని పిలుచుకోవచ్చు. సి.డి.ఓ.లను ముక్కలుగా చేసి ఎస్.ఐ.వీలు అని పేరు పెట్టి అమ్ముకుంటారన్న మాట! ఎస్.ఐ.వీ.లను కొనుగోలు చేసే వివిధ దేశాల ద్రవ్య సంస్థలలో కార్మికులు, ఉద్యోగుల ప్రావిడెంటు ఫండు మొత్తాలు, పెన్షను, ఇన్సూరెన్సు మొత్తాలు వుండొచ్చు. సామాన్య ప్రజలు కొన్న వాటాలూ వుండొచ్చు. జపానుకు చెందిన పెన్షను ఫండులు, ఫిన్‌లాండుకు చెందిన ఇన్సూరెన్సు కంపెనీల నిధులూ యిందులో వున్నాయి. ఇలా అమ్మితే మదుపు సంస్థలకు ఏమి లాభం? రుణగ్రహీతలు చెల్లించే నెలసరి వడ్డీ మొత్తంలో తనఖా బ్యాంకు నుండి తనకు లభించే వాటాలో కొంత భాగాన్ని తానుంచుకొని, మిగతా భాగాన్ని ఎస్.ఐ.వి.లను కొనే మదుపుదారులకు మదుపు బ్యాంకు బదలాయిస్తుంది. తనఖా బ్యాంకులు - మదుపు బ్యాంకులు తమకు చెల్లించే మొత్తాలను మళ్లీ కొత్త గృహ రుణాలు యివ్వటానికి వుపయోగిస్తాయి. మదుపు బ్యాంకులు తాము ఎస్.ఐ.విలు అమ్మగా వచ్చిన మొత్తాలను మళ్లీ తనఖా బ్యాంకుల నుండి కొత్త రుణాలు కొనటానికి వుపయోగిస్తాయి. వివిధ దేశాల మదుపుదారులు (Investors) యింత రిస్కు తీసుకొని ఈ ఎస్.ఐ.వీలను ఎందుకు కొంటారు? దీనికి మొదటి కారణం ఈ రీత్యా వచ్చే వడ్డీ మరెక్కడా లభించటం లేదు కనుక. రెండవ కారణం - మదుపు బ్యాంకుల నుండి తాము కొనుగోలు చేసిన ఎస్.ఐ.వీలను మళ్లీ యితర మదుపుదారులకైనా అమ్ముకోవచ్చు. లేదా వీటిని బీమా చేయించుకోనూ వచ్చు. (ఈ బీమా పాలసీలను 'రుణబకాయీ పరిహార పత్రాలు' (Credit Default Swaps (CDS)) అని పిలుస్తారు). కనుక తమ సొమ్ముకు యెలాంటి ప్రమాదం లేదని వారు భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇటీవల దివాలా తీసి అమెరికా ప్రభుత్వం చేత జాతీయం చేయబడిన ఏ.ఐ జి. కంపెనీ ఇలాంటి బీమా కంపెనీయే. ఎస్.ఐ.వీలను బీమా చేయటానికి ప్రసిద్ధ బీమా కంపెనీలన్నీ పోటీ పడ్తూ వచ్చాయి. ఎందుకని? ఎస్.ఐ.వీలను బీమా చేసుకుంటే వారికి వడ్డీలో కొంత భాగం ప్రీమియంగా ముడుతుంది. ఒకవేళ రుణగ్రహీతలు వాయిదాలు చెల్లించనట్లయితే, ఆ యిళ్లను స్వాధీనం చేసుకొని అమ్ముకుంటే యిళ్ల దరలు విపరీతంగా పెరుగుతున్నాయి కనుక, బీమా మొత్తాలను చెల్లించిన తర్వాత కూడా భారీ లాభాలను దండుకోవచ్చుననేది వాటి ఆలోచన, ఆశ.

వీరందరి మధ్య లాభాల పంపిణీ యెలా జరుగుతుందో ఒక వుదాహరణచూద్దాం. ఇంటి కోసం 45 లక్షల రుణం తీసుకున్న వ్యక్తి నెలకు వందకు రూపాయి వడ్డీ చొప్పున నెలకు 45 వేలు చెల్లించాల్సి వుంటుందనుకుందాం. ఇందులో నుండి తనఖా బ్యాంకు 11 వేలు మినహాయించుకొని, మదుపు బ్యాంకుకు 34 వేలు చెల్లిస్తుంది. మదుపు బ్యాంకు 11 వేలు తానుంచుకొని, 23 వేలు ఇతర మదుపు దార్లకు (ఎస్.ఐ.వీల కొనుగోలు దారులకు) చెల్లిస్తుంది. ఈ మదుపు దారులు తాము 12 వేలు వుంచుకొని, మిగిలిన 11 వేలను బీమా కంపెనీకి చెల్లిస్తారు. 2001 సెప్టెంబరు 11 తర్వాత అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేటును సం॥కి రూపాయికి తగ్గించింది కనుక, మన వుదాహరణలో పేర్కొన్న వడ్డీ రేటు లభించినా, అందులో సగం లభించినా కూడా అమెరికా ఫెడరల్ బ్యాంకు చెల్లిస్తున్న వడ్డీ కన్నా ఎక్కువే అవుతుంది. ఇది మదుపరులకు ఆకర్షణీయమయిందే. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వీరందరూ ఈ విధంగా లాభపడతారు. తమ పెట్టుబడులను తిరిగి, తిరిగి చలామణీలో పెట్టగలుగుతారు. అయితే వీరందరూ ఒక విషయం మీద ఆధారపడ్డారు. గృహాల రేట్లు నిరంతరం తిరుగులేకుండా పెరుగుతుంటాయనే అంచనాయే అది. ఇక్కడే వాళ్లు పప్పులో కాలేశారు.

సాధారణజనం ఇళ్ల రుణాలకు ఎగబడటానికి కారణం రుణవాయిదాలు కట్టలేనప్పుడు మరొకరికి ఆ యింటిని మరింత ఎక్కువ రేటుకు అమ్ముకోవచ్చుననే భరోసానే. కాని జరిగింది వేరు. దేశంలో లక్షల సంఖ్యలో కార్మికుల వుద్యోగాలు వూడుతూ పోయాయి. ధరలు విపరీతంగా పెరగటం వల్ల వుద్యోగాలు చేస్తున్న వారి బడ్జెట్లు కూడా తల్లక్రిందులయ్యాయి. మరోప్రక్క రుణాలు తీసుకున్నప్పటి వడ్డీ రేటును ఆ తర్వాత బ్యాంకులు పెంచివేశాయి. ఈ కారణాలన్నింటివల్ల రుణాలు తీసుకున్న వారు వాయిదాల చెల్లింపులు చేయటంలో విఫలమయ్యారు. చాల మంది మొదటి వాయిదా కూడా చెల్లించలేక పోయారు. తనఖా బ్యాంకులు కానీ, బీమా కంపెనీలు కానీ యిళ్లను అమ్మకానికి పెడితే కొనే వాళ్లే లేకుండా పోయారు. ఇలా 43 లక్షల యిళ్లు ఖాళీగా మూల్గుతున్నాయని అంచనా. ఇళ్ల రేట్లు దారుణంగా (దాదాపు 40 శాతం) పడిపోయాయి. వడ్డీ పంపిణీ నిలిచిపోయింది. బీమా కంపెనీలు బీమా సొమ్మును చెల్లించలేక పోయాయి. విదేశీ ద్రవ్య సంస్థల్లో మదుపు చేయబడిన సామాన్య కార్మికుల పెన్షన్ నిధులు, బీమా మొత్తాలు, వాటాలు గల్లంతయి వారు తీవ్రంగా నష్టపోయారు. తనఖా పత్రాలను మళ్లీ, మళ్లీ అమ్మగా వచ్చిన మొత్తాలను కూడా లాభాలు దండుకోవాలనే దురాశతో యిళ్ల రుణాలకే ఖర్చు పెట్టిన తనఖా బ్యాంకులు, మదుపు బ్యాంకులూ దివాలా తీశాయి. బీమా కంపెనీలూ దివాలా తీశాయి. ఈ సంస్థలలో పనిచేసే 10 లక్షల మంది వుద్యోగులు గత సం॥ర కాలంలో వుద్యోగాలు కోల్పోయి బజారున పడ్డారు. ఇంకా లక్షలాది మంది యిదే బాటలో వున్నారు. ఇన్ని లక్షల మంది కార్మికులు, వుద్యోగులు పనులు కోల్పోవటం వల్ల యితర రంగాలలో వుత్పత్తుల అమ్మకాలు పడిపోయాయి. పర్యవసానంగా అక్కడా కార్మికుల తొలగింపు సాగుతోంది. ఈ విషవలయం అమెరికాలోని శ్రమ జీవి కుటుంబాలకు అంతులేని కష్టనష్టాలను, బాధలను తెచ్చి పెట్టింది. ఇప్పటికే వేలాది కుటుంబాలు యిళ్లూ, వుపాధీ కోల్పోయి రోడ్ల మీదనో, కార్లలోనో దీనాతిదీనమైన జీవితాలను గడుపుతున్నారని వార్తలు వస్తున్నాయి

దేవి కృష్ణ

సబ్-ప్రైమ్ సంక్షోభం కారణంగా 2007 ఫిబ్రవరి నాటికి 25 తనఖా బ్యాంకులు దివాలా ప్రకటించాయి. 2007 ఆగస్టు నాటికి పెద్ద, పెద్ద తనఖా బ్యాంకులూ దివాలా ప్రకటించాయి. బియర్ స్టెర్న్స్ అనే తనఖా బ్యాంకు కుప్పకూలిపోయింది. 2008 సెప్టెంబరు నాటికి అమెరికాలోని అతిపెద్ద, అతి పురాతనమైన రెండు తనఖా బ్యాంకులు – ఫానీమా, ఫ్రెడ్డీమాక్ కూలిపోయాయి. ఆ తర్వాత – అమెరికాలోని అతి పురాతనమైన, పెద్ద మదుపు బ్యాంకు – లేమన్ బ్రదర్స్ పతనమయింది. బ్రోకరేజి కంపెనీ – మెరిల్‌లించ్, అమెరికాలోని అతిపెద్ద బీ[illegible] కంపెనీ – ఏ.ఐ.జి పతనమయ్యాయి. ఇంకా వందలాది బ్యాంకులు, యితర ద్రవ్య సంస్థలు దివాలా మార్గంలో వున్నాయి. వీటిలో పెట్టుబడులు పెట్టిన విదేశీ బ్యాంకులు, ద్రవ్య సంస్థలు తీవ్రమైన నష్టాలను పొందాయి. ఈ ద్రవ్య సంస్థలలో తమ డబ్బును మదుపు పెట్టిన సామాన్య ప్రజలు, వారు జీవితాంతం కూడబెట్టుకున్న సొమ్మును కోల్పోయారు. ప్రపంచమంతటిలోనూ స్టాక్ మార్కెట్లు కుప్పకూలి పోయాయి. బ్యాంకులలో కానీ, ద్రవ్య సంస్థలలో కానీ తమ పొదుపు సొమ్మును డిపాజిట్ చేయటానికి ప్రజలెవరూ సాహసించటం లేదు. ఒక ద్రవ్య సంస్థ మరో ద్రవ్య సంస్థలో పెట్టుబడి పెట్టటానికి కానీ, ఒక బ్యాంకు మరో బ్యాంకుకు అప్పులివ్వటానికి కానీ, బ్యాంకులు, ద్రవ్య సంస్థలు పెట్టుబడిదారులకు, వినియోగదారులకు అప్పులివ్వటానికి కానీ సాహసించటం లేదు. పర్యవసానంగా ద్రవ్య చలామణీ స్తంభించి పోయింది. ద్రవ్య సంక్షోభం యేర్పడింది.

అయితే సబ్-ప్రైమ్ సంక్షోభం పైపైన చూస్తే రుణాల చెల్లింపు సంక్షోభంగా కన్పిస్తుంది. అమెరికా ప్రభుత్వం, ఫెడరల్ రిజర్వ్ (అమెరికా సెంట్రల్ బ్యాంకు) ద్రవ్య మార్కెట్లపై సరైన అదుపు చర్యలకు పూనుకోకపోవటం వల్లే ఈ సంక్షోభం యేర్పడిందనే వాదనలు విస్తారంగా వినిపిస్తున్నాయి. అపరిమితంగా బ్యాంకులు అప్పులివ్వటం వల్లే ఈ పరిస్థితి వచ్చిందనే వాదనలున్నాయి. ఇలా అప్పు లివ్వటాన్ని ఫెడరల్ అదుపు చేయనందువల్లే ఈ పరిస్థితి వచ్చిందనే వాదనలున్నాయి. ఫెడరల్ ద్రవ్య మార్కెట్లను అదుపు చేయని మాట వాస్తవమే. ఆ మాటకొస్తే మార్కెట్ల మీద యెలాంటి ప్రభుత్వ కంట్రోళ్లు, జోక్యం వుండ కూడదనేదే యిటీవలి కాలంలో అమెరికా పాలకవర్గాలు ప్రబోధిస్తూ వచ్చిన సిద్ధాంతం. క్లింటన్ నాయకత్వంలోని డెమోక్రాట్లూ, బుష్ నాయకత్వంలోని రిపబ్లికన్లూ యిదే విధానాన్ని అనుసరించారు. సిద్ధాంత విషయాన్ని ప్రక్కన పెడితే, రుణాలు యిచ్చి డిమాండును సృష్టించాల్సిన అగత్యం పెట్టుబడిదారులకు యెందుకు వచ్చింది? దేశంలోని ప్రజల కొనుగోలు శక్తి తయారైన సరుకులన్నింటిని కొనుగోలు చేయటానికి అవసరమైన దానికన్నా చాలా తక్కువగా వుందన్నమాట. కనుక తమ వద్ద పోగుపడ్డ పెట్టుబడులను వినియోగంలోకి తేవాలన్నా, ఆ పెట్టుబడుల ద్వారా జరిగిన వుత్పత్తులను అమ్ముకోవాలన్నా, ఆ విధంగా తమ లాభార్జనను కొనసాగించాలన్నా, వారు వినియోగదారులకు రుణాలివ్వక తప్పదన్న మాట. పెట్టుబడి వినియోగం కోసం, సరుకుల అమ్మకం కోసం పెట్టుబడిదారుల మధ్య, ద్రవ్య సంస్థల మధ్య సాగే పోటీ, బ్యాంకులు, ద్రవ్య సంస్థల మధ్య రుణాలివ్వటానికి సాగే పోటీగా మారుతుంది. ఇది అన్ని నియమ నిబంధనలను గాలి కొదిలి విచ్చలవిడిగా రుణాలు పందారం చేయటానికి దారితీస్తుంది. అన్ని నియమాలను, నియంత్రణలను గాలికొదలటమే యిక్కడ మార్కెట్ నియమం. కనుక అసలు విషయం – ఒక వైపు వుత్పత్తీ, వుత్పత్తి సామర్థ్యమూ పెరుగుతూ వుంటే మరోప్రక్క కార్మికుల కొనుగోలు శక్తి (కార్మికుల సంఖ్య కుదింపు వల్ల యేర్పడిన నిరుద్యోగం వల్లా, నయా వుదారవాద విధానాల కారణంగా వారి నిజ వేతనాలు తగ్గటం వల్లా యిది సంభవిస్తుంది) తగ్గి వుత్పత్తికీ, పంపిణీకీ మధ్య వైరుధ్యం తీవ్రమవుతుంది. ఉత్పత్తులు అమ్ముడు పోక కుప్ప పడతాయి. మదుపు అవకాశాలు మృగ్యం కావటంతో పెట్టుబడులు వృధాగా నిలవ వుండి పోతాయి. అందుచేతనే పెద్ద యెత్తున రుణాలు యిచ్చి డిమాండును కృత్రిమంగా సృష్టించాల్సి వచ్చింది. (1929-30 మహా సంక్షోభ కాలంలో సరుకులను పెద్దయెత్తున ధ్వంసం చేసి మిగులును వదిలించుకున్నారు. 1939 నాటి సంక్షోభ కాలంలో రెండవ ప్రపంచ యుద్ధానికి పూనుకుని పెట్టుబడిదారులు మిగులును వదిలించుకుని కొత్త డిమాండును సృష్టించుకున్నారు). అయితే ప్రజల కొనుగోలు శక్తికన్నా అనేక రెట్లు యెక్కువగా రుణాలు యిచ్చినప్పుడు, ఒక దశ తర్వాత, వాటిని తిరిగి చెల్లించటం అసాధ్యమై పోతుంది. రుణాల బుడగ పేలిపోతుంది. ఇప్పుడు జరిగిందదే.

సబ్-ప్రైమ్ సంక్షోభంలో ముందుకొచ్చిన మరొక అంశం పెట్టుబడి ద్రవ్యీకరణ(Financialisation of Capital) ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం చేతుల్లో పెట్టుబడి పోగుబడి వుందని, అయితే వుత్పాదక రంగంలో మదుపు పెట్టటానికి వారికి అవకాశాలు లేకుండా పోయాయని మనం చూశాం. అయినా ఈ పెట్టుబడికి పిల్లలు పుట్టించటానికి వార్లు అనేక కృత్రిమ మార్గాలు వెదుకుతుంటారు. ఇందులో భాగంగా వారు అనేక కృత్రిమ ద్రవ్య ఆస్తులను (Financial Assets or Instruments) లేక ద్రవ్య సాధనాలను సృష్టిస్తుంటారు. (కరెన్సీ నోట్లను, బ్యాంకు చెక్కులను, ఫిక్సుడ్ డిపాజిట్ సర్టిఫికెట్లను, షేర్ సర్టిఫికేట్లను, ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు విడుదల చేసే బాండ్లు మొదలైన వాటిని సామాన్యంగా ద్రవ్య ఆస్తులు అని పిలుస్తారు. డబ్బు రూపంలో నిర్దిష్ట విలువ కలిగి తగిన సమయంలో డబ్బుగా మార్చుకోగలిగిన పేపర్ సాధనాలనే ద్రవ్య ఆస్తులు అని పిలుస్తారు). పైన పేర్కొన్న తనఖా పత్రాలు, సీ.డీ.ఓలు, ఎస్.ఐ.వీలు, బీమా పాలసీలు (సి.డి.యస్‌లు) ఈ రకమైనవే. శ్రమ జీవులను పీల్చి పిప్పి చేసి పిండుకున్న అదనపు విలువను వివిధ రకాల పెట్టుబడిదారులు వంతులు వేసుకొని జుర్రుకునే సాధనాలే ఈ ద్రవ్య ఆస్తులు. పైన నేను పేర్కొన్న వుదాహరణలో ఒక కార్మికుడికి తనఖా బ్యాంకు యింటి కొనుగోలుకు 45 లక్షల రూపాయల రుణాన్ని ఆ యింటిని తనఖా పెట్టుకొని యిచ్చింది. ఈ తనఖా పత్రం ఒక ద్రవ్య ఆస్తి. దీనికి సి.డి.ఓ అనే కొత్త పేరు పెట్టి తనఖా బ్యాంకు మదుపు బ్యాంకుకు అమ్ముకుంది. ఇది కూడా మరో రకం ద్రవ్య ఆస్తి. మదుపు బ్యాంకు ఈ సీడీఓలను అనేక ముక్కలుగా విభజించి ఎస్.ఐ.వీ.లని పేరు పెట్టి యితర దేశ, విదేశీ ద్రవ్య సంస్థలకు అమ్ముకుంది. ఈ సంస్థలు ఈ ఎస్.ఐ.వీలను బీమా సంస్థలకు అమ్మాయి. బీమా సంస్థలు వీరికి సి.డి.యస్.ల పేరుతో బీమా పాలసీలు యిచ్చారు. ఈ బీమా పాలసీలూ ద్రవ్య ఆస్తులే. ఇంటి రుణం తీసుకున్న కార్మికుడు నెలకు చెల్లించే 45,000 రు.ల వడ్డీని పై నాలుగు సంస్థలూ పంచుకోవటం చూశాం. ఇలా, ఈ నాలుగు ద్రవ్య సంస్థలూ యింత లాభాన్ని పొందటం యెలా సాధ్యమయింది? 20 లక్షలు ఖరీదు చేసే యింటి రేటును 45 లక్షలకు అసాధారణంగా పెంచటం ద్వారా వీరు కార్మికుడిని గరిష్ఠ స్థాయిలో దోచుకుంటున్నారు. మరో ప్రక్క మార్కెట్టులో వడ్డీరేటు ఏ నాలుగు శాతమో వుంటే, అతడి వద్ద నుండి 12 శాతం వడ్డీని గోళ్లూడగొట్టి వసూలు చేయటం ద్వారా అతడి రక్తాన్ని జుర్రుకుంటున్నారు. తమ దగ్గరున్న ద్రవ్య పెట్టుబడులను వుత్పాదకరంగంలో పెట్టి, ఎక్కువ సరుకులను వుత్పత్తి చేసి, ఎక్కువ మందికి వుపాధి కల్పించి (క్రొత్త కొనుగోలు శక్తిని, ఆ విధంగా కొత్త డిమాండును సృష్టించటం), వారికి ఆ సరుకులను పంపిణీ చేయటం ద్వారా నిజమైన భౌతిక ఆస్తులు (భూమి, ఫ్యాక్టరీలు, భవనాలు, సరుకులు – వీటినే ఇంగ్లీషులో Physical Assets అంటారు) పెరుగుతాయి. సంపద అందరికీ పంచబడి, వారి జీవన పరిస్థితులు మెరుగవుతాయి. కాని వున్న ఆస్తుల రేట్లను, సరుకుల ధరలను వాటి నిజ విలువకు అనేక రెట్లు పెంచటానికి తమ పెట్టుబడులను వినియోగించటమే పెట్టుబడి ద్రవ్యీకరణఅని పిలుస్తారు. ఉదాహరణకు ఒక వ్యాపారి ఒకే బ్యాంకు నుండి కోటి రూపాయల రుణం తీసుకుని వేయి టన్నుల బియ్యాన్ని కొని ధరను పెంచివేసి రెండు కోట్లు సంపాదించాడనుకుందాం. మరొక వ్యాపారి మరొక బ్యాంకు నుండి రెండు కోట్లు తీసుకుని యిదే వేయి టన్నులను కొని తిరిగి అధిక ధరకు అమ్మటం ద్వారా నాలుగు కోట్లు సంపాదించాడనుకుందాం. ఇక్కడ కోటి రూపాయల ధనం నాలుగు కోట్లుగా మారింది. కాని వేయి టన్నుల ధాన్యం మాత్రం వేయి టన్నులుగానే మిగిలింది. వేయి టన్నుల ధాన్యం ధర మాత్రం కోటి నుండి 4 కోట్లకు పెరిగింది. దీనినే చట్టా వ్యాపారం అని పిలుస్తాం. దీని వలన పరిమితమైన సరుకుల మారకానికి ఎక్కువ ద్రవ్యం కూడా అవసరమవుతుంది. ద్రవ్య విస్ఫోటనానికి, అంటే ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పరిమాణం విపరీతంగా పెరగటానికి దారి తీస్తుంది. ఒక సరుకు లేక ఆస్తి విలువను అసాధారణంగా పెంచితే, ఒక దశ తర్వాత దానిని కొనే వాళ్లుండరు. వాటి ధరలు అని వార్యంగా పడిపోవలసిందే. ఈ ద్రవ్య బుడగ పేలి పోవలసిందే. మరోప్రక్క వుత్పాదక రంగం – పెట్టుబడుల కొరత వల్ల స్తబ్దతకు, క్షీణతకు లోనవుతుంది. ఇది నిరుద్యోగానికి, అర్ధ నిరుద్యోగానికి, జీవన ప్రమాణాల పతనానికి, తీవ్రమైన దారిద్ర్యానికి, అంతరాల అగాధానికి దారి తీస్తుంది. పెట్టుబడిదారీ వుత్పత్తి సంబంధాలు యెలా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తీవ్రమైన ఆటంకంగా పరిణమిస్తాయో ఈ సంక్షోభ కాలం మన కళ్లకు కట్టిస్తుంది.

మానవ సమాజం సృష్టించిన అతి గొప్ప మేధావీ, దార్శనికుడూ కారల్‌మార్క్స్ పెట్టుబడిదారీ సంక్షోభాల గురించి 160 సంవత్సరాల క్రిందట 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో చేసిన విశ్లేషణయిప్పటి సంక్షోభ కారణాలను యెంత చక్కగా వివరిస్తుందో చూడండి.

"... మంత్ర శక్తితో వలె బ్రహ్మాండమైన వుత్పత్తి సాధనాలనూ, మారకపు సాధనాలనూ సృష్టించిన ఈ బూర్జువా సమాజం – తన మంత్ర శక్తిచే సృష్టించిన భూతాలను తానే అదుపులో పెట్టుకోలేని భూత వైద్యుని దురవస్థలో పడింది..."

"…. ఈ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఉత్పత్తి అయిన సరుకుల్లోనేగాక గతంలో సృష్టించిన ఉత్పాదక శక్తుల్లో కూడా పెద్ద భాగాన్ని నాశనం చేయటం జరుగుతుంది. గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక అంటురోగం ఈ సంక్షోభ సమయాల్లో చెలరేగుతుంది. మితిమీరిన ఉత్పత్తి అనే అంటు రోగం. హఠాత్తుగా మానవ సమాజం తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేశించినట్లుంటుంది; కాటకమో, సర్వ విధ్వంసక ప్రపంచ యుద్ధమో వచ్చి సకల ప్రాణాధార వస్తువుల సరఫరానూ ఖండించినట్లుంటుంది. పరిశ్రమలూ, వాణిజ్యమూ ధ్వంసమైనట్లుంటుంది. కారణం ఏమంటే మితిమీరిన నాగరికత, మితిమీరిన ప్రాణాధార వస్తు సంపద. మితిమీరిన పరిశ్రమలు. మితిమీరిన వాణిజ్యం. సమాజం చేతిలో వున్న వుత్పాదక శక్తులు యిక యెంత మాత్రమూ బూర్జువా ఆస్తి వ్యవస్థ అభివృద్ధికి అనుకూలంగా లేవు; అంతేకాక, తమకు శృంఖలాలుగా తయారైన ఆ ఆస్తి వ్యవస్థ కంటే అవి బలీయమైనాయి; అవి ఆ శృంఖలాల నుండి బయటపడినప్పుడల్లా, వెంటనే మొత్తం బూర్జువా సమాజంలోకి అవ్యవస్థ ప్రవేశిస్తుంది. బూర్జువా ఆస్తి వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుంది. బూర్జువా సమాజపు నియమాలు తాము సృష్టించిన సంపదను యిముడ్చుకోవడానికి తామే యిరుకైనాయి. మరి ఈ సంక్షోభాలను బూర్జువా వర్గం ఏ విధంగా అధిగమిస్తుంది? ఒక వైపున ఉత్పాదక శక్తుల్లో కొంత భాగాన్ని విధిలేక ధ్వంసం చేయడం ద్వారానూ, మరొక వైపున కొత్త మార్కెట్లను జయించడం ద్వారానూ, పాత మార్కెట్లను మరింత కట్టుదిట్టంగా దోచుకోవటం ద్వారానూ, అంటే మరింత విస్తృతమైన, మరింత విధ్వంసకరమైన సంక్షోభాలకు బాట వేయడం ద్వారానూ, సంక్షోభ నివారణావకాశాలను తగ్గించడం ద్వారానూ అన్నమాట". (కమ్యూనిస్టు ప్రణాళిక – మొదటి అధ్యాయం)

వినాశకర యుద్ధాలకు పూనుకోవటం ద్వారానూ, రుణఆర్థిక వ్యవస్థను అదుపులేకుండా పెంపొందించటం ద్వారానూ, ద్రవ్య విస్ఫోటనాలను సృష్టించటం ద్వారానూ కూడా తాను యెదుర్కొంటున్న సంక్షోభాల నుండి బయట పడటానికి పెట్టుబడిదారీ విధానం ప్రయత్నిస్తుందని మార్క్స్ తదనంతర కాలపు అనుభవాన్ని బట్టి మనం మార్క్స్ విశ్లేషణకు జోడించవచ్చు. అయినా, ఈ ప్రయత్నాలన్నీ మార్క్స్ చెప్పినట్లు విఫలమయి తీరుతాయి. మరింత తీవ్రమైన సంక్షోభాలకు మాత్రమే బాటలు వేస్తాయి. దీనినే ప్రస్తుత సంక్షోభం తిరుగులేకుండా నిరూపిస్తున్నది.

కుల నిర్మూలనపై అవగాహన సభలు

నల్లగొండ: మునగాల: కుల నిర్మూలనా ఆచరణాత్మక కార్యక్రమంలో భాగంగా మునగాల మండలం తిమ్మారెడ్డి గూడెం గ్రామంలో కుల రక్కసి వ్యతిరేకంగా సభ, అనంతరం సహపంక్తి భోజనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకులు కా|| రాము, ప్రభాకర్, నవీన్ తదితరులు మాట్లాడారు. కుల రహిత సమాజం కోసం అందరం ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

ఆలేరు మండలం కొలనుపాకలో సదస్సు సహదేవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు జి. నాగయ్య, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జనార్ధన్, ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకులు అడివయ్య తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రదర్శన జరిగింది.

పశ్చిమ గోదావరి : కొయ్యలగూడెం: మండలంలోని కన్నాపురంలో "దళితుల ఆత్మగౌరవం – భూమి సమస్య"పై సదస్సు జరిగింది. ఈ సదస్సులో పార్టీ జిల్లా నాయకుడు కా|| సి.హెచ్. రమేష్, పీవైయల్ నాయకుడు కా|| సత్యం, సర్పంచ్ గంగరాజులు మాట్లాడారు. ప్రతి దళిత కుటుంబానికి ఐదు ఎకరాలు భూమి లభించినప్పుడే ఆత్మగౌరవం వస్తుందనీ అందుకై భూమి కోసం దళితులు ఐక్యంగా వుద్యమించాలన్నారు.

గోపాలపురం: మండలంలోని దొండపూడి గ్రామంలో 200 మందితో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ప్రాథమిక ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ నాగేశ్వరరావు ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులు, అనేక ఘటనలను వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి 60 దాటినా దళితులకు రాలేదనీ అంటరాని తనాన్ని ఇంకా అనుభవిస్తూనే వున్నారన్నారు. అంటరానితనం నిర్మూలనకై సత్యశోధక్ సమాజ్‌ను నిర్మించిన జోతిభాపూలే స్ఫూర్తితో పోరాడాలన్నారు. ఇంకా ఈ సదస్సులో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కా|| పి. శ్రీనివాస్, పీవైయల్ నాయకుడు కా|| జి. సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సార్వత్రిక సంక్షోభంలో ఇండియా అంతర్భాగమని నిరూపించిన

తాజా స్టాక్ మార్కెట్ పతనం - దుష్ఫలితాలు!

భారతీయ స్టాక్ మార్కెట్ల వరుసవారీ పతనాలు యాదృచ్ఛిక పరిణామాలు కాదు. అవి పెట్టుబడిదారీ సంక్షోభ గొలుసు కట్టులో లింకులు మాత్రమే. సామ్రాజ్యవాద సార్వత్రిక సంక్షోభ విషవలయంలో అంతర్భాగాలే! స్టాక్ మార్కెట్లు వాస్తవ ఉత్పత్తికి ప్రాతినిధ్యం వహించక పోవచ్చు. ఇవి నిజ ఉత్పత్తి ప్రక్రియతో సంబంధంలేని అస్తుల మారక కేంద్రాలు మాత్రమే! కానీ ఆచరణలో ఇవి నిజ ఉత్పత్తి ప్రక్రియలో జోక్యం చేసుకుంటాయి. జోక్యానికే అవి పరిమితం కాదు. వాటిని ఆదేశిస్తాయి. అంతిమంగా శాసిస్తాయి. కూల్చివేస్తాయి. మనిషి సృష్టించుకున్న దేవుడు నిజానికి మిథ్య మాత్రమే! కానీ ఆచరణలో అట్టి మిథ్యా దేవుడి చేతిలో, దానిని సృష్టించిన నిజమైన మనిషి బానిస అయిన చందమిది. ఇంకా చెప్పాలంటే, వాస్తవ మార్కెట్లు పతనమయ్యేకంటే ముందుగా మిథ్యా మార్కెట్లు (స్టాక్ మార్కెట్లు) పతనమౌతాయి. శరీరంలో నిజరోగాన్ని సూచించేందుకు ముందుగా తొలుత జ్వరం వస్తుంది. జ్వరం ఒక రోగ సూచిక మాత్రమే! జ్వరం తనకు తానే ఒక జబ్బు కాదు. జ్వరం ఎలాగైతే వ్యాధి చిహ్నమో, స్టాక్ మార్కెట్ల పతనాలు కూడా వ్యవస్థ పతనస్థితికి చిహ్నాలు అవుతాయి. ఉత్పత్తికీ, పంపిణీకీ మధ్య వైరుధ్యమే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభానికి మూల మరియు మౌలిక కారణం! అట్టి మౌలిక వైరుధ్యం తీవ్రతరమౌతున్న క్రమంలోనే ఒకానొక దశలో సంక్షోభ రూపం ధరిస్తుంది. అది క్రమంగా విస్తరించి, విషమించి మాంద్యం రూపం ధరిస్తుంది. అది ఒక్క దేశం లేదా ఒక్క ఖండానికే పరిమితం కాదు. అది ప్రపంచ సార్వత్రిక సంక్షోభమే! స్టాక్ మార్కెట్ల సూచికలు పెట్టుబడిదారీ ప్రపంచ సంక్షోభ సూచికలు మాత్రమే! 2008 సెప్టెంబరు 16న అమెరికాలో అట్టి జ్వరం 105 డిగ్రీలకు చేరింది. అదే బ్లాక్ మండేగా పేరొందింది.

పైన పేర్కొన్న బ్లాక్ మండే రోజు అమెరికాకి చెందిన డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ మరియు నాస్‌డాక్ అను 2 స్టాక్ సూచికలు పతనమయ్యాయి. ఇవి వరుసగా భారీ ఇన్వెస్టు బ్యాంకుల పతనానికి దారితీశాయి. ఆ తర్వాత అవి కమర్షియల్ బ్యాంకుల పతనానికి కారణమయ్యాయి. పతనమౌతున్న మరియు దివాళా తీసిన ఇలాంటి ఆర్థిక సంస్థలను జాతీయం చేయడం ద్వారా (700 మిలియన్ల డాలర్ల ప్యాకేజీ సహాయంతో) అమెరికా ప్రభుత్వం కూడా మరింత సంక్షోభంలో యిరుక్కుపోయింది. అది మిగిలిన ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల సంక్షోభానికి కారణమైనది. నడి సముద్రంలో తుఫానుకు చిక్కుకొని మునిగిపోనున్న నావ చందమిది. అట్టి నావలోని మనుషులు ఒకరినొకరు పట్టుకొని ఆత్మరక్షణకై ఆరాటపడటం వంటిదే! నీటిలో మునిగే ప్రతివాడు మరొకడి నడుమును వాటేసుకొని ముందుకెళ్ళడం వంటిదే! నావవంటి పెట్టుబడిదారీ ప్రపంచంలో మనుషులు అనే వివిధ దేశాల దుస్థితి నేడు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నది.

'బ్లాక్ మండే'తో అమెరికాలో లేహమాన్ బ్రదర్స్ కంపెనీ దివాళా దరఖాస్తు చేసినది. ఈ సంఘటన జరిగిన నేపథ్యంలో 'ప్రజాపంథా' 1.10.2008 సంచికలో ఈ సంక్షోభ తీవ్రతతోపాటు భావి దుష్ఫలితాల గూర్చి ఒక వ్యాసాన్ని ప్రచురించాము. దాని దుష్ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థ మీద వుండబోదని, ఇక్కడ ఫండమెంటల్స్ అతి బలంగా, స్థిరంగా వున్నాయని ప్రధాని, ఆర్థిక మంత్రి బుకాయించారు. కానీ ఫండమెంటల్స్ తుస్సుమన్నాయి. ఈ నిజాన్ని 24.10.2008న బ్లాక్ ఫ్రైడే నిరూపించింది. అమెరికా మాంద్యం సర్వవ్యాపితమన్న 'ప్రజాపంథా'లోని మొన్నటి వ్యాసం నిరూపించింది. ఈ సంచికలో భారతదేశ ఆర్థిక వ్యవస్థను పతనం చేయనున్న భారతీయ స్టాక్ మార్కెట్ల పతనం గూర్చి విశ్లేషణాత్మక వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం.

- సంపాదకులు

రాజకీయాలంటే రక్తపాతంలేని యుద్ధమనీ, యుద్ధమంటే రక్తపాతంతో కూడిన రాజకీయాలనీ కా॥ మావో నిర్వచించాడు. తాజా స్టాక్ మార్కెట్ల పతనం రక్తపాతంలేని ఆర్థిక విధ్వంస యుద్ధమే! ఈ యుద్ధంలో కోటిన్నరమంది భారతీయ మదుపరులు ప్రత్యక్ష క్షతగాత్రులైతే, నూరు కోట్ల మందికి పైగా భారతీయులు పరోక్ష బాధితులౌతున్నారు. ఈ స్టాక్ మార్కెట్లను పతనాల నుంచి పరిరక్షించే పేరిట మన్మోహన్ సింగ్ ప్రభుత్వం గత 40 రోజుల్లో (సెప్టెంబరు 16 నుంచి) అనేక చర్యలను చేపట్టింది. ఈ చర్యలన్నీ ప్రజల మీద ఆర్థిక దండయాత్రలే! స్టాక్ మార్కెట్ల పట్ల సరైన అవగాహనలేని కోట్లాది సామాన్య భారతీయుల కళ్ళు గప్పి, ప్రభుత్వం సాగిస్తున్న ఆర్థిక దాడులివి!

తక్షణమరియు ప్రత్యక్ష క్షతగాత్రుల కంటే ఆచరణలో పరోక్ష బాధితుల మీద దీర్ఘకాల యుద్ధ సన్నద్ధ చర్యలివి! ఈ ఆర్థిక యుద్ధంలో రేపు బలికాబోతున్న కోట్లాది భారతీయులకు, నేడు అర్థం చేసుకోలేని అర్థశాస్త్ర మిది. ఈ గజిబిజి, గందరగోళపు స్టాక్ మార్కెట్ల ఆర్థిక మాయా జాలాన్ని అర్థం చేసుకోగలగాలి. పశ్చిమ దేశాల కాపిటలిస్టు విశ్వ విద్యాలయాలలో చదివిన సరళీకరణఆర్థిక శాస్త్ర మేధో పండిత త్రయం (మన్మోహన్ సింగ్, చిదంబరం, మాంటెక్ సింగ్ ఆహ్లువాలియా) దేశ ప్రజలను తమ ఆర్థిక యుద్ధ ఊబిలోకి నైపుణ్యంతో ఈడ్చుతున్నారు. ఈ ఊబిలో చిక్కనివ్వకుండా దేశ ప్రజలను చైతన్యపరచాలంటే, గజిబిజిగా వున్న ఆర్థిక రంగ పద్మవ్యూహాన్ని విధిగా చేదించక తప్పదు. ముఖ్యంగా ప్రజా వుద్యమకారులకు ఈ పరిజ్ఞానం అత్యవసరమైనది.

స్టాక్ మార్కెట్లకి పతనాలు కొత్త కాదు. స్టాక్ మార్కెట్లు ఎగుడు, దిగుడులతో నడవడం సహజమైనదే! అయితే రోజు వారీ ఎగుడు, దిగుళ్ళకి భిన్నంగా దీర్ఘకాల ధోరణులు కూడా అరుదుగా సంభవిస్తాయి. దీర్ఘకాల క్రమాలను కలిగి వుండే 'ఎగుడు'ను 'ఊర్ధ్వ గమనం' అంటారు. అలాంటి 'దిగుడు'నే 'అధోగమనం' అంటారు. ఊర్ధ్వ గమన ధోరణినే స్టాక్ మార్కెట్ల కెరటాలంటారు. అధోగమన ధోరణిని పతనాలంటారు. ఇలాంటి పతన గాలులు (డౌన్ వేవ్స్) గతంలో రెండు సార్లు భారతీయ స్టాక్ మార్కెట్లో వీచాయి. ఈసారి మూడవ పతన గాలి వీస్తున్నది. గత రెండు డౌన్ వేవ్స్‌కు ఈసారి డౌన్‌వేవ్ భిన్నమైనది.

హర్షద్‌మెహతా బూమ్ బబుల్ బ్రేక్ (బలుపు బుడగ పగలడం) తర్వాత భారతీయ స్టాక్ మార్కెట్ల (సెన్సెక్సు మరియు నిఫ్టీ)లో మొదటి పతన గాలి వీచింది. ఈ పతన గాలి 1992 ఏప్రిల్‌లో సెన్సెక్సు 4546 పాయింట్ల వద్ద ప్రారంభమైనది. ఈ గాలి 1993 ఏప్రిల్ మధ్య వరకూ కొనసాగి, 1980 పాయింట్లకి పడిపోయింది. ఈ పతన క్రమానికి మొత్తం 13 నెలల కాలం పట్టింది. పతన శాతం 56.44%కి చేరింది. 1980 పాయింట్ల దగ్గర స్టాక్ మార్కెట్లు బాటమ్ అవుట్ అయ్యాయి. (పతన క్రమం ఒక చోట ఆగిపోయి, ఇక ఊర్ధ్వ గమనం పున:ప్రారంభమయ్యే రేఖను బాటమ్ అవుట్ అంటారు.) ఇక అక్కడి నుండి స్టాక్ మార్కెట్ల సూచికలు తిరిగి పుంజుకోసాగాయి.

ఐ.టి. బలుపు బుడగ బద్దలైన (బూమ్ బబుల్ బ్రేక్) సందర్భంగా 2000 ఫిబ్రవరిలో 6150 పాయింట్ల మధ్య రెండవ పతన గాలి (డౌన్ వేవ్) ప్రారంభమైనది. అది 2001 సెప్టెంబరు వరకూ కొనసాగి, తుదకి 2595 పాయింట్ల వద్ద బాటమ్ అవుట్ అయ్యింది. (న్యూయార్కు ట్విన్ టవర్స్‌పై దాడి తర్వాత అంతర్జాతీయ ఖండాంతర ఉగ్రవాదం మీద బుష్ ప్రభుత్వం నిరంతర యుద్ధం చేస్తానని ప్రతికార ప్రకటన అనంతరం) ఈ రెండవ పతన క్రమానికి 19 నెలల కాలం పట్టింది. ఈసారి పతన శాతం 57.8%కి చేరింది. ఇక 2595 పాయింట్ల నుంచి ఊర్ధ్వ గమనం ఉరుకులు, పరుగులతో కొనసాగింది.

ఇప్పుడు మూడోసారి పతన గాలి 2008 జనవరిలో ప్రారంభమైనది. ఈసారి సెన్సెక్సు 21206 పాయింట్ల వద్ద అధోగమనం అరంభమైనది. ఈ వ్యాసం రాసే సమయానికి (25.10.2008 నాటికి) 8701 పాయింట్లకి దిగజారింది. ఈసారి పతన రేటు 59.6 శాతానికి చేరింది. అయితే ఇది ఇంకా ముగియలేదు. ఎప్పుడు బాటమ్ అవుట్ అవుతుందనేది ఇప్పుడే చెప్పలేము. స్టాక్ మార్కెట్లు నేటికీ 'బేర్స్' గుప్పెట్లోనే వున్నాయి. 'బుల్స్' కనుచూపు మేరలో లేవు. అందుకే మూడవ అధోగమనానికి (డౌన్ వేవ్) 8701 పాయింట్లు బాటమ్ అవుట్‌గా నిర్ధారించకూడదు. అయినందున తాజా పతన రేటు 59.6 శాతం కూడా ఫైనల్ సంఖ్య కాదు. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలి. మొదటి బాటమ్ అవుట్ 56.44 శాతం పతన రేటు వద్ద అయ్యింది. రెండవ బాటమ్ అవుట్ 57.8 శాతం పతన రేటు వద్ద అయ్యింది. మూడవ బాటమ్ అవుట్ ఇంకా అవ్వక ముందే పై రెండు పతన రేట్లను దాటి, ఈసారి అప్పుడే 59.6 శాతానికి పతన రేటు చేరడం గమనార్హం!

మొదటి, రెండవ పతన క్రమాల కంటే తాజా మూడవ పతన క్రమం ఎందుకు భిన్నమైనది? ఇటు పరిమాణాత్మకంగానూ, అటు గుణాత్మకంగానూ క్రితం పతన క్రమాలకంటే తాజా పతన క్రమం భిన్నమైనదే! తొలుత గుణాత్మక వ్యత్యాసం గూర్చి తెలుసుకుందాం!

హర్షత్ మెహతా కుంభకోణం అవినీతి, మోసం, ధగాలకు సంబంధించినది. అప్పుడప్పుడే అమలులోకి వస్తున్న సరళీకరణసంస్కరణల తొలి దుష్ఫలితమది. బాబ్రీ మసీదు విధ్వంసంకై కర సేవకుల సమీకరణార్ధ దేశ వ్యాపిత కల్లోలం సృష్టించ జూస్తున్న సన్నద్ధ కాలంలో మొదటి డౌన్ వేవ్ కొనసాగింది. హర్షద్ మెహతా అవినీతి కుంభకోణానికి తోడు రాజకీయ అనిశ్చిత పరిస్థితి కూడా తోడు కావడంతో మొదటి పతన క్రమం సాగింది.

రెండవ పతన క్రమంలో ప్రధానంగా 'ఐ.టి. సూచిక' ఘోరంగా పడిపోయింది. దీని దుష్ప్రభావం మిగిలిన కొన్ని సూచికల మీద కూడా పడింది. అదే కాలంలో దేశంలో ప్రధాన ప్రాంతాలు వర్షాభావం వల్ల పంటలు తగ్గాయి. ప్రాథమిక ఉత్పత్తులు దెబ్బతినడంతో పతన క్రమం వేగం అందుకున్నది. కానీ ఈసారి మూడవ డౌన్ వేవ్ అలాంటిది కాదు. ఇది తద్భిన్నమైనది.

గత 2 స్టాక్ మార్కెట్ల పతనాలు ప్రధానంగా ఇండియాకే పరిమితం! ఆనాడు న్యూయార్కు, లండన్, టోక్యో స్టాక్ ఎక్చేంజీలు ఇలాంటి పతనాలకు గురి కాలేదు. వాటి పతనాలను అనుసరించింది కాదు. ఈసారి ప్రపంచ స్టాక్ మార్కెట్లన్నీ పతన మౌతున్నాయి. ముఖ్యంగా అమెరికా సబ్-ప్రైమ్ సంక్షోభం ఫలితమిది. అమెరికాలో 2007 ఆగస్టు నుంచే గృహ నిర్మాణరుణాల రీపేమెంటు క్రమం స్థంభించ సాగింది. దాని చీకటి ఛాయలు పరోక్షంగా కనబడ సాగాయి. అవి 2008 జనవరి నుంచి ప్రత్యక్షం కాసాగాయి. అక్కడ న్యూయార్కు స్టాక్ మార్కెట్ మఱ్రిచెట్టు తొఱ్ఱలోని చిలుక కేరింతలు కొట్టినంత కాలం ఇక్కడ ముంబాయి మాయా బజారులోని మాయల ఫకీరు శివతాండవం చేశాడు. లక్కడ చిలుకకి రెక్కలు విరగ సాగితే, ఇక్కడ మాయల ఫకీరుకు నడుములు విరగ సాగాయి. చిలుకకి ఇప్పుడు వైద్య చికిత్స తగినంత లేదు. 70 వేల కోట్ల డాలర్ల ప్యాకేజీతో కూడిన నెత్తురును చిలుకకి అర్జంటుగా డాక్టర్ బుష్ ఎక్కించినా, అది ఎగుర లేక పోతున్నది. అందుకే ఇక్కడ డాక్టరు మన్మోహన్ వైద్య చికిత్స వల్ల మాయల ఫకీరుకు 'నడక' రావడం లేదు. కఱ్రను కంది చేనిలో వదిలేసుకొని, పప్పుకుండలో వెదికితే ఎలా దొరుకుతుంది?

వీటి మధ్య పరిమాణాత్మక మార్పులను కూడా పరిశీలించుదాం! ఇందులో రెండున్నాయి. 1992-93 నాటి అధోగమనానికి (పతన కాలం) 13 నెలల కాలం పడితే, 2000-2001 నాటి అధోగమనానికి 19 నెలలు కాలం పట్టింది. కానీ తాజా పతన క్రమం నేటికి 9 నెలలుగా సాగుతున్నది. ఇంకా ముగియలేదు. కానీ ఈ 9 నెలల కాలానికే అనూహ్యమైన స్థాయిలో సెన్సెక్సు, నిఫ్టీ సూచికలు పతనమయ్యాయి. అంటే గత పతన వేగాల కంటే ఈసారి తక్కువ కాలంలో ఎక్కువ స్థాయిలో పతనమైనది. అదే విధంగా మొదటి పతన క్రమంలో పతన శాతం 56.44% వుంటే, రెండోసారి ఇది 57.8 శాతంగా వుంది. మూడోది ముగియక ముందే అంతకంటే మించి 59.6 శాతానికి పతనమైనది.

ఇక్కడ మరో 2 సంక్లిష్ట అంశాలను కూడా విశ్లేషించాల్సి వుంది. తొలుత 4546 పాయింట్ల నుంచి 1980 పాయింట్లకి పతనం కావడం కంటే, రెండోసారి 6150 పాయింట్ల నుంచి 2595 పాయింట్లకి పతనం కావడం అధిక తీవ్రతను సూచిస్తుంది. వాటి కంటే కూడా ఈసారి 21206 పాయింట్ల నుంచి 8701 పాయింట్లకి పతనం కావడం మరింత అతి తీవ్రతకు నిదర్శనం! చెరువులోని పై స్థాయి మట్టం నీళ్ళను కాల్వలకి వదలడం కంటే కింది మట్టం నీటిని వదలడం ఎక్కువ కష్టంతో కూడుకున్నది. ఇది కూడా అలాంటిదే! అంతేకాకుండా 1992-93ల కంటే 2000-2001లలో స్టాక్ మార్కెట్లకు ప్రభుత్వ విధానాలు అదనంగా అండనిస్తే, అంతకంటే రెట్టింపు అండదండలు ఇటీవల లభిస్తున్నాయి. పైగా ఐ.టి. రంగం తిరిగి పుంజుకుంటే, రియల్ ఎస్టేట్ కొత్తగా రంగ ప్రవేశం చేసి బలుపెక్కింది. ఇంకా బిలియనీర్ల సంఖ్య పెరిగిందంటూ ప్రచారం సాగింది. కానీ ఈ బలుపు అంతా ఏమైంది? 'ఇండియా షైనింగ్', 'ఫీల్ గుడ్ ఫ్యాక్టర్' వంటి నినాదాలు ఏమయ్యాయి?

భారత్ సంపదతో ధగధగలాడుతున్నదంటూ ఇటీవల సం॥రాలలో జరిగిన ప్రచారమంతా ఒక్కసారిగా నీరుగారింది. ముంబాయి స్టాక్ మార్కెట్ల పతనంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలుతున్నదని ఆర్థిక రంగ నిపుణులు ఎందుకు హెచ్చరిస్తున్నారు? వారి లెక్కల ప్రకారం ఇప్పుడు జరిగిన నష్టాలను చూద్దాము.

2008 జనవరిలో ముంబాయి సెన్సెక్సు గరిష్ఠంగా 21 వేల పాయింట్లు దాటింది. ఇది ఇంత వరకూ ఆల్‌టైమ్ రికార్డ్! సెన్సెక్సు, నిఫ్టీలలో నమోదైన లిస్టెడ్ కంపెనీల (సుమారు 5 వేలు) మొత్తం షేర్ల విలువ (దీనినే మార్కెట్ కాపిటలైజేషన్ అంటారు. సంక్షిప్త రూపంలో ఎం. క్యాప్ అని కూడా అంటారు.) 73 లక్షల కోట్ల రూపాయలు దాటింది. (భారతదేశ వార్షిక జి.డి.పి. సుమారు 45 లక్షల కోట్ల రూపాయలు) గత 9 నెలల పతన కాలంలో క్రమంగా ఈ మార్కెట్ క్యాప్ తగ్గుతూ 24.10.2008వ తేదీ నాటికి ఇది 27 లక్షల 74 వేల కోట్ల రూ॥లకు

చేరింది. కేవలం 9 నెలల కాలంలో సుమారు 45 లక్షల కోట్ల రూ॥ల మార్కెట్ విలువను కోల్పోయింది. ఒక్క అక్టోబర్ 24నే 3 లక్షల కోట్ల రూ॥లకి పైగా నష్టం చేకూరింది. ఫ్యాక్టరీలు స్థాపించిన నిజ ప్రమోటర్లకి ప్రత్యక్ష నష్టం రాదు. కానీ మదుపర్లు నష్టపోతారు. ఈ ప్రభావం పరోక్షంగా మొత్తం ఆర్థిక వ్యవస్థ మీద పడుతుంది. ఎగుమతుల తగ్గుదల, ఫ్యాక్టరీల మూసివేతలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కొనుగోలు శక్తి క్షీణించడానికి దారితీస్తాయి.

అక్కడ సోకాల్డ్ సోషలిస్టు చైనాలోని ఒక ఉదాహరణను చెప్పుకుందాం! వస్తూత్పత్తులకూ, వాటి ఎగుమతులకూ చైనా మార్కెట్ పేరొందింది. అలాంటి చైనాలో అధికంగా తయారయ్యే ఎలక్ట్రానిక్స్, పిల్లల ఆట బొమ్మలు, వస్త్ర ఉత్పత్తులు ప్రతి ఏటా డజన్ల బిలియన్ల డాలర్ల కొద్దీ అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. అమెరికా, యూరప్ దేశాల్లో సబ్-ప్రైమ్ సంక్షోభం వల్ల రుణాలు తీర్చలేక నిర్మించుకున్న ఇళ్ళనే పౌరులు వదిలేసుకుంటున్న దుస్థితి నెలకొన్నది. అలాంటి దేశాల్లో పిల్లలకి ఇక ఆట బొమ్మలేంకొంటారు? అందుకే చైనా నుంచి ఎగుమతులు అక్టోబరు నుంచే స్థంభించాయి. దీనివల్ల 2009 జనవరి ఫస్టు నుంచి దక్షిణచైనాలోని మొత్తం 45 వేల పరిశ్రమలలో 9 వేల యూనిట్లను మూసివేయబోతున్నట్లు యాజమాన్యాలు 24.10.2008న బీజింగ్‌లో ప్రకటించాయి. వీటిలో పనిచేస్తున్న 27 లక్షల మంది కార్మికులు రోడ్డున పడబోతున్నారు. సుబ్బి పెండ్లి ఎంకి చావుకి వచ్చినట్లు అమెరికా సంక్షోభం ప్రపంచాన్ని చుట్టు ముడుతున్నది.

భారతదేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు బ్రహ్మాండంగా పెరిగాయని ప్రభుత్వం ఇంత కాలం తెగ ప్రచారం చేసింది. పి.వి. ప్రభుత్వం గద్దెనెక్కినప్పుడు విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్ రిజర్వు) లేనందున బంగారం ప్రపంచ మార్కెట్లలో కుదువపెట్టిన నేపధ్యంలో నిల్వల పెరుగుదలను చూపించి ప్రజలను మురిపించ జూసింది. కానీ ఇదంతా వట్టి పొంగు అని తాజా పరిణామాలు నిరూపించాయి. 2008 మే నెలలో ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి ఫారెక్స్ నిల్వలు చేరాయి. ఆనాడు అవి 316 బిలియన్ డాలర్లకి చేరాయి. ఈ వ్యాసం రాసే సమయానికి అవి 274 బిలియన్ డాలర్లకి తగ్గాయి. అంటే కేవలం 6 నెలల్లో 42 బిలియన్ డాలర్లు తిరిగి విదేశాలకు తరలిపోయాయి.

అక్టోబర్‌లో కేవలం ఒక్క మొదటి వారంలోనే 10 బిలియన్ డాలర్లు తరలిపోయాయి. ఈ తరలిపోయిన 42 బిలియన్ డాలర్లలో సుమారు మూడోవంతు కేవలం స్టాక్ మార్కెట్ల నుంచి షేర్ల అమ్మకాల రూపం (ఎఫ్ఐఐల బేరిష్ ధోరణి)లో విదేశాలకు తరలిపోవడం గమనార్హం! అంటే, కేవలం విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐలు) తమ స్టాక్ వ్యాపారంకై తెచ్చిన డాలర్లు మన దగ్గర ఫారెక్స్ నిల్వలుగా మారాయి. అది మన నిజ ఉత్పత్తుల ఎగుమతుల రాబడివల్ల చేకూరిన నిజ నిల్వలు కాదు. దీనిని బట్టి స్టాక్ మార్కెట్ల పతనానికీ, ఫారెక్సు నిల్వల పతనానికీ మధ్య గల అనుబంధం అర్ధమౌతున్నది.

విదేశీ మారక నిల్వలు అధికంగా వున్నంత కాలం డాలరుతో రూపాయి మారకపు విలువ బాగా పెరిగి, 40 పైసలకి చేరింది. కానీ నేటి సంక్షోభంవల్ల ఎఫ్ఐఐలు తమ షేర్లను అమ్మి డబ్బును వెనక్కి తీసుకెళ్తుండటంతో మన రూపాయి విలువ ఆల్‌టైమ్ రికార్డ్ 50 రూ॥లకి (24.10.2008కి) దిగజారింది. మరింత ఘోరంగా దిగజారుతున్న రూపాయి విలువని నిలబెట్టడానికి 24.10.2008వ తేదీ ఒక్క రోజే ఆర్.బి.ఐ 3 బిలియన్ డాలర్లను అర్జంటుగా అమ్మి వేసింది. మరో 3 బిలియన్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యనిల్వలు తరిగి పోవడం తప్ప, మన రూపాయి విలువ నిలబడింది లేదు.

ముడి చమురు రేట్ల పెరుగుదల వల్లనే మన స్టాక్ మార్కెట్లు పతనమౌతున్నాయని ఒక దశలో మన ప్రభుత్వం బుకాయించ బోయింది. 2008 జనవరి 21న ఒకే రోజు 1400కి పైగా పాయింట్లు సెన్సెక్సు పడిపోవడంతో తాజా అధోగమనం (డౌన్‌వేవ్) ఆరంభమైనది. ఆనాటికి ఆయిల్ రేట్లు అంతటి ఆందోళనకర స్థాయికి చేరలేదు. ఏప్రిల్ - మే నెలల నుంచే బాగా పెరిగాయి. కానీ తిరిగి ఆగస్టు నుంచి ఆయిలు రేట్లు క్రమంగా తగ్గ సాగాయి. ఇప్పుడు అది పీపా (బ్యారెల్)కి 60 డాలర్ల స్థాయికి పడిపోయింది. 147 నుండి 60 డాలర్లకి ధర తగ్గింది. అయినా స్టాక్ సూచికలు మరింతగా ఎందుకు దిగజారుతున్నాయి? పైగా పీపాకి వంద డాలర్లకి పైగా ధర వున్నప్పుడు ఒక డాలరుకు కేవలం 40 రూ॥లనే మారక ధనంగా చెల్లించాము. ఇప్పుడు డాలర్ల రూపంలో తగ్గినా, ఒక్కొక్క డాలరుకి 50 రూ॥ల చొప్పున చెల్లిస్తున్నాము. దీని ద్వారా కూడా మన విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గి, సంక్షోభం మరింత తీవ్రతరం కానున్నది.

ఇంతకూ విదేశాల నుంచి స్టాక్ మార్కెట్లలో లాభాల కోసం డబ్బును తెచ్చిన ఎఫ్ఐఐలు, ఇప్పుడు అతి తక్కువ రేట్లకు తమ షేర్లను ఎందుకు అమ్ముకుంటున్నాయి? అమెరికా సంపన్న ప్రభువులు, యూరప్ బాబులు లాభాల కోసం వచ్చి, నష్టాలకు అమ్ముకోవడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తుంది. తమ సాధారణలాభ గుణానికి భిన్నంగా ప్రవర్తించాల్సిన దుస్థితికి వారు గురయ్యారు. ఇక్కడ స్టాక్ మార్కెట్లలో షేర్లు కొనుకున్న ఎఫ్ఐఐలు యూరప్, అమెరికా దేశాలలో దివాళా తీశాయి. ఈ అనూహ్యపతనం వల్ల 'తమ స్వదేశాలలో అప్పులిచ్చిన రుణదాతల నుంచి తీవ్ర వత్తిళ్ళు ఎదురౌతున్నాయి. ఇందులోని బ్యాంకులు, ఇన్వెస్టు సంస్థలు ఇక వచ్చినంత ధరకు షేర్లను అమ్ముకొని ముంబై నుంచి మూటా, ముల్లె సర్దుకు పోక తప్పడం లేదు. అందుకే ద్రవ్య తరలింపుకు దిగారు. అందుకే ఫారెక్సు రిజర్వులు క్షీణిస్తున్నాయి. అందుకే రూపాయి చితికి పోతున్నది. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. అందుకే ఆయిలు రేట్లు డాలర్ల రూపంలో తగ్గిన మేరకు మనకి లాభించడం లేదు. అందుకే దిగుమతుల ధర పెరిగి, వాటి పరిమాణం తగ్గుతున్నాయి. అమెరికా, యూరప్‌లలో కొనుగోలు శక్తి క్షీణించినందున మన ఎగుమతులు కూడా తగ్గాయి. (చైనా గూర్చి పైన పేర్కొన్నాము). ఇటు దిగుమతులూ తగ్గాయి. అటు ఎగుమతులూ తగ్గాయి. ఫలితంగా మనవారి శ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుతాయి. నిరుత్పాదకమైన స్టాక్ మార్కెట్ల పతనం వల్ల నిజ ఉత్పాదక రంగాలు దెబ్బతింటాయని రుజువు అవుతున్నది.

మన భారత్ బ్యాంకింగ్ రంగం బలంగానూ, స్థిరంగానూ వుందని మన్మోహన్, చిదంబరంలు శెలవిస్తున్నారు. మన ఆర్థిక వ్యవస్థ ప్రాధమిక పునాదులతో నిలబడిందట! అందుకే ప్రపంచ సంక్షోభ ప్రభావం పడదట! ఇంత కాలం ఇలాగే ఊదరగొట్టారు. అంతేకాకుండా, సెప్టెంబర్ 16 నాటి సెన్సెక్సు పతనం తర్వాత (ముఖ్యంగా అక్టోబరు మొదటి వారం నుంచి) చకచకా కొన్ని చర్యలను మన ఆర్.బి.ఐ చేపట్టింది. క్యాన్సర్ రోగికి నెత్తురు ఎక్కించిన చందంగా ఆర్.బి.ఐ చర్యలున్నాయి. ద్రవ్య పరపతి త్రైమాసిక సమీక్షను అక్టోబరు 24వ తేదీన చేపట్టాల్సి వుంది. ఆ తేదీ వరకు కూడా ఆగకుండా ఎమర్జెన్సీ చర్యలను చేపట్టింది. అవి ఏవీ ఫలించలేదు. ఆ చర్యల గూర్చి ప్రస్తావించుకుందాం.

తొలుత బ్యాంకింగ్ రంగంలో నగదు నిల్వల నిష్పత్తి (Cash Reserves Ratio - CRR)ని 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. (అనగా అర శాతం) చర్యవల్ల సి.ఆర్.ఆర్ 9 శాతం నుంచి 8.5 శాతానికి తగ్గింది. పి. నోట్స్ మీద ఆంక్షలను ఎత్తి వేసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు 40 శాతం కంటే భాగస్వామ్య హక్కును మించకుండా 2007లో ఆర్.బి.ఐ ఆంక్షలను విధించింది. వారు తమ షేర్లను అమ్ముతున్న స్థితిని నివారించుటకై గత ఆంక్షలను ఎత్తి వేసింది. భాగస్వామ్య వాటా పెంపుకు భారీగా, గేట్లను తెరిచింది. అయినా ఎఫ్.ఐ.ఐలు కొత్తగా రాక పోగా ఆ తర్వాత మరింత ముమ్మరంగా వెనక్కి వెళ్ళాయి.

ప.ప్రసాదు

మరో 3 రోజులకే 'కిడ్నీ రోగికి డయాలసిస్' చికిత్స చందంగా సి.ఆర్.ఆర్‌ను మరో బేసిస్ పాయింట్లకి (ఒక శాతం) తగ్గించింది. తిరిగి వారానికే మరో 100 బేసిస్ పాయింట్లకి (మరో శాతం) తగ్గించింది. సి.ఆర్.ఆర్‌ను మొత్తం 2.5% తగ్గించింది. దీని వల్ల గతంలోని కనిష్ట 9 శాతం సి.ఆర్.ఆర్ రేటు 6.5%కి తగ్గి పోయింది. ఈ కారణంగా లక్ష కోట్ల రూ॥ల ద్రవ్య పరపతి లేదా ద్రవ్యలభ్యత (లిక్విడిటీ) మార్కెట్లోకి చేరింది. ఇది కాకుండా స్టాక్‌మార్కెట్ల మీద విశ్వాసం కోల్పోయిన మదుపర్లు తాము మ్యుచ్యువల్ ఫండ్స్(యం.ఎఫ్)కి యిచ్చిన మదుపును వాపసు తీసుకోసాగారు. దీనితో ముచ్యువల్‌ఫండ్స్‌లు కూడా అతి తీవ్ర వత్తిడికి గురయ్యాయి. మదుపర్ల డబ్బు వాపసు చెల్లింపు చేయాలంటే ఈ ఎం.ఎఫ్‌లు కూడా (ఎల్.ఐ.సి., కెనరా బ్యాంకు వగైరాలు) స్టాక్ ఎక్చేంజీలలోని తమ షేర్లను అమ్మక తప్పడం లేదు. ఈ వత్తిళ్ళకి తోడు కావడంతో సెన్సెక్సు, నిఫ్టీలు మరింత పతనమౌతున్నాయి. అందుకు ప్రభుత్వం ఆర్.బి.ఐ నుంచి 20 వేల కోట్ల రూ॥ల ద్రవ్య పరపతిని మ్యూచ్యువల్ ఫండ్స్‌లకు కల్పించింది. ఇది కాకుండా రైతుల రుణాలను మాఫీ చేసిన మొత్తం 60 వేల కోట్ల రూ॥లలోని పాతిక వేల కోట్ల రూ॥లను మొదటి వాయిదాగా అర్జంటుగా వాణిజ్య బ్యాంకులకి ఆర్.బి.ఐ చెల్లించింది. అంటే మొత్తం 1,45,000 కోట్ల రూ॥ల లిక్విడిటీ (ద్రవ్య పరపతి)ని కల్పించింది. అయినా స్టాక్ మార్కెట్ పతనం ఆగలేదు.

ఈ ఏడాది ఏప్రిల్ 29న 2007-08 ఆర్.బి.ఐ వార్షిక ద్రవ్య విధాన సమీక్ష సందర్భంగా సి.ఆర్.ఆర్ 8.5 శాతం వుండేది. రెపోరేటు 8.75 శాతం వుండేది. ఆ తర్వాత 2008 జూలై 29న ఆర్.బి.ఐ. త్రైమాసిక (ఏప్రిల్, మే, జూన్‌ల) ద్రవ్య విధాన సమీక్ష సందర్భంగా సి.ఆర్.ఆర్‌ను 8.5% నుంచి 9%కి ఆర్.బి.ఐ పెంచింది. రెపో రేటును 8.75% నుంచి 9%కి పెంచింది. ఆ రోజు పెంపుదలకి పూనుకున్న ప్రభుత్వమే ఈ రోజు 24.10.08న (ఈ వ్యాసం రాసే సమయానికి) రెండవ త్రైమాసిక (జూలై, ఆగస్టు, సెప్టెంబరుల) ద్రవ్య విధాన సమీక్ష జరిగింది. ఈ సమీక్ష వరకు కూడా ఆగకుండా, పైన పేర్కొన్న సి.ఆర్.ఆర్ పెంపుదలకి దిగింది. అంతేకాకుండా రెపోరేటును కూడా 9% నుంచి 8కి తగ్గించింది. కేవలం రెండున్నర నెలలలోనే ప్రభుత్వ విధానం ఎందుకు మారింది?

మొదటి త్రైమాసిక ద్రవ్య సమీక్ష (29.7.08) నాటికి రెండంకెలకి చేరిన ద్రవ్యోల్బణం తగ్గింపు మీద తాను కేంద్రీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ బూర్జువా ప్రభుత్వాల అంచనా ప్రకారం వ్యవస్థలో వస్తూత్పత్తుల సరఫరా కంటే ద్రవ్య సరఫరా అధికంగా వుంటే ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. లక్ష కోట్ల రూ॥ల విలువ గల సరుకులు మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా వుండి, 2 లక్షల కోట్ల రూ॥ల ధనం కొనుగోలుదార్ల చేతుల్లో కొనుటకు సిద్ధమైతే ధరలు పెరుగుతాయట! వీరి ఆర్థిక నియంత్రణసూత్రాల ప్రకారం ద్రవ్య చెలామణీని మార్కెట్లో తగ్గించాలి. అందుకే ఆనాడు వ్యవస్థ నుంచి ద్రవ్యాన్ని నియంత్రించుటకై ఆనాడు ఆర్.బి.ఐ రెపోరేటునూ, సి.ఆర్.ఆర్‌నూ పెంచింది. కానీ ఇప్పుడు ద్రవ్యోల్బణం తగ్గు మొఖం పట్టిందట! ఇక దాని ముప్పు తప్పిందట! ఇప్పటి తాజా ముప్పు స్టాక్ మదుపర్లకి ద్రవ్య పరపతి లేనందున షేర్లు తెగ అమ్మి వేయడమేనట! అందుకే 75 రోజుల్లోనే, పైగా ద్రవ్యోల్బణం రెండంకెల నుంచి దిగక ముందే, తమ ద్రవ్య విధానంలో మౌలిక మార్పులు చేసింది.

బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్ దార్ల భద్రత కోసం ఆర్.బి.ఐకి కొన్ని నియంత్రణలున్నాయి. డిపాజిట్‌దార్లు తమ డబ్బును ఎప్పుడు ఎంత మొత్తంలో అడిగినా బ్యాంకులు వారికి యిచ్చి తీరాలన్న ప్రాతిపదిక మీద ఈ నియంత్రణలు ఉద్దేశించినవి. ప్రతి బ్యాంకు కూడా తాను సేకరించిన డిపాజిట్ల మొత్తంలో కొంత నిర్దిష్ట శాతం నగదు రూపంలో తన వద్ద విధిగా నిల్వవుంచుకోవాలి. దీనినే స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్.ఎల్.ఆర్) అంటారు. మరికొంత శాతం నగదు ప్రతి బ్యాంకు కూడా విధిగా ఆర్.బి.ఐ వద్ద నిల్వవుంచాలి. దీనినే నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్) అంటారు. గతంలో ఎస్.ఎల్.ఆర్ - 37.5 శాతం వుండేది. సి.ఆర్.ఆర్. 11.5 శాతం వుండేది. అంటే ఒకానొక బ్యాంకు లక్షకోట్ల డిపాజిట్లను సేకరించిందనుకుందాం. అందులో 37,500 కోట్లను ఎస్.ఎల్.ఆర్ రూపంలో తన వద్దే నిల్వ వుంచాలి. సి.ఆర్.ఆర్. రూపంలో 11,500 కోట్లు ఆర్.బి.ఐ వద్ద వుంచాలి. ఈ మొత్తం 49 వేల కోట్లు నగదు చెల్లింపుకు వీలుగా వుండాలి. మిగిలిన 51 వేల కోట్ల సొమ్మును అట్టి సదరు బ్యాంకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు అప్పులిచ్చుకుంటాయి. తీవ్ర కరువు లేదా దుర్భిక్షం, లేదా సదరు బ్యాంకుపై అపనమ్మకం ఏర్పడటం, లేదా మరో బ్యాంకు ఎక్కువ వడ్డీరేటు యివ్వడం వంటి సందర్భాలలో డిపాజిట్ దార్లు మాస్‌గా ఉపసంహరణకి పూనుకోవచ్చు. అయినా బ్యాంకు డిఫాల్ట్ కాకుండా ఇవి వుపయోగ పడేవి. కానీ సరళీకరణవిధానాల నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంపై నియమించిన నర్సింహం కమిటీ సిఫారసుల ఆధారంగా ఎస్.ఎల్.ఆర్, సిఆర్ఆర్‌ల తగ్గింపుకు ప్రభుత్వం పూనుకున్నది. తద్వారా పారిశ్రామికవేత్తలకు అప్పులిచ్చే పరపతి సహజంగానే పెరుగుతుంది. అందుకే గత ఎస్.ఎల్.ఆర్. 37.5% నుంచి 25%కి తగ్గింది. (ఒక దశలో సిఆర్ఆర్ 5%కి కూడా తగ్గింది) ఈ చర్యలు కూడా సరళీకరణవిధానానికి అద్దం పట్టేవే!

అక్టోబరు 24న ఆర్.బి.ఐ సమీక్షలో ఎస్.ఎల్.ఆర్‌ను కూడా తగ్గించాలనీ, సి.ఆర్.ఆర్, రెపోరేట్లు మరింత తగ్గించాలనీ పారిశ్రామిక వాణిజ్య వర్గాలు ప్రభుత్వాన్ని కోరాయి. సమీక్షకి ముందే ఆరాటంగా తగ్గించిన చర్యలేవీ ఫలితాలివ్వలేదు. వ్యవస్థలోకి విడుదలైన ఒక లక్షా 45 వేల కోట్ల రూ॥ల ద్రవ్య పరపతి స్టాక్ మార్కెట్లలో షేర్ల కొనుగోలుకు వినియోగించబడలేదు. ఎం.ఎఫ్‌ల కోసం ప్రభుత్వం ప్రతేకంగా కేటాయించిన 20 వేల కోట్ల విండోస్కీమ్ సొమ్ము కూడా అలాగే పడివుంది. అందులో 3 వేల కోట్లకి మాత్రమే ఎం.ఎఫ్‌ల నుంచి బ్యాంకులకి దరఖాస్తు లొచ్చాయి. అంటే ఒక వేళ డబ్బు అందుబాటులోకి వచ్చినా షేర్ల కొనుగోళ్ళకి అన్ని రకాల మదుపుదార్లు కూడా సిద్ధంగా లేరని తెలిసిపోయింది. గాన తాము కల్పించిన ద్రవ్య పరపతి స్టాక్ మార్కెట్లలోకి వెళ్ళుటకి బదులుగా వస్తు మార్కెట్లకి మళ్ళింపు జరుగుతుందనే భయం ప్రభుత్వానికి పట్టుకున్నది. వినిమయ వస్తుకొనుగోళ్ళు పెరిగితే ధరలు పెరిగి ద్రవ్యోల్బణం ముమ్మరమయ్యే ప్రమాదం వుందని భావించింది. తిరిగి ఒక్క వారం తిరక్క ముందే మళ్ళీ రూటు మార్చింది. అందుకే తాజా ద్రవ్య సమీక్షలో తగ్గింపులకి దిగలేదు. పైగా తొలి గంభీర భద్రతా ప్రకటనల బాణీని విడిచిపెట్టి, ఒకింత నిజాన్ని ఒప్పుకొక తప్పలేదు.

సరిగ్గా ముంబాయిలో ద్రవ్య విధాన సమీక్ష జరిగే రోజైన అక్టోబరు 24వ తేదీనే బీజింగ్‌లో ఆసియా-ఐరోపా దేశాల శిఖరాగ్ర సమావేశంలో మన్మోహన్‌సింగ్ ప్రసంగిస్తూ కఠిన సత్యాలను వెల్లడించారు. 1) సంపన్న దేశాల్లో ఆర్థిక నియంత్రణ, పర్యవేక్షణల వైఫల్యం 2) ప్రయివేటు ఆర్థిక రంగంలో ప్రమాద నివారణవ్యవస్థ వైఫల్యం 3) మార్కెట్ల క్రమశిక్షణా యంత్రాంగం లేక పోవడం వల్ల నేటి ప్రపంచ సంక్షోభం ఏర్పడిందని ఆయన విశ్లేషించారు. ఒకవైపు ప్రయివేటీకరణే సర్వస్వమనీ, నియంత్రణలు లేని స్వేచ్ఛా పోటీతత్వం వుండాలని నూరుపాళ్ళు వాధించే మన్మోహన్‌సింగ్ నేడు ఈ విశ్లేషణచేయడం గమనార్హం!

ఇక ఇండియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తాజా ఆర్థిక సంక్షోభానికి 1) ద్రవ్య లక్ష్యత సమస్య 2) నిరర్ధక ఆస్తుల వృద్ధి 3) మూల

సముద్రంపై చేపల చెరువులు సహజ మత్స్య ఉత్పత్తికి ముప్పు

972 కిలోమీటర్ల పొడవునా విస్తరించి వున్న కోస్తా తీరంలో 85 లక్షల మంది మత్స్యకారులు సాంప్రదాయంగా వేటపై ఆధారపడి బతుకుతున్నారు. ఈ తీరంలో ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమల వల్ల మత్స్యసంపదకు ముప్పు వాటిల్లుతుంది, తాజాగా తీరం వెంబడి పోర్టులు, రసాయన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం వల్ల మత్స్యసంపదకు పెను ముప్పు కలిగే పరిస్థితి ఉంది. సముద్ర ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడి బ్రతికే మత్స్యకారుల జీవన స్థితిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది. పరిశోధన, అభివృద్ధి విభాగాలు ఖర్చుతో కూడుకున్న రసాయనాల వాడకాన్ని నియంత్రించి చవకైన రసాయనాల ద్వారా ఉత్పత్తిని పెంచేందుకు కంపెనీలు ప్రయత్నిస్తుంటాయి. రసాయన ఉత్పత్తుల తయారీలో అంతిమంగా ద్రవ రూపములో విడుదలయ్యే వ్యర్ధ రసాయనాలు (మదర్ లిక్కర్) అత్యంత ప్రమాదకరమైనవి. సైనేడ్లు, సల్ఫర్ కాంపౌండులు, నైట్రోజన్ కాంపౌండ్లు (అమ్మోనియా మిశ్రమాలు) వంటి కారకాలు వీటిలో ఉంటాయి. ఈ నీటిని శుద్ధిచేసి చేపలపై పరీక్ష చేసిన తరువాత సముద్రములోకి వదిలేస్తామని, తీరంలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసే యాజమాన్యాలు, ప్రభుత్వమూ ప్రజలకి చెబుతున్నాయి. రసాయనాలు ఎంత శుద్ధి చేసినా వాటిలోని కాలుష్య కారకాలను పూర్తిగా తొలగించే పరిజ్ఞానం ప్రస్తుతం అందుబాటులో లేదు. పరిశ్రమలన్నీ కాలుష్య కారకమైనవే. రసాయనాలు, పెట్రో రసాయనాలు ఇతర ప్రాసెసింగ్ పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థ కాలుష్యాలన్నీ సముద్రములోకి వదిలేందుకు వీలుగా వుంటుందని ప్రభుత్వమే ఈ ప్రాంతాలను ప్రతిపాదించింది. ప్రత్యక్షంగా భూగర్భజలాలు, వాయుకాలుష్యం వల్ల జరిగే ప్రమాదంతోపాటు, మత్స్యకారుల జీవనం, ప్రజల ఆరోగ్యాల పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు చెప్పడం లేదు.

నశించించిపోతున్న చేపజాతులు

ఇప్పటికే, పోర్టుల నిర్మాణంతో సముద్రజలాల్లో పెద్ద పెద్ద ఓడలు తిరగటం వలనా, అవి వదిలే మడ్డి ఆయిల్ వలనా, సముద్రాన్ని సైనికుల యుద్ధ బాంబుల ప్రయోగశాలగా ప్రభుత్వం వాడుటము వలనా, ఫ్యాక్టరీలు వదిలే విషపదార్థాలతోనూ, సముద్రములో కలవటము వలనా, సముద్రజలాలు కలుషితమవుతున్నాయి. దీనివలన మాగ చేప, తెల్లపాము (బొమ్మిడాయి) నల్లజల్ల, ఎర్రఎంగలి, కిలాయి, పూగ చేప, శుదుమ్ము, తెల్లచందున, పాలసొర్ర, కొమ్ముచొర్ర, తిగచొర్ర, యాలంచొర్ర, మట్టచొర్ర, గుడ్డ ఆకురాయి, చుక్కారా, నల్లఎంగలి తదితర చేపజాతులు అంతరించిపోయినాయి. రొయ్యల ఉత్పత్తి తగ్గింది. విశాఖపట్నం ఏరియాలో ఓడలు వదిలిన మడ్డి ఆయిల్‌ను మొయ్య చేప తినటము వలన, తల దగ్గర నుండి సగభాగము వరకు ఈ చేప ఆయిల్ వాసన వస్తుందని ఆ ప్రాంత ప్రజలంటున్నారు.

పక్షుల వలే చేపలు కూడా కొన్ని సమయాల్లో అవి నివశించే ప్రాంతాల నుంచి వేరొక ప్రాంతానికి వలస పోతుంటాయి. సాధారణంగా కొన్ని రుతువులలో వాటిలో కలిగే కొన్ని లైంగికపరమైన మార్పుల వలన సంతానోత్పత్తికి వలసలు పోతుంటాయి. కొన్ని రకాలు చేపలు వేలు, లక్షల సంఖ్యలో ప్రతియేటా ఒకే కాలంలో ఒక చోట నుంచి సుదీర్ఘంగా ప్రయాణం చేసి ఆ ప్రాంతములో కొంత కాలం జీవిస్తుంటాయి. మరికొన్ని రకాల చేపలు నదీజలాల నుంచి సముద్రంలోకి వలసపోతుంటాయి. వీటినే కేటాడ్రోమస్ చేపలు అంటారు. మరికొన్ని రకాల చేపలు సముద్ర జలాల నుంచి, నదీ జలాలలోకి వలస పోతుంటాయి. వీటిని పనాడ్రోమస్ చేపలు అంటారు. ప్రపంచములోనే అతి అరుదైన పులస చేపల రేటు కిలోకు రూ. 800 నుండి 1000 ల వరకు వుంటుంది. ఇవి మన దేశంలో కొన్ని నదుల్లోనే సంచరిస్తాయి. ఈ పులస చేపలను ఆంగ్లంలో ఇండియన్ షాడ్ అని, హిల్సాహిలాషా అని కూడా అంటారు.

ఈ పులస చేపలు ఆస్ట్రేలియా వంటి దూర ప్రాంతాల నుంచి ఖండాంతరాలను దాటి హిందూ మహాసముద్రం గుండా బంగాళాఖాతంలో కలిసే గోదావరి నదిలోకి వస్తాయి. సంతానోత్పత్తికి వలస వచ్చే ఈ పులసలు మన రాష్ట్రంలోనే గోదావరి తీర ప్రాంతాలైన రాజమండ్రి, ధవలేశ్వరం, కోనసీమ, కృష్ణానదిలోనూ, ఉప్పుటేరు వంటి వాగుల్లోను, ఒరిస్సాలోనూ, చిలక సరస్సులోనూ

మేకల ప్రసాద్

[illegible]

లభ్యమవుతాయి. ఈ జాతి పులస చేపల్లో మగ వాటి కంటే ఆడ చేపల సంఖ్య పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది. రాజమండ్రి నగరంలోనే కలుషిత నీటిని, పేపరు మిల్లు కలుషిత నీటిని గోదావరి నదిలో వదిలి వేయడం వల్ల పులస చేపల సంపద అంతరించి పోతున్నదని పర్యావరణశాస్త్రవేత్తలు, మత్స్యకారులు చెబుతున్నారు. కాలువలు, చెరువులు, మాగాణి నీటిలో పెరిగే చేదు పక్కెలు, కొర్రమీను, కొర్రమట్ట, బురదమట్ట, పూమీను చేపలు పంట పొలాలకి వాడే గుళికలు, రసాయనా ఎరువులలో గల విష పదార్థాల వలన, నీరు కలుషితమై ఈ జాతి చేపలు అంతరించిపోతున్నాయి. మాగాణి గట్టల మీద దొరికే ఎర్రపీత, నల్లపీత జాతులు అంతరించిపోతున్నాయి.

సహజ సిద్ధముగా సముద్రాలు, నదులు, కాలువలు, చెరువులలో ఉత్పత్తి అయ్యే చేపలు ఆహారాన్ని సమకూర్చుకొని రోగాలకు ఏ మందులు వాడకుండా, కొన్ని కేజీల కొద్ది పెరిగే వందలాది రకాల చేప జాతులు, పాలకుల సామ్రాజ్యవాదుల అనుకూల చర్యల వలన అంతరించి పోతున్నాయి.

భారత సముద్ర జలాలలోనే లోతట్టు ప్రాంతాలలో విదేశీ ట్రాలర్ల యజమానులతో కలసి ఉమ్మడిగా చేపలు పట్టి వాటిని విదేశాలకు అమ్మి, డాలర్లు సంపాదించాలని, డీపీసీ ఫిషింగ్ పాలసీని రూపొందించారు. భారతీయులతో కలసి ఏర్పాటు చేసుకున్న అనేక విదేశీ కంపెనీలు సముద్ర చట్టాలకు వ్యతిరేకంగా సన్న రంధ్రాలు కలిగిన వలలు వాడటము వలన ఆయా ప్రాంతాలలో చేపలు ఇప్పటికే తుడిచి పెట్టుకుపోయాయి. ఫలితంగా నాటు పడవలలో చేపలు పట్టే మన మత్స్యకారులు నష్టపోతున్నారు.

చేపల ఉత్పత్తి కోసం ప్రత్యేక సముద్ర, నది చట్టాలు చేసిన పాలకులు చేపల అభివృద్ధి కోసం వేలకోట్ల రూపాయలు కేటాయించి మత్స్యసంపదను అభివృద్ధి చేయకుండా ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారు. దీని వలన మత్స్యకారులకి జరిగిన మేలు నామమాత్రమే.

అధికార మార్పిడి జరిగిన నాటి నుండి అడుగడుగునా సామ్రాజ్యవాదుల షరతులకి తలవంచి పాలన చేస్తున్న మన పాలకులు దేశ చట్టాలని ధిక్కరించి, సముద్రాన్ని, మత్స్యసంపదని నాశనం చేస్తున్నారు. నేడు మత్స్యకారులకి మెరుగైన ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలని చెప్తూ సముద్రముపై చేపల చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. వానిలో (కృత్రిమ చేపలు) ట్యూనా చేపలు పెంచాలని, దీనికి జపాన్‌లో మంచి మార్కెట్టు ఉందని చెప్తున్నారు. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికాకు చెందిన వరల్డ్ ట్యూనా డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ కంపెనీతో 2008 మార్చి 26న రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో అమెరికా సంస్థ ప్రతినిధి వి.కె. బెనర్జీ, రాష్ట్ర మత్స్యశాఖ కమీషనర్ అరవిందకుమార్, ఇరువర్గాలు అగ్రిమెంట్లపై సంతకాలు చేసి ఒప్పందము చేసుకున్నారు.

ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన మత్స్యకారుల జీవితాలలో మార్పు రాకపోగా సముద్రములో అరకొరగా దొరుకుతున్న మత్స్య సంపద నాశనమవడానికే దారితీస్తున్నది. ట్యూనా చేపల పెంపకానికి వాడే మందుల వల్ల సహజ సిద్ధముగా సముద్రంలో ఉత్పత్తి అయ్యే మత్స్యసంపద నశినిచిపోయి మత్స్యకారులను బికారులుగా మార్చేస్తున్నది. సముద్రంపై, మత్స్యసంపదపై అమెరికా కంపెనీలకి హక్కులు కల్పించి ఇప్పటి వరకు సముద్రానికి, మత్స్యసంపదకి యజమానిగా ఉన్న మత్స్యకారులను, అమెరికా కంపెనీల ఎంగిలి మెతుకులకు ఎదురు చూసే కూలీలుగా మార్చి వేస్తున్నది నేటి ప్రభుత్వం. దీనికి అభివృద్ధి అని పేరు పెడుతున్నది. చైనాను ఆదర్శముగా తీసుకోమని మన ప్రభుత్వం హితబోధ చేస్తున్నది. చైనాలో పారిశ్రామికీకరణవల్ల 2.6 కోట్ల ప్రజలు కరిక దరిద్రములో మగ్గుతున్నారు. ఇందులో 1.2 కోట్ల మంది మత్స్యకారులున్నారు. మలేషియా, సింగపూర్, తైవాన్, జపాన్ వంటి దేశాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు. సముద్ర సంపదలని అమెరికా కంపెనీలకు అమ్మే పాలకుల చర్యలకు వ్యతిరేకంగా మత్స్యకారులు పోరాడాలి. నేడు కోస్టల్ కారిడార్ ముసుగులో మత్స్యకారులను అనాదలుగా చేసే రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి. సముద్రంపై, మత్స్యసంపదపై సర్వహక్కులు తమవేనని చాటి చెప్పే విధంగా మత్స్యకారులు ఉద్యమించాల్సి ఉన్నది.

ధనం కొరత 4) మార్కెట్లపై విశ్వాసం కోల్పోవడం (సెంటిమెంటు పతనం) కారణాలని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. ఒకవైపు ఇండియా షైనింగ్ అంటూ, బిలియన్ డాలర్ల క్లబ్ సభ్యుల సంఖ్య పెరిగిందంటూ, లక్షన్నర కోట్లు ద్రవ్య పరపతి కల్పించుతూ ఈ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమైనది. ఐదా పారిశ్రామిక వేత్తల ఎగవేతల వల్లనే నిరర్ధక ఆస్తులు పెరిగాయనేది కూడా జగమెరిగిన సత్యమే! ఇంతకాలం ఈ ప్రభుత్వం ప్రకటిత షైనింగ్ ఆర్థిక వ్యవస్థకు మూలధనం కొరత ఎందుకు ఏర్పడింది? ఈ గొప్పల గూర్చి ఇంతకాలం ప్రభుత్వం చేసిన ప్రచారం నిజంకాదని తనకు తానే బహిర్గత పరుచుకుంటున్నది.

పై సదస్సులోనే సంక్షోభానికి ఆయన సూచించిన పరిష్కారాలిలా వున్నాయి. 1) ఐఎంఎఫ్, డబ్ల్యూ.బి, ఐబిఆర్‌డి వంటి అంతర్జాతీయ బ్యాంకులు ఇండియా వంటి దేశాలకు ఎ) సరళంగా బి) వేగంగా సి) బేషరతుగా డి) అధికంగా సాయం చేయాలట 2) ప్రపంచీకరణబేషరతుగా వుండకూడదు. నియంత్రణా వ్యవస్థ వుండాలి. 3) వివిధ దేశాల మధ్య నేటి ఆర్థిక సంక్షోభ నివారణకై పరస్పర సాయం, సమిష్టి కృషి వుండాలి. 4) అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల కల్పన మీద అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాలి.

అదే రోజు ఢిల్లీలో చిదంబరం ఈ క్రింది ప్రకటన చేశాడు. 'మన ఆర్థిక వ్యవస్థ దృఢంగా, ఆరోగ్యంగానే వుంది. ప్రపంచ స్థితిగతులు ఒక దారికి వచ్చి, ప్రశాంతత మరియు విశ్వాస పునరుద్ధరణలు నెలకొన్న వెంటనే మన ఆర్థికాభివృద్ధి రేటు పైకి దూసుకుపోతుంది".

మన ఆర్థికాభివృద్ధి రేటు తగ్గుతున్నదని స్పష్టమైన అంచనాలున్నాయి. మొదట జీడీపీ వృద్ధిరేటు 10 శాతం వరకూ అంచనాలు వేశారు. తర్వాత 9.5%, 9%, 8.5%, 8%ల చొప్పున అంచనాలు దిగజారుతూ వచ్చాయి. నేటి ద్రవ్య సమీక్షలో గత 8%ని కూడా 7.5% నుంచి 8% మధ్య వుంటుందంటూ ఆర్.బి.ఐ సవరించింది. వారం క్రితం విడుదలైన ఆగస్టు నెల పారిశ్రామిక వృద్ధిరేటు ఘోరంగా 1.3%కి పడిపోయింది. అయినా ఇంకా వృద్ధిరేటు దూసుకుపోతుందంటున్నారు. అయితే ఇక్కడొక మడత పేచీ వుంది. ప్రధాని ప్రకటనలో మరిన్ని విదేశీ పెట్టుబడులు రావాలంటూనే, పెద్ద, పేద దేశాలు బ్రహ్మముళ్ళు వేసుకొని పరస్పరం సహకరించుకోవటం, తద్వారానే ముప్పు తొలగిపోతుందట! అంటే మునిగిపోతున్న అమెరికా, యూరప్‌ల నావలో మనం ఎక్కాలంట! ఇది మన్మోహనిజం! ఇక చిదంబరం చేదునిజాన్ని చెప్పాడు. ప్రపంచ సంక్షోభం ఒక దారికి వచ్చాక మన ఆర్థిక వ్యవస్థ ఆకాశంలోకి దూసుకు పోతుందంటున్నాడు. పాతాళం వైపు పయనిస్తున్న అమెరికా, యూరప్ ఆర్థిక వ్యవస్థల రథ చక్రాలకు మన ఆర్థిక వ్యవస్థ ముడి వేయబడిందని ఒప్పుకున్నాడు. మన్మోహన్, చిదంబరం లిద్దరూ ప్రపంచంతో ముడి వుందంటున్నారు.

అమర్త్యసేన్ వంటి అపర ఆర్థిక పండితుల కళ్ళకి మరో పరిష్కారం కనిపించింది. అమెరికాకి ఒబామా అధ్యక్షునిగా ఎన్నికైతే సంక్షోభం మాయమౌతుందట! ఆడమ్‌స్మిత్, కీన్స్ అర్థశాస్త్రాలు చదివిన బూర్జువా పండితులకి ఇంత కంటే ఏం పరిష్కారం కనిపిస్తుంది? నోమ్ చోమ్‌స్కీ జోసెఫ్ స్టిగ్లట్స్ వంటి మేధావులెందరో డెమోక్రటిక్ పార్టీ గెలిచినంత మాత్రాన అమెరికా విధానాలలో ఎలాంటి మౌలిక మార్పులు రావని ఆధారాలతో చెబుతున్నారు. కానీ బుష్ దిగి, ఒబామా గెలిస్తే మొత్తం మారిపోతుందని అమర్త్యసేన్ చెబుతున్నాడు.

ఈ మహా మాంద్యాన్ని నివారించేందుకు నవంబరు 15న వాషింగ్టన్‌లో జి-20 దేశాల శిఖరాగ్ర సదస్సు జరుపుతారట! నాటి మహా మాంద్యం నాటి కీన్స్ వలె పాల్ క్రుగ్‌మాన్ వంటి ఆదర్శ ఆర్థిక పండితులను పెట్టుబడిదారీ ప్రపంచం ముందుకు తేవచ్చు. ఎన్ని అతుకులు వేసినా ఈ సంక్షోభాన్ని రూపుమాపలేదు. 1947 అధికార మార్పిడి తర్వాత సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు దయకోవ్ (భారత వ్యవహారాల రాజకీయ నిపుణుడు) ఒక పత్రికలో రాసిన వ్యాసంలో 'సామ్రాజ్యవాద రథ చక్రాలకు భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముడి వేయబడింది' అన్నారు. అది నిజమేనని స్వయంగా మన్మోహన్, చిదంబరాలు సైతం నేడు అంగీకరించడం గమనార్హం! కానీ ఈ సంక్షోభ నివారణకి పరిష్కారాలేన్నో లేవు. ఒకే ఒక్క పరిష్కారం వుంది. అది మార్క్స్ కాపిటల్‌లో లభిస్తుంది. అందుకే దాస్ కాపిటల్ విపరీతంగా అమ్మకం జరుగుతున్నది కాబోలు! మార్క్స్ అర్థశాస్త్రం మళ్ళీ అధ్యయనం చేసి, నేటి సంక్షోభ నిర్మూలనకై శాస్త్రీయ విప్లవ మార్గంలో మరింత దృఢంగా సాగుదాం!

విద్యార్థి అమరవీరుల త్యాగాన్ని పుణికి పుచ్చుకుందాం! విప్లవ విద్యార్థి సంఘ సత్తాను చాటుదాం!!

"గుమాస్తాల చదువులకు స్వస్తి పలికి తీరుదాం
శాస్త్రబద్ధ విద్యను పోరాడీ సాధిద్ధాం."

అంటూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) తన ప్రస్తానాన్ని కొనసాగిస్తూ 36 సం॥లు అవుతున్నది. 'గుమాస్తాల' చదువుకు స్వస్తిపలకాల్సిన పరిస్థితి నేడు ఆవశ్యకంగా మన ముందున్నది. ఆనాడు బ్రిటిష్ వలస పాలకుల 'సేవాగిరికి' తోడ్పడిన భారతదేశ విద్య, నేడు బహుళజాతి సంస్థలకూ, సామ్రాజ్యవాద దేశ ప్రయోజనాలను నెరవేర్చే 'బానిస గిరి' విద్యగా అవతారమెత్తింది. "ప్రపంచీకరణ" నామ జపంతో విద్యను ప్రపంచ విఫణిలో పెట్టి దేశాల ప్రయోజనాలను నెరవేర్చే విద్యావ్యవస్థ లేకుండా పోయింది. సామాజిక అసమానతలూ, ఆర్థిక వ్యత్యాసాలూ, వివక్షతలూ దేశ విదేశాలకూ, ప్రాంతాలకూ, మనుషులకూ మధ్య తీవ్రమైన నేపథ్యంలో విద్య 'సరుకు'గా మారింది. దానిని అందిపుచ్చుకోలేని సామాజిక వర్గాలకు ప్రభుత్వాలు సంక్షేమ తాయిలాలను ఇచ్చి మనుగడ కొనసాగించుకునే ప్రయత్నాలు తీవ్రతరం చేశాయి. ప్రభుత్వాల ప్రజలకు భ్రమలూ, నమ్మకాలూ పోతున్న సందర్భంలో విశ్వాసాన్ని కలిగించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రభుత్వాలూ, దేశాలూ అనుసరిస్తున్న దోపిడీ విధానాల మూలంగా ఏర్పడుతున్న సంక్షోబాలనూ, మాంధ్యాన్ని నివారించుకునే దీన స్థితిలో 'పెట్టుబడి' వున్నది. కాబట్టి, సరిగ్గా ఇక్కడే మనం మన మెదళ్ళను పదునెక్కించుకొని, అమరవీరుల త్యాగాన్ని పుణికి పుచ్చుకొని దోపిడీ పునాది వ్యవస్థకు ఊడిగం చేస్తున్న విద్యావ్యవస్థను పెకిలిద్దాం! వర్గ రహిత, దోపిడీ రహిత సామాజిక పునాది మీద ఆధారపడే శాస్త్రీయ విద్యా సాధనకై కృషి చేద్దాం. విప్లవ విద్యార్థి సంఘం తన అడుగుల్ని ఎప్పుడూ పురోభివృద్ధి వైపుకే వేస్తుందని చాటుదాం. నిజమైన విద్యార్థి సంఘంగా, శాస్త్రీయమైన ఆలోచనలతో గతాన్ని సమీక్షించుకొనీ, వర్తమానాన్ని అవగతం చేసుకొనీ, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే కర్తవ్యంలో నిమగ్నమవుదాం.

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) 18వ రాష్ట్ర మహాసభ నవంబర్ 15 నుండి ఒక చారిత్రక సందర్భంలో జరుగుతున్నది. ఓ వైపు అమెరికా సామ్రాజ్యవాద దేశ 'ఆర్థిక సంక్షోభం' ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభావితం చేస్తూ ప్రజా సామాన్యంపై దాడి చేస్తున్నది. భారతదేశంతోపాటూ వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. పరిశ్రమలూ, ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలూ మూత పడుతున్నాయి. లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నారు. ప్రయివేట్ పరిశ్రమలను నిలబెట్టడానికి ప్రభుత్వాలు, ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వచ్చిన బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయి. మరోవైపు అమెరికాలో సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీల మూసివేత మూలంగా భారతదేశంలో, రాష్ట్రంలో ఎంసిఎ, ఎంబిఎ, ఇంజనీరింగ్‌లో సిఎస్‌సి, ఐటీ కోర్సుల సీట్లు భర్తీ కావటం లేదు. కంప్యూటర్ ఆధారిత కోర్సులు గల్లంతవుతున్నాయి. దేశ ప్రయోజనానుగుణవిద్య కాకుండా విదేశీ బహుళ జాతి సంస్థల మార్కెట్, దోపిడీ ప్రయోజన విద్య అమలవుతుండటం మూలంగా ఏర్పడిన స్థితి ఇది. "పెట్టుబడిదారీ సమాజమే కార్మికవర్గానికి ప్రత్యామ్నాయం" అన్న దోపిడీ వ్యవస్థ పతన దశలో వుంది. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థే కార్మికవర్గ దోపిడీకి విముక్తి మార్గం అని చాటి చెప్పాలి.

రాష్ట్రంలో వై.యస్. ప్రభుత్వం, కేంద్రంలో "ప్రగతిశీల ఐక్య కూటమి" ప్రభుత్వం తమ ప్రయాణాన్ని కార్పొరేట్ శక్తుల పటిష్టత కోసం కృషి చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రయివేట్ భాగస్వామ్యాన్ని కల్పించి "ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థల" ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నది. ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా, ఆంగ్లమాధ్యమం, సెంట్రల్ సిలబస్ పాఠశాలలకు తెరలేపింది. ఎస్ఎస్‌సిలో 450 మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంవత్సరానికి 35 వేల రూపాయల ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తూ 8 వేల మందిని కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ, శ్రీచైతన్యలలో చేర్పించింది. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ కళాశాలల మూసివేతకు పన్నిన పన్నాగం ఇది. ప్రజల సొమ్మును ప్రయివేట్, కార్పొరేట్ శక్తులకు కేటాయించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్యను పెంచకుండా, యేటా ప్రయివేట్ ఇంజనీరింగ్, ఎం.సి.ఏ, ఫార్మసీ కళాశాలలకు విస్తృతంగా పర్మిషన్లు ఇచ్చి వాటిల్లో చేరుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసీ, ఓసీలోని పేదలకు ఉచిత విద్య పేరుతో కోట్లాది రూపాయలను వారికి ధారాదత్తం చేస్తున్నది. పైకి ఇది చాలా అభివృద్ధికరంగా కనిపిస్తుంది. కానీ, "తడిగుడ్డతో ప్రభుత్వ విద్యను కోసే" చేష్టలివి. వేలాది మంది చదువుకోవడానికి అవకాశానిస్తున్న ప్రభుత్వ విద్యా వ్యవస్థ స్థానంలో కొద్ది మందికి విద్యనందించే ప్రయివేట్, కార్పొరేట్ విద్యా వ్యవస్థను పటిష్టపరిచే ప్రయత్నమిది. ప్రభుత్వ విద్యలో నాణ్యమైన చదువుకోసం, దాన్ని పటిష్టపర్చేందుకు ఉద్యమాన్ని చేపట్టాలి.

పాఠశాల విద్యలో అమలవుతున్న సంస్కరణలు పేద, దళిత, బలహీన వర్గాలకు నష్టకరమైనవి. ఓవైపు ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి ఆంగ్ల మాధ్యమం, సెంట్రల్ సిలబస్‌ను ప్రవేశపెడుతూ, మరోవైపు హైస్కూల్‌కు 2 కిలో మీటర్ల దూరంలో వున్న 3,500 ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం చేసింది. ఫలితంగా 3,500 పాఠశాలలు మూతబడ్డాయి. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని 10వ తరగతి వరకు పొడిగించి ప్రైమరీ విద్యార్థులకు కేటాయించిన ఆహారంలో కోత విధించింది. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడానికి కావల్సిన వంట సామాగ్రినీ, వంటశాలలనూ ఏర్పాటు చేయలేదు. ప్రైమరీ పాఠశాలల సంఖ్య రాష్ట్రంలో ఎక్కువ. హైస్కూల్స్ సబ్జెక్ట్ టీచర్ల కొరత ఎక్కువగా వుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా వున్నది. ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిన పాఠశాల విద్యా సంస్కరణలు ప్రభుత్వ స్కూళ్ళను మూసివేయడానికి చేపట్టిన చర్యలివి.

ఎస్.ఎల్. పద్మ
పీడీయస్‌యూ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు దీనావస్థలో వున్నాయి. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం, ఇంటర్ బోర్డు పూర్తిగా కార్పొరేట్ శక్తుల పాద సేవలో పునీత మవుతున్నాయి. కోట్లాది రూపాయల ప్రభుత్వ బడ్జెట్‌ను కార్పొరేట్ సంస్థలకు కేటాయిస్తున్నది. ఫలితంగా రాష్ట్రంరో రెండే కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ విద్యను శాసిస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలలు విచ్చలవిడిగా అనేక చిన్న కళాశాలలను తిమింగళంలా మింగేస్తూ, కొనుక్కుంటూ, వసతులు లేకుండా, 'గొడ్ల చావిడి'లా సంస్థలను నడుపుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో చెంగిచర్లలో రెయిలింగ్ కూలి విద్యార్థి చనిపోయి, అనేక మంది విద్యార్థులు గాయాల పాలయిన సంఘటన తెలిసిందే. విద్యార్థి సంఘాలుగా, మన సంస్థ చేపట్టిన ఉద్యమం మూలంగా ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలపై దాడి చేసింది. ప్రభుత్వం కళ్ళుగప్పి, పర్మిషన్‌లు లేకుండా నడుపుతున్న కళాశాలలు కోకొల్లలనేవి బయటపడింది. ఇంత నగ్నంగా విషయాలు బయటపడ్డప్పటికీ ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలను రద్దు చేయక పోవటంపై ఆలోచించాలి. కార్పొరేట్ కళాశాలల, పాఠశాలల రద్దుకై ఉద్యమించాలి.

డిగ్రీ, యూనివర్సిటీ విద్య నిధుల లేమితో సతమతమవుతున్నది. ముఖ్యంగా చారిత్రకంగా పాత యూనివర్సిటీలకు ప్రభుత్వాలు యేటా గ్రాంట్స్‌లో కోత విధిస్తున్నది. స్వయం పోషకంగా విశ్వ విద్యాలయాలుండాలని ప్రభుత్వాలు ఉద్భోదిస్తున్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో అధ్యాపకుల నియామకాలూ, ఫీజులను విపరీతంగా పెంచి విద్యార్థుల మీద భారాన్ని మోపుతూ యూనివర్శిటీలు మనుగడ సాగిస్తున్నాయి. మరోవైపు జిల్లాకో కొత్త విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. కానీ, అరకొర బడ్జెట్‌ను కేటాయించి యూనివర్శిటీలను నడిపిస్తున్నది. యూనివర్శిటీలను ఏర్పర్చడానికి కేంద్ర నాలెడ్జి కమీషన్ సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్న ప్రభుత్వానికి ఏ కోర్సులు వుండాలన్న చర్చ జరపటం లేదు. ఎవరి సూచనలనూ తీసుకోవటం లేదు. ఒక్కో కొత్త యూనివర్శిటీని డిగ్రీ కళాశాలలుగా మార్చేసింది ప్రభుత్వం. పరిశోధనలనూ, ఆ ప్రాంత సమస్యలను పరిష్కార చోధక నిలయాలుగా వుండాల్సిన విశ్వవిద్యాలయాల రూపురేఖలను సర్కారు పూర్తిగా మార్చి వేసింది. పాత విశ్వవిద్యాలయాలను నీరుగార్చి కొత్త విశ్వవిద్యాలయాలకు తెరలేపడంలోని ఆంతర్యాన్నీ, వైరుధ్యాన్ని గమనించాలి. మరోవైపు దేశంలో ఉన్నత విద్యావంతుల సంఖ్యను పెంచే పేరుతో అనేక ప్రయివేట్ కళాశాలలకు 'డీమ్డ్ వర్శిటీ' హోదాను కల్పించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం వున్నది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను స్థాపించి, వాటి నిర్వహణభారంగా మారిందనే సాకుతో 'ప్రయివేట్, ప్రభుత్వ భాగస్వామ్య' సంస్థలుగా మార్చే ఆలోచన ఇందులో దాగివుంది. ప్రభుత్వానికి విద్యారంగంపైన ఒకే సాధారణవిధానం లేదన్నది ఇక్కడ స్పష్టమవుతున్నది. అందుకే దేశంలో ఎలాంటి విద్య కొనసాగాలనే చర్చ జరగాల్సి వుంది. 'రష్యాలో వర్షం పడితే కమ్యూనిస్టులు ఇండియాలో గొడుగు పడతారనే' నానుడి వుండేది ఒకప్పుడు. కానీ, యిప్పుడు అమెరికాలో, ఇతర సామ్రాజ్యవాద దేశాల్లో కంపెనీలు మూతబడితే, ఇక్కడ వివిధ రకాల కోర్సులు ఖాళీ అవుతున్నాయి. ఆనాడు గానీ, ఏనాడుగానీ ప్రజల కష్టజీవుల, శ్రమజీవుల విముక్తికి తోడ్పడే సిద్ధాంతాన్ని ప్రజలు స్వీకరిస్తారు. దానివల్ల నష్టపోవడం ఎవరికీ జరగదు. కానీ, పెట్టుబడిదారీ విధానం వల్ల ఒక దేశ సంక్షోభం మరో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తుంది. ప్రపంచ కార్మికుల రక్తమాంసాలతో పెట్టుబడి పొగ్రై, యుద్ధ పిపాసిగా మారి ప్రపంచ ప్రజల శత్రువుగా మారింది. కాబట్టి ప్రయివేటీకరణకు, కార్పొరేటీకరణకు, మొత్తంగా దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి.

విద్యాలయాల్లో సామ్రాజ్యవాద విష సంస్కృతి బీజాలు వేళ్ళూనుకుంటున్నాయి. దానికి నిదర్శనం ఇటీవల విద్యాసంస్థల్లో ప్రేమ పేరుతో వేధింపులూ, దాడులూ, హింసా పెరిగే ఎందరో అమ్మాయిలు బలయ్యారు. ఏ విద్య సామాజిక అసమానతల తొలగింపుకి గైడెన్స్‌గా వుండాలో, ఏ విద్య ద్వారా మనిషి ఉన్నతీకరించబడాలో ఆ విద్యా సంస్థల్లో 'అమ్మాయిల భద్రత' ప్రశ్నార్థకంగా మారడం విచిత్రమైనది. దీనికి కారణం 'ప్రయివేట్ విద్యాసంస్థలు మూలం'. ప్రయివేట్ ఆస్తికి జవాబుదారీ తనం, సామాజిక స్పృహ, బాధ్యత వుండవు. వాటి ఆసక్తి అంతా 'ఎంత లాభం' గడించాలన్న దానిపై కేంద్రీకరించబడిందే తప్ప ఇతర అంశాలు దానికి పట్టవు. కావున విద్యా వ్యాపారీకరణ, ప్రయివేటీకరణఎప్పుడైతే పెరిగిందో, అప్పటి నుండే ర్యాగింగ్, ప్రేమ వేధింపులూ, అత్యాచారాలూ, అవమానాలూ పెరిగాయి. భౌతికవాద దృక్పధంతో, సమిష్టి ప్రయోజన విలువలను పోషించే సాంస్కృతికోద్యమాన్ని విద్యా సంస్థల్లో చేపట్టాలి.

దేశాలు స్వాతంత్ర్యాన్నీ, జాతులు విముక్తినీ కోరుకున్నట్టుగానే పీడిత ప్రజలు తమ విముక్తిని కోరుకుంటున్నారు. అదే విధంగా విద్యలో కొనసాగుతున్న దోపిడీ పీడనల ప్రయోజన పారాలను తిరగరాయించాల్సిన కర్తవ్యం విప్లవ విద్యార్థి సంఘంపైన వున్నది. పీడితుల విముక్తి విద్య కోసం పోరాడాల్సిన బాధ్యత మన భుజస్కందాలపై వున్నది. దోపిడీ, పీడన లేని నూతన సమాజం కోసం ఉద్యమించే కర్తవ్యంలోనే శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆవిష్కరించే విద్యావ్యవస్థనూ రూపొందించుకోగలం.

భారతదేశంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ స్వభావానికి తోడ్పడే భానిస విద్యా వ్యవస్థ నేడు కొనసాగుతున్నది. సామ్రాజ్యవాద విద్య పడగనీడలో 'దేశీయ విద్య' విరాజిల్లుతున్నది. ఈ స్థితిలో శాస్త్రీయ విద్యా సాధనకై ఉద్యమించే వేగు చుక్కలుగా ప్రతి విద్యార్థి ముందుకు రావాలి. ఒక్కో వెలుగురవ్వ అనేక కాంతులను విరజిమ్మినట్టుగా ఒక్కో ప్రగతిశీల విద్యార్థి ప్రజలకు తారాజువ్వలు కావాలి.

తెల్లవాడు నాడు నిన్ను భగత్‌సింగ్ అన్నాడు
నల్లవాడు నేడు నిన్ను నక్సలైట్ అన్నాడు
ఎల్ల వారు రేపు నిన్ను వేగుచుక్క అంటారు...

అందుకే 18వ రాష్ట్ర మహాసభలను జరుపుకోబోతున్న PDSU చారిత్రక పాత్రను పోషించే భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోబోతున్నది. విప్లవ విద్యార్థి సంఘ వారసత్వాన్ని దృఢంగా, సమైక్యంగా ముందుకు తీసుకెళ్ళే విశాల విద్యార్థి ఉద్యమంగా రాష్ట్రంలో అవతరించాలని అభిలషిస్తున్నది. కామ్రేడ్స్ జార్జి, జంపాల, శ్రీహరిల్లాంటి విద్యార్థి అమరవీరుల త్యాగాన్ని పుణికి పుచ్చుకొని రాజీలేని పోరాటానికి మరోసారి పదను పెట్టుకొంటున్నది..

ప్రభుత్వ దమన నీతి ఫలితమే ఉపాధ్యాయుల సమ్మె

22.10.2008వ తేదీ నుండి రాష్ట్రంలోని ప్రభుత్వం ద్వారా జీతాలు చెల్లింపబడే పంచాయతీరాజ్, మున్సిపల్, ఎయిడెడ్, ఐ.టి.డి.ఎ, ట్రైబల్ మరియు సోషల్ వెల్ఫేర్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 3 లక్షల మంది ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధనకు జాక్టో నాయకత్వాన నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మె ఊహించిన దానికంటే విజయవంతంగా, ఉధృతంగా సాగుతోంది. ఉపాధ్యాయులు హృదయపూర్వకంగా ఎలాంటి ఒత్తిడులు లేకుండా సమ్మెలో పాల్గొంటున్నారు. సమ్మె ప్రారంభం తరువాత ప్రతీ రోజు సాగిస్తున్న ఉద్యమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మండల కేంద్రాలలో చేపట్టిన ర్యాలీలలో, జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ముట్టడిలో రాష్ట్ర వ్యాపితంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పలుచోట్ల ఉపాధ్యాయులపై, మహిళలనే విచక్షణకూడా మరచిపోయి లాఠిచార్జీ చేశారు. ఎలాంటి పోరాటనికైనా, త్యాగాలకైనా ఉపాధ్యాయ లోకం సిద్ధంగా వుంది. అమీ,తుమీ తేల్చుకోవడానికి ఉపాధ్యాయులు సిద్ధంగా వున్నారు. జాక్టో నాయకత్వం కూడా సమ్మెను విజయవంతంగా నడుపడంతోపాటు పోరాటాన్ని ఉధృతం చేయడానికి పట్టుదలతో వున్నది.

జాక్టో నాయకత్వంలోని 22 ఉపాధ్యాయ సంఘాలు తమ న్యాయసమ్మతమైన సమస్యలను 15.10.2008 లోగా పరిష్కరించకుంటే, 22.10.2008 నుండి రాష్ట్రంలోని 3 లక్షల మంది ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె చేస్తామని 20.9.2008 నాడు అంటే నెల రోజులు ముందుగా ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఈ నెల రోజుల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి వుండేది. కాని సమ్మె నోటీసు పట్ల ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. చివరకు హడావిడిగా, సమ్మె 22.10.2008 నుండి ప్రారంభం కానుండగా, 20.10.2008 నాడు జాక్టో నాయకులను చర్చలకు ఆహ్వానించిరిది. విద్యాశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఏ సమస్యపైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండానే చర్చలను సందిగ్ధంలో అర్ధంతరంగా వుంచి, మరుసటి రోజుకు అంటే 21.10.2008కి ప్రభుత్వం వాయిదా వేసింది. 21.10.2008 నాడు జాక్టో నాయకులు తిరిగి చర్చలకు మ॥ 3 గంటలకు వెళ్లారు. 7 గం॥ల వరకూ చర్చలు జరుపకుండా ఉపాధ్యాయ సంఘాల నాయకులను నిరీక్షణలో వుంచి, చర్చలు పునఃప్రారంభించకుండానే జాక్టో నాయకులను వాపసు పంపారు. ప్రభుత్వపు ఈ చర్య నీతి రహితమైనదే కాకుండా 3 లక్షల ఉపాధ్యాయులకు, వారికి నాయకత్వం వహిస్తున్న 22 సంఘాల నాయకులను అవమాన పరచడమే. తిరిగి 24.10.08 నాడు జాక్టో నాయకులను చర్చలకు ఆహ్వానించారు. చర్చలు అసంపూర్తిగా ముగించిన ప్రభుత్వం తిరిగి చర్చలను 26.10.08కి వాయిదా వేసింది. 26.10.08 నాడు జరగవలసిన చర్చలను విద్యాశాఖా మంత్రి నిర్లక్ష్యంగా, నిరవధికంగా వాయిదావేసి, వాయిదా వేసిన విషయాన్ని ఓ అధికారి ద్వారా ఆలస్యంగా తెలిపారు. జాక్టో నాయకులను రెండోసారి అవమాన పరిచారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటి (జెఎసి) నాయకుడు గోపాలరెడ్డి చొరవతో 27.10.08 నాడు ఆర్థిక మంత్రి రోశయ్యగారు జాక్టో నాయకులను చర్చలకు ఆహ్వానించారు. ఉపాధ్యాయుల డిమాండ్లు ఆర్థికపరమైనవి కాబట్టి, ముఖ్యమంత్రి అనుమతి లేకుండా ఆర్థిక డిమాండ్లను పరిష్కరించడం తన పరిధిలో లేదని ఆర్థిక మంత్రి తేల్చడంతో చర్చలు మళ్లీ విఫలమయ్యాయి. సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత నెల రోజుల వరకు చర్చలకు పిలువక పోవడము, నెల తరువాత చర్చలకు పిలిచి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడము, వాయిదా వేసిన చర్చలను పునరుద్ధరించకుండా సంఘాల నాయకులను చర్చలకు రప్పించి తిరగగొట్టడం, ఆర్థిక మంత్రి కూడా చర్చలకు పిలిచి నిర్లక్ష్యంగా వ్యవహరించడము జాక్టో నాయకులను, 3 లక్షల ఉపాధ్యాయులను అవమానించడమేననేది నిర్వివాదాంశము. ఈ ఉపాధ్యాయుల సమ్మె పరిస్థితి వారి ఆత్మగౌరవ సమస్యగా మారింది. కావున సమ్మె మరింత తీవ్రతరం అవుతుందనడంలో సందేహం లేదు.

సమ్మె ప్రారంభమై జాక్టో నాయకులతో ప్రభుత్వం చర్చల ప్రహసనం కొనసాగిస్తున్న సమయంలోనే, రాజు అనే ఓ అడ్వకేటు ఉపాధ్యాయుల సమ్మెను నిషేధించాలని అభ్యర్థిస్తూ రాష్ట్ర హైకోర్టులో ప్రజాహిత వాజ్యమును (Public Interest Litigation) వేశారు. ఈ కేసు 24.10.08 నాడు కోర్టులో ప్రవేశానికి వచ్చింది. వాజ్యం వేసిన వాది యొక్క అభ్యర్ధనను విన్న గౌరవ హైకోర్టు బెంచి, 24.10.08 నుండి 28.10.08 వరకు కోర్టుకు దీపావళి సెలవులు వున్నందున, కేసును 29.10.08 నాటికి వాయిదా వేశారు. గతంలో తమిళనాడు ప్రభుత్వోద్యోగులు సమ్మె చేసినప్పుడు చెన్నై హైకోర్టు, సుప్రీం కోర్టు సమ్మె చట్ట విరుద్ధం అని ప్రకటించింది. ఈ అనుభవాన్ని ప్రభుత్వం బహుశా దృష్టిలో వుంచుకుని వుంటుంది. అందుకే ఉపాధ్యాయులతో చర్చలు జరుపకుండా నిర్లక్ష్యం వహిస్తుంది. అంటే ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా, హైకోర్టులో గల కేసును అడ్డుపెట్టుకునే హేయమైన స్థితికి ప్రభుత్వం దిగజారింది.

ఈనాడు ప్రభుత్వం ముందు పరిష్కారం కోసం జాక్టో పెట్టిన ఉపాధ్యాయుల సమస్యలు ఏవీ కొత్తవి కావు. గత నాలుగేళ్లుగా పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమించినప్పుడు వారితో సమస్యల పరిష్కారానికి ఒప్పందాలిచ్చినవే. ఒప్పందం చేసుకున్న సమస్యలపై ఉత్తర్వులివ్వకుండా ప్రభుత్వం గత నాలుగేళ్లుగా హామీలతో, సాచివేత ధోరణి అనుసరిస్తూ సమస్యలన్నింటినీ అపరిష్కృతంగానే వుంచింది. ఇది ఉపాధ్యాయులను మోసగించడమే. అమలు కాని ఒప్పందాలతో, ప్రభుత్వ సాచివేత వైఖరితో విసిగి వేసారిన ఉపాధ్యాయులు సమ్మె చేయక తప్పని పరిస్థితిని ప్రభుత్వమే కల్పించింది. ప్రస్తుత పరిస్థితికి బాధ్యత వహించాల్సింది కూడా ప్రభుత్వమే.

సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపని ప్రభుత్వం, మొన్ననే 22% ఇంటిరిం రిలీఫ్ ఇచ్చాం కాబట్టి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేది లేదనే మరో హేయమైన వాదనతో సమాజాన్ని తప్పుత్రోవ పట్టించే ప్రయత్నం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల పేరివిజన్ కోసం ఇటీవల ప్రభుత్వం పే కమీషన్‌ను నియమించింది. కమీషన్ రిపోర్టు వచ్చే లోపల ఇంటిరిం రిలీఫ్ (మధ్యంతర భృతి) ఇవ్వడం సహజంగా జరిగే విషయం. గతంలో అన్ని ప్రభుత్వాలు ఈ మధ్యంతర భృతిని ఇచ్చినవే. ఈ ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ మధ్యంతర భృతి ఇచ్చింది. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, ఉపాధ్యాయులకు కూడా ఈ మధ్యంతర భృతి ప్రభుత్వం ఇచ్చింది. అంతేగాని ఉపాధ్యాయులకే ప్రత్యేకంగా 22% మధ్యంతర భృతి ఇవ్వలేదు. ఉపాధ్యాయులు ప్రస్తుతం ప్రభుత్వం ముందుంచిన సమస్యల్లో జీతాల పెంపు డిమాండ్ ఒక్కటి కూడా లేదు. అందరు ప్రభుత్వోద్యోగులతోపాటు ఉపాధ్యాయులకిచ్చిన మధ్యంతర భృతికి, గత నాలుగు సంవత్సరాలుగా ఒప్పందం చేసుకుని పరిష్కరించని ఉపాధ్యాయుల సర్వీసు సమస్యలకు ముడిపెట్టడం, మోకాటికి, బోడి తలకు పోల్చడమే.

డాక్టర్ కె నారాయణ

ప్రభుత్వం చేసే మరో నీతి రహిత అసత్య ప్రచారం ఏంటంటే ఉపాధ్యాయుల డిమాండ్లను తీరిస్తే 200 కోట్ల రూ॥ల అదనపు భారం ప్రభుత్వంపై పడుతుందని. ఈ వాదనలో నిజం లేదు కదా, గతంలో ఈ సమస్యల పరిష్కారానికి ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు లేని 200 కోట్ల రూ॥ల అదనపు భారం ఇప్పుడేలా వచ్చిందో ప్రభుత్వానికే తెలియాలి. అంతేకాదు ఉపాధ్యాయులను మోసం చేయడం ద్వారా ప్రభుత్వం ఈ పాటికీ 2500 కోట్ల రూపాయలు మిగుల్చుకుంది.

ఉపాధ్యాయులు పరిష్కారం కోరుతున్న సమస్యల్లో ప్రధానమైంది ఏకీకృత సర్వీసు రూల్సును రూపొందించడం. గతంలో రూపొందించిన సర్వీసు నియమాల్లో లోపాలున్నందున కోర్టులు ఈ ఏకీకృత సర్వీసు నియమాలను కొట్టి వేసాయి. రాష్ట్రపతి ఉత్తర్వులకు ఓ చిన్న సవరణచేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించి ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్సును ఏర్పాటు చేయవచ్చు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే రాజకీయ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలున్నాయి కావున, ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఏకీకృత సర్వీసు నియమాలు తేవడం నెల రోజుల పని. కాని అసంబద్ధమైన అభ్యంతరాలతో ఫైలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొన్ని సంవత్సరాలుగా చక్కర్లు కొడుతోంది. గత 2 సంవత్సరాలుగా రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణను నెల రోజుల్లో తెప్పిస్తాం, నెలా పదిహేను రోజుల్లో తెప్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు హామీ ఇస్తూనే వుంది. ఈ సర్వీసు నియమాలను రూపొందించినందువలన ప్రభుత్వ ఖజానాపై ఒక్క రూపాయి అదనపు భారం పడదు. గత 50 సం॥లుగా మున్సిపల్ టీచర్లకు అసలు సర్వీసు రూల్సులేవు. 30 సం॥రాల క్రితం స్థాపించిన ఐ.టి.డి.ఎ. పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా సర్వీసు నియమాలు లేవు. ఎయిడెడ్ టీచర్ల స్థితి అగమ్యగోచరం. పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల సర్వీసును 27/, సం॥ల క్రితం ప్రోవిన్షలైజ్ చేసిననూ ఇంత వరకు ప్రమోషన్ అవకాశాలు కల్పించలేదు. దీని కంతటికీ ఏకీకృత సర్వీసు రూల్సు రూపొందించడమే పరిష్కారం. శాసన, కార్యనిర్వహణమరియు న్యాయాధికారాలు గల రాజ్యాధికారానికి చిత్తశుద్ధి వుంటే ప్రభుత్వంపై అదనపు భారం పడని 3 సం॥ల ఉపాధ్యాయుల సర్వీసు రూల్సును రూపొందించడం సమస్యే కాదు. కావలసిందల్లా సర్వీసు నియమాలు ఏర్పరచాలనే సంకల్పం.

సర్వీసు నియమాలు లేనందున గత మూడు సంవత్సరాల్లో 25 నుండి 30 సం॥ల సర్వీసు చేసి ఏ ప్రమోషను లేకుండా వేలాది మంది ఉపాధ్యాయులు ప్రతీ సంవత్సరం పదవీ విరమణచేస్తున్నారు. సర్వీసు నియమాలు లేకుంటే ప్రమోషన్లు వుండవు. ఫలితంగా రాష్ట్రంలో గల 1100 మండల విద్యాధికారుల పోస్టుల్లో 600 పోస్టులు, 6000 ఉన్నత పాఠశాలల పోస్టులు, 18 డి.ఇ.వోల పోస్టులు, 100 ఉప విద్యార్థికార్ల పోస్టులు, వేలాది గణితం, సైన్సు, ఆంగ్ల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. ఫలితంగా రాష్ట్రంలో ప్రభుత్వరంగంలోని విద్యా వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారయింది. ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని ఉన్నత పాఠశాలలు గత మూడు సంవత్సరాలుగా వున్నాయి. ఎంత దారుణం?

ఉపాధ్యాయుల మరో ముఖ్యమైన సమస్య అప్రెంటిస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎవరికీ లేని అప్రెంటిస్ విధానాన్ని 1994 నుండి ఉపాధ్యాయుల నియామకాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయుల నియామకము చేసేది రెగ్యులర్ పే స్కేలులోనే. కాని మొదటి రెండు సంవత్సరాలు తక్కువ వేతనంతో నియమిస్తారు. డి.ఎస్.సి.లో ఎంపిక విధానమూ, విద్యార్హతలూ అన్నీ రెగ్యులర్ టీచర్‌తో సమానమే. పని కూడా ఈ అప్రెంటిస్ టీచర్లు రెగ్యులర్ టీచర్లతో సమానంగా చేస్తారు. 1994లో అప్రెంటిస్ టీచర్లకు రూ. 1200, రూ. 1800 (ప్రస్తుతం రూ. 3600, రూ. 4400) చెల్లిస్తారు. ఇందులో వున్న మోసమేంటంటే రెగ్యులర్ స్కేలు వేతనం స్కూల్ అసిస్టెంటుకు ఇవ్వాల్సి వుండగా నెలకు 3,600 రూ॥లే చెల్లిస్తారు. స్కూల్ అసిస్టెంట్ రెగ్యులర్ స్కేలు వేతనం ప్రస్తుతం ఇంటిరిం రిలీఫ్‌తో కలిపి నెలకు రూ. 11,600. అంటే ఒక్క స్కూల్ అసిస్టెంట్‌కు నెలకు రూ. 7200 చెల్లించ వలసిన దానికంటే తక్కువ చెల్లిస్తున్నారు. అలాగే సెకండరీ గ్రేడు టీచర్‌కు నెలకు రూ. 5200 తక్కువ చెల్లిస్తున్నారు. ఈ రకంగా ఇవ్వవలసిన వేతనము కంటే తక్కువ చెల్లించడము ద్వారా ప్రభుత్వం 1994 నుండి నియమించిన లక్షా డెబ్బై వేల ఉపాధ్యాయులకు ఎగవేసిన సొమ్ము 2,500 కోట్లు రూ.లు. వీరికి ఆర్థిక లాభం లేని నోషల్ ఇంక్రిమెంట్లు ఇస్తూ, ఈ సర్వీసను పెన్షన్‌కు పరిగణించాలనే డిమాండ్‌ను గతంలో అంగీకరించిన ప్రభుత్వం, ఈ సమస్యను పరిష్కరిస్తే 95 కోట్ల రూ॥ అదనపు భారం పడుతుందనే అసత్యవాదనను ముందుకు తెచ్చింది.

ఇరవై ఐదేళ్ల క్రితం ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ మేరకు ఆనాటి 'ఫ్యాప్టో'తో జరిగిన ఒప్పందం మేరకు 2003 ఆగస్టు 10 నాడు జీవో 330 ద్వారా రెండవ గ్రేడ్ భాషా పండితులకు మొదటి గ్రేడు స్కేలును మంజూరు చేసింది. ఆనాటి ఒప్పందాన్ని తిరగదోడి అప్‌గ్రేడేషన్‌ను రద్దు చేస్తూ 1/2005 చట్టాన్ని తెచ్చింది. దీనివల్ల 15 వేల మంది భాషా పండితులకు రెండు, మూడు వేల రూపాయల మేరకు వేతనం కత్తిరించబడింది. నాటి తెలుగుదేశం ప్రభుత్వం అన్‌ఎయిడెడ్ సర్వీసును పరిగణించే ఉత్తర్వులను చట్టం ద్వారా రద్దు చేసింది. బాధిత టీచర్లు హైకోర్టును ఆశ్రయించి చట్టాన్ని రద్దు చేయించుకున్నారు. నాటి ప్రతిపక్ష నేత వైఎస్ ఎయిడెడ్ టీచర్ల పొట్టకొట్టవద్దని శాసనసభలో విమర్శించారు. అనంతరం ప్రభుత్వం చట్టాన్ని ఉపసంహరించింది. తిరిగి ప్రస్తుత ప్రభుత్వం 'పొట్టకొట్టవద్దన్న' నల్ల చట్టాన్ని 37/2005 చట్ట రూపంలో మరోసారి అన్‌ఎయిడెడ్ సర్వీసును రద్దు చేసింది.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, పిహెచ్‌సి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి శిక్షణలేని అభ్యర్ధులను 2002 డిఎస్‌సిలో ఎంపిక చేసి, స్పెషల్ విద్యావాలంటీర్లుగా నియమించింది. జీవో 248 ద్వారా స్పెషల్ విద్యావాలంటీర్లుగా పనిచేసిన కాలాన్ని అప్రెంటిస్ కాలంగా పరిగణించిన ప్రభుత్వం, శిక్షణపొందిన తేదీ నుంచి రెగ్యులర్ స్కేలు వర్తింపచేయకుండా ఆరు నెలల అనంతరం రెగ్యులర్ పోస్టులలో నియమించింది. స్పెషల్ విద్యావాలంటీర్లుగా పనిచేసిన కాలాన్ని రెగ్యులర్ అప్రెంటిస్ కాలంగా గుర్తిస్తూ, శిక్షణపొందిన తేదీ నుంచి రెగ్యులర్ స్కేలు మంజూరు చేయాలన్న డిమాండును పెడచెవినపెడుతోంది. ఇక 1990 తర్వాత నియామకమైన స్పెషల్ టీచర్లకు ఇతర స్పెషల్ టీచర్ల వలె స్పెషల్ టీచర్‌గా పనిచేసిన కాలాన్ని పెన్షన్‌కు, ఆటోమేటిక్ అడ్వాన్సుమెంటు స్కీమ్‌కు పరిగణించే విధంగా ఉత్తర్వులను సవరించాల్సి వుంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 200 పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న 10 వేల మంది టీచర్ల సర్వీసులను ప్రావిన్షియలైజ్ చేసి, ప్రభుత్వ ఉపాధ్యాయుల సౌకర్యాలను వర్తింప చేయాల్సిన డిమాండును పట్టించుకోవడం లేదు. మున్సిపల్ పాఠశాలల్లోని 5 వేల ఖాళీ పోస్టులను రాబోయే డిఎస్‌సి ద్వారా భర్తీ చేస్తానని శాసనసభలో హామీనిచ్చిన ప్రభుత్వం ప్రకటించబోయే డిఎస్‌సి ఆ ఉసెత్తడం లేదు.

అనేక సమస్యలతో విసిగివేసారిన టీచర్లు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకోవాలనే ఉద్దేశ్యంతో అక్టోబర్ 22 నుండిపాఠశాలలు బంద్ చేసి, 'నిరవధిక సమ్మె'లోనికి వెళ్లనున్నామని 'జాక్టో' ఆధ్వర్యంలో ప్రభుత్వానికి సెప్టెంబరు 20 నాడు నోటీసు ఇచ్చారు. నెలరోజులపాటు పట్టించుకోకుండా ఈ నెల 20న మళ్లీ చర్చల పేరుతో విద్యామంత్రి సమస్యలను దాటవేసే ప్రయత్నం చేశారు. 22 ఏళ్ల తర్వాత రాష్ట్రంలోని 3 లక్షల మంది ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి. బీద, మధ్య తరగతి వర్గాల పిల్లలు చదువుచున్న ప్రభుత్వరంగ పాఠశాలల్లో అవసరమున్నంత మంది ఉపాధ్యాయులను నియమించి, ఖాళీ పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చి ప్రభుత్వరంగ పాఠశాలలను పటిష్టం చేయాలి. అలా చేయనిచో ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు.

ప్రజారచయిత చైనా విప్లవ సాంస్కృతిక సేనాని లూసన్ సాహిత్య జీవితం

"ఒక పువ్వు వికసించడానికి నేను తోడ్పడినంత కాలం, నేను ఎరువుగా ఉపయోగపడడానికి కూడా సంతోషంగా సిద్ధమవుతాను. జీవన పథంలో నా రక్తం ఒక్కొక్క చుక్కా ఇతరులను కాపాడటానికి ప్రవహించనీ, ఇది నన్ను బలహీన పరచినా, అలా చేయడం నాకెంతో సంతోషం".
- లూసన్.

లూసన్ 1881 సెప్టెంబర్ 25న చైనాలో 'షావోసింగ్' అనే పట్టణంలో జన్మించాడు. 'లూసన్' అన్నది కలంపేరు. తల్లి పేరు'లూ'. తల్లి పేరులోంచే లూసన్ కలం పేరును సృష్టించుకున్నాడు. లూసన్ బాల్యంలో వాళ్లింట్లో నర్సుగా వుండిన మామాచాంగ్, అతడి నాయనమ్మ లూసన్‌కు కథలపై ఆసక్తి కల్పించినవాళ్లు. నాయనమ్మ జానపద గాథలు చెప్పడంలో దిట్ట. పిల్లల బొమ్మల కథల పుస్తకాలను పరిచయం చేసింది మామాచాంగ్. తల్లి పుణ్యమా అని చిన్నప్పుడే గ్రామీణప్రాంతాల పరిచయం లూసన్‌కు కలిగింది. వాళ్లింటికి తరచుగా రైతులు వచ్చే వాళ్లు. ఓ రైతు బిడ్డ 'రుంతూ' లూసన్‌కు బాల్య స్నేహితుడు. అతడు చిత్ర విచిత్రమైన విషయాలు లూసన్‌కు చెప్పేవాడు. ఇవన్నీ పెద్దయినాక పల్లెటూళ్ల దుస్థితి గురించి తెలుసుకోవడానికి లూసన్‌కి చాలా అక్కరకు వచ్చాయి. ఫ్యూడల్, పెట్టుబడిదారీ నిరంకుశ పాలనలో జనాల జీవితాలు ఎలా నాశనమౌతున్నాయో గ్రహించడానికి ఈ అనుభవం లూసన్‌కు అక్కరవచ్చింది. పల్లెల్నాయన కాల్పనిక దృష్టితో చూడలేదు. వాస్తవ దృష్టితో చూశాడు. అందుకే ఆయన ఒక చోట 'తనలాగా', రుంతూలాగా కాకుండా పిల్లలు గొప్పగా వుండాలి. మనం ఇంత వరకు చవిచూడని గొప్ప నూతన జీవితం వాళ్లకు వుండాలి' అని అంటాడు.

లూసన్ అష్టకష్టాలు పడి చదువుకున్నాడు. నీరసం, నిరుత్సాహం ఆయన జీవితంలోనూ, సాహిత్యంలోనూ ప్రధాన విషయం కాదు. తరగతి గది నాయన అంత గాఢంగా ప్రేమించలేదు. పుస్తకాలు చదవడం, వాటిని ఎత్తి రాసుకోవడం లూసన్‌కి ఎంతో ఇష్టమైన విషయాలు. పెద్ద కుటుంబంలో పుట్టిన తనకు చైనా పాత పురాణసాహిత్యాన్ని ప్రయివేటు పంతుళ్లను పెట్టి చదివించారని లూసన్ పేర్కొన్నాడు. 'పక్షుల్ని, పువ్వుల్ని ఎలా ఇష్టపడేవాడినో శ్రమ చేసే వాళ్లని కూడా అంతే ఇష్టంతో చూసేవాణ్ణని, కాకపోతే 'పక్షుల్లా కష్టజీవులెందుకు లేరనేది తనను బాధించేదని' లూసన్ ఒక చోట అంటాడు. లూసన్ తన అనుభవాలనన్నింటినీ తన కథల్లో, వ్యాసాల్లో పొందుపరచినాడు. నాటకం రైతు జనాల జీవితంతో విడదీయరాని భాగం. ఆ విషయాలూ లూసన్ కథల్లో మనకు కనబడుతాయి. రైతుల అణచివేతలు, ఆక్రోశాలు, బలాలు, బలహీనతలు - అన్నీ లూసన్ కథల్లో మనక[illegible]నిపిస్తాయి. బహుశా ఈ రైతు జనాల ప్రగాఢ జీవిత ప్రభావం వల్లనే లూసన్ కష్టాల కెదురొడ్డి నిలబడ గలిగాడు. అంతేగాదు. బ[illegible]పైన లోలే[illegible], పోరాట శీలం కలిగిన ప్రాచీన చైనా వీర గాథల్ని ఆయన యువకుల కోసం సేకరించేవాడు. శాసనాలు, చారిత్రక ప్రదేశాల పరిశీలనను ఈ దృష్టితోనే ఆయన చేశాడు. వర్తమాన దృష్టితోనే, అవసరంతోనే ఆయన చైనా ప్రాచీన చరిత్ర గురించిన లోతైన అధ్యయనం చేశాడు. ఒక యువ దేశభక్తునిగా, ప్రజాతంత్ర వాదిగా, కమ్యూనిస్టుగా ఆయన క్రమ పరిణామం ఆసక్తికరమైనది.

1902లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే నాటికే ఆయన సంస్కరణోద్యమ ప్రభావంలో వున్నాడు. 1898లో బూర్జువా సంస్కరణోద్యమం ఆధునికత కోసం పిలుపిచ్చింది. డార్విన్ పరిణామ వాద సిద్ధాంతం అతనిలాంటి చాలా మందిపై పెను ప్రభావాన్ని వేసింది. డార్విన్ సిద్ధాంత పరిమితుల్ని అర్థం చేసుకొనే అంత పరిజ్ఞానం లేకున్నా లూసన్‌కు ఫ్యూడల్ భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో డార్విన్ ఎంతో వుపయోగపడినాడు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 'రైల్వేలు, గనుల స్కూలు' ఆయనకు చైనా మొదటితరం బొగ్గుగని కార్మికుల పరిచయం కూడా లభించేలా చేసింది.

సామ్రాజ్యవాదంతో మిలాఖతైన కింగ్ భూస్వామ్య ప్రభుత్వం సంస్కరణోద్యమాన్ని వుక్కు పాదంతో అణచి వేసింది. 1900లోనే మిత్రపక్షాల సైన్యాలు బీజింగ్‌ని దురాక్రమించాయి. మితవాద సంస్కరణవాదులకి కూడా కష్టాలు తక్కువేమీ కాదు. ఆ ఉరి తీతల కాలంలో లూసన్ స్వదేశాన్ని విడిచి చదువుకోసం జపాన్ వెళ్ళాడు.

దేశ విముక్తి, సంస్కరణఅతన్ని వెంటాడుతూనే వున్నాయి. వీటికి వుపకరించే అనేక గ్రంథాల అధ్యయనం కొనసాగుతూనే వుంది. అప్పుడు టోక్యోలో సన్‌యెట్‌సేన్ అనుయాయులైన విప్లవ విద్యార్థులతో లూసన్ పరిచయాలు పెంచుకున్నాడు. ఇప్పుడాయన



దృష్టిలో సన్‌యెట్‌సేన్, భాంగ్‌తైయాన్ (బూర్జువా విప్లవకారుడు, మేధావి) ఇద్దరే ఆదర్శం. గ్వాంగ్ ఫూహుయ్‌లో (విప్లవ సంస్థ) తానూ సభ్యుడయ్యాడు. లూసన్ తన తొలి రచనలను మిత్రుడు షాశాంగ్ పెట్టిన పత్రికలో ప్రచురించడం మొదలు పెట్టాడు. 'యువ స్పార్టన్ మహిళల గురించి అందులో రాసిన వ్యాసాలు గొప్పవని లూసన్ అభిప్రాయం. ఆయన ఏది రాసినా, ఏమి ఆలోచించినా చైనా యువకుల గురించే.

ఆధునిక చైనా కోసమే ఆయన ప్రకృతి శాస్త్రాలను అధ్యయనం చేశాడు. సైన్సును దేశభక్తిని ఆయన ఒకటిగా భావించాడు. ఫ్యూడల్ బంధనాల నుంచి చైనా విముక్తికి సైన్సును ఆయుధంగా భావించాడు కనుకనే లూసన్ వైద్య విద్యను అభ్యసించ ప్రయత్నించాడు. సైన్సు

హిమజ్వాల

జనాలను విజ్ఞాన వంతుల్ని చేస్తుందని లూసన్ ప్రగాఢ విశ్వాసం. కాని వైద్య విద్య కూడా చైనా సమస్యను పరిష్కరించ జాలదని అనుభవం ఆయనకు చెప్పింది. ప్రజల్లో చైతన్యం కలిగిస్తేనే చైనా బాగుపడేది. అందుకు వైద్య విజ్ఞానం కంటే సాహిత్యమే బాగా వుపకరిస్తుందనే నిర్ణయానికి లూసన్ రాగలిగాడు.

చాపకింద నీరులా వ్యాపిస్తున్న బూర్జువా ప్రజాస్వామిక విప్లవాన్ని లూసన్ బలంగా సమర్థించటం మొదలు పెట్టాడు. 1907లో అన్‌హుయి (చైనా) గవర్నర్‌ని విప్లవకారులు కాల్చి చంపారు. ఆ ఘటనలో ఎంతో మంది విప్లవకారుల్ని వురి తీసింది ప్రభుత్వం. కింగ్ ప్రభుత్వం అమానుషత్వానికి అంతులేకుండా పోయింది. లూసన్ అమరులైన విప్లవకారుల సంస్మరణసభలో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

సూసులిన్ అతివాద మార్గం లూసన్‌ని ఆకర్షించలేదు. చైనాలాంటి దేశాన్ని నిద్ర నుండి మేల్కొలిపి పోరాటోన్ముఖం చేయడానికి సుదీర్ఘమైన, బలమైన పోరాటం అవసరమని ప్రజలనుత్తేజితం చేసి చైతన్యం చేయడానికి సాహిత్యం బాగా అక్కరకు వస్తుందని లూసన్ విశ్వసించాడు.

స్వంత పత్రిక ప్రయత్నాలు ఫలించక పోవడంతో జపాన్‌కు చెందిన విప్లవకర ప్రజాస్వామ్య పత్రిక 'హేనాన్'లో రాయటం ప్రారంభించాడు లూసన్.

యువ విప్లవకారునిగా, ఆలోచనాపరునిగా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి వుపయోగపడే వివిధ దేశాల రచయితల రచనలను లూసన్ అనువాదాలు చేయసాగాడు. రష్యన్ రచయితల్లో గోగోల్, కొరెలెంకో లూసన్‌కు చాలా ఇష్టంగా కనిపిస్తారు. బైరన్, షెల్లీ, గెథె, హైనే లాంటి వాళ్లను పరిచయం చేయసాగాడు లూసన్. జపాను రచయితలనూ వదిలి పెట్టలేదు. సాహిత్యమతనికి ఆయుధమైంది. హేనాన్ పత్రికలో ఆయన కుహనా దేశభక్తుల్ని ఎండ గడుతూ రాజీలేని పోరాటం చేశాడు. బూర్జువా సంస్కరణవాదం ఎక్కడ భూస్వామ్య వర్గాలకు లొంగిపోతున్నదో ఎత్తి చూపాడు. పాశ్చాత్య బూర్జువా పార్లమెంటరిజాన్ని విమర్శలకు గురి చేశాడు. 'వేల మంది దుర్మార్గ ఫ్యూడల్ నిరంకుశాధికారుల్ని పార్లమెంటేరియనులుగా మార్చడం అన్నదే ఈ సంస్కరణవాదుల చర్యల ఆంతర్యమని చెప్పాడు. ఫ్యూడల్ నిరంకుశ పాలనకు, బూర్జువా సంస్కరణవాదానికి వ్యతిరేకంగా ప్రజల్ని సన్నద్ధం చేయటమే ప్రధానమైన విషయమన్న భావం ఆకాలానికి రాడికల్ భావం.

వెనుకబడిన వుత్పత్తి పరిస్థితులు. కార్మికవర్గం నాయకుడిగా ముందుకు రాని పరిస్థితులు. లూసన్‌కి ఇంకా 'ప్రజల శక్తి' అర్థం కాని స్థితే. లూసన్ విప్లవకర దేశభక్తి సకల రకాల వెనుకబాటుతనాన్ని, అంధత్వాన్ని వ్యతిరేకించటం గమనార్హమైన విషయం. (సాంస్కృతిక పక్ష పాతం అనే వ్యాసం)

పాతనుగానీ, కొత్తను గాని గుడ్డిగా అనుసరించరాదన్నదే లూసన్ నినాదం. కొత్త అంటే ప్రగతి వ్యతిరేక పెట్టుబడీదారీ సంస్కృతి. కళా సాహిత్యాల్లో పాతను పునరుజ్జీవింపచేసే నినాదాన్నీ లూసన్ వ్యతిరేకించాడు. 'పిశాచకవులు' అనే వ్యాసంలో పాత కాలాన్ని గురించి అర్థంలేని వాగుడును ఆయన నిరసించాడు. ఆయన వ్యాసాలన్నిటా 'ప్రజల దుస్థితి పట్ల దు:ఖాన్ని, వాళ్ల లొంగుబాటు పరిస్థితి పట్ల కోపాన్నీ' కనబరుస్తాడు లూసన్. ఆత్మిక పోరాటయోధుల కోసం (స్పిరిచ్యువల్ ఫైటర్స్) ఆయన ఆశగా ఎదురుచూశాడు. రష్యన్ రచయిత కొరెలెంకో రచనలను జ్ఞాపకం చేసుకుంటాడు. 'పిశాచకవులు' అనే వ్యాసాన్ని 'మనం వట్టి ధ్యానపరులంగానే, కేవలం ధ్యానపరులంగానే వుండి పోదామా?' అనే ఆలోచనలు రేకెత్తించే వాక్యంతో ముగిస్తాడు లూసన్.

1908లో టోక్యోలో వుండగనే లూసన్‌కు విప్లవకారుడూ మేధావి జాంగ్ తైయాన్‌తో పరిచయమైంది. ఆయన రాసిన కింగ్ రాజవంశ - భూస్వామ్య వ్యతిరేక వ్యాసాలు లూసన్ని చాలా ప్రభావితం చేశాయి. ఇక్కడే మళ్లీ మరిన్ని విదేశీ సాహిత్య అనువాదాలను - ముఖ్యంగా రష్యన్ సాహిత్య అనువాదాలను లూసన్ చేశాడు. 'రష్యన్ సాహిత్యం మనకు మార్గదర్శకుడూ మంచి మిత్రుడూ' అని చెప్పే స్థితికి ఆయన వచ్చాడు. ప్రపంచంలో పీడితులూ - పీడకులూ వుంటారన్నది రష్యన్ సాహిత్యం మనకు చెప్పిందంటున్నాడు (రష్యన్, చైనా సాహిత్యాలపై రాసిన వ్యాసం)

చైనా, సోవియట్ రష్యా ప్రజల మధ్యనున్న సమరశీల స్నేహాన్ని చైనా సాహిత్యరంగంలో మొదట నొక్కిచెప్పింది లూసనే. లూసన్ విదేశీ సాహిత్యానువాదాలు, ముఖ్యంగా రష్యన్ వాస్తవికవాద సాహిత్యానువాదాలు చైనా ప్రజలను ఎంతగానో వుత్తేజితం చేశాయి. విముక్తి పోరాటంలో ఎంతగానో వుపయోగపడ్డాయి.

1911 విప్లవం బద్దలైన సమయంలో లూసన్ కింగ్ సైనికుల్నించి ఆత్మరక్షణకోసం షావోసింగ్‌లో విద్యార్థులతో సాయుధ ప్రచార దళాన్ని ఏర్పాటు చేయటం ఆయన నిమగ్నతకో మచ్చు తునక.


1911 విప్లవం కింగ్ రాజవంశపాలనకైతే భరత వాక్యం పాడగలిగింది. కాని భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ పీడనలని రూపుమాపలేక పోయింది. రంగువెలిసే కంటే ముందే రిపబ్లిక్ తన పాత ముఖాన్ని చూపెట్టడం మొదలు పెట్టిందని లూసన్ గుర్తించ గలిగాడు. చాలా మంది 'గాంగ్ ఫూహుయి' నాయకులు వేటాడబడినారు లేక చంపబడినారు. 1911 విప్లవ వైఫల్యం లూసన్ని అసంతృప్తికి గురి చేసింది.

1917 అక్టోబర్ విప్లవం ప్రపంచ పీడిత ప్రజానీకానికి ఓ కొత్త వుత్తేజాన్నిచ్చింది.

1919 మే 4 సాంస్కృతిక వుద్యమానికి ఓ ప్రత్యేకత వుంది. మార్క్సిజం లెనినిజం పతాక రెపరెపలాడిన వుద్యమం అది. మే 4 వుద్యమం లూసన్ దృష్టిని సమూలంగా మార్చివేసింది. మార్క్సిస్టు అధ్యయన కేంద్రాలు వెలిశాయి. 'న్యూయూత్' పత్రిక 'లిడార్ఝావో' లాంటి తొలితరం మార్క్సిస్టు మేధావులతో పరిచయం ఏర్పరిచింది.

'న్యూయూత్' పత్రికలో చురకత్తిలాంటి వ్యాసాలు, కథలు రాయటం ప్రారంభించాడు లూసన్. 'పిచ్చివాని డైరీ' 'కాంగ్ యిజీ' 'వైద్యం' లాంటి కథలు న్యూయూత్‌లో వచ్చినయి. అన్నీ భూస్వామ్య వ్యవస్థ పట్ల ప్రజల అనంత ద్వేషాన్ని రెచ్చగొట్టేవే. 'కాంగ్ యిజీ' పేదగా మారిపోయిన ఓ పాత కాలం మేధావి కథ. అర్ధభూస్వామ్య చైనా సమాజంలో 1919కి ముందు, ఇంకా సరిగా చెప్పాలంటే 1912కి ముందు చైనా మేధావుల ముందు రెండే రెండు ప్రత్యామ్నాయాలుండేవి. ఒకటి కాంగ్‌యిజీ కథలో 'మిస్టర్ డింగ్'లా దొరికిన కాడికి అంది పుచ్చుకొని అడ్డదిడ్డ దారుల్లో ఐశ్వర్యవంతుడై పోవటం లేక కాంగియిజీలా అపహాస్యం పాలై చచ్చిపోవడం, కాంగ్‌యిజీ పాత్ర చిత్రణద్వారా లూసన్ ఫ్యూడల్ సమాజంలోని చెడును మన ముందుంచుతాడు.

(తరువాయి 15వ పేజీలో)



సోషలిస్టు భావకుడు, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపకుడు విల్‌హెల్మ్ లీబ్‌క్నెట్

అనేక సంవత్సరాలు అసలైన వృత్తికోసం అన్వేషించాడు.

విజ్ఞాన శాస్త్ర అధ్యయనానికి జీవితాన్ని అంకితం చేయాలనుకున్నాడు.

నిరంకుశ క్రమశిక్షణ, హోదా ఆరాధన, రెడ్ టేపిజం చూసి అసహ్యించుకున్నాడు.

సూత్రబద్ధంగా వున్న వాడు ఆ దేశ విద్యాలయాల్లో యిమడలేననుకున్నాడు.

తనకు సూత్రాలను వొదిలేసి బతకటం సాధ్యం కాదని భావించాడు.

ఆ కలను వొదిలి-రాజకీయ కార్యకలాపాలపట్ల ఆకర్షితుడయ్యాడు.

సామాన్య జనం పట్ల సానుభూతి వుంది.

నిజాయితీ కలవాడు.

లిబరల్సూ, పాలక వర్గాలు ప్రజలకు నిజమైన స్వేచ్ఛను యివ్వలేవని నమ్మాడు.

సోషలిజం వైపు ఆకర్షితుడయ్యాడు. 1846లో కమ్యూనిస్టు అయ్యాడు. ఆయనే విల్‌హెల్మ్ లీబ్‌క్నెట్-

జర్మన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక పార్టీ స్థాపకులలో ప్రముఖుడు - నిర్బంధాలు, నిషేధాల మధ్య రాజకీయోద్యమాన్ని కొనసాగించిన వాడు.

విల్‌హెల్మ్ లీబ్‌క్నెట్ 1826 మార్చి 29 గ్రీసెన్ పట్టణంలో జన్మించాడు. తండ్రి ఉద్యోగి. విల్‌హెల్మ్ ఐదేండ్ల వయస్సులో తల్లి మరణించింది. మరుసటి ఏడాది తండ్రీ మరణించాడు. అయినా విల్‌హెల్మ్ తన ప్రతిభని నిరూపించుకోవడానికి కష్ట పడ్డాడు.

హైస్కూల్ చదువులో ప్రతిభగా చదివాడు. సోషలిస్ట్ సైంట్ సైమన్ రచనలు బాగా చదివేశాడు. యితర గ్రంధాలు కూడా విస్తృతంగా చదివేవాడు. 16 ఏండ్ల వయస్సులో గ్రీసెన్ విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. తర్వాత బెర్లిన్ విశ్వవిద్యాలయానికి వెళ్ళాడు. తత్వశాస్త్రం, భాషా శాస్త్రం, మతతత్వ శాస్త్రం అభ్యసించాడు. విశ్వవిద్యాలయంలో విల్‌హెల్మ్ క్రీస్తు మత సారాంశం గురించి, శ్రమ వ్యవస్థీకరణగురించి, భావి సమాజపు స్వభావం గురించి విద్యార్థులలో జరిగే చర్చలలో విస్తృతంగా పాల్గొన్నాడు. బెర్లిన్‌లో చదువు ముగించుకొని స్విన్‌సాక్స్‌న్‌కి, అప్పట్లో ఆస్ట్రియా సమాజంలో భాగమైన బొహీమియాకీ చేరుకున్నాడు. ఈ సందర్భంలోనే అక్కడ జరిగిన క్రాకోవ్ తిరుగుబాటులో పాల్గొన్నాడని అనుమానించి దేశం నుంచి బహిష్కరించారు.

స్విట్జర్లాండు ప్రయివేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ పత్రికా రచనయితగా పనిచేశాడు. 1847 సెప్టెంబర్‌లో ప్రతిపక్ష జర్మన్ పత్రిక 'మాన్‌హైమ్' సాయంకాలం పత్రికకు విలేఖరి అయ్యాడు. ప్రతిభావంతుడైన రచయితగా పేరుపొందాడు. ఆర్నెల్లలో 100 వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. ఆయన ప్రతిభను గుర్తించి 'జురిచ్' వార్తాపత్రికకు సంపాదకుడ్ని చేసారు. ఉద్యోగానికి విరామం యిచ్చి 1848 ఫిబ్రవరిలో విప్లవకర పారిస్‌లో వున్నాడు. పారిస్‌లో ఉద్యమ ప్రభావంతో జర్మనీకి విప్లవాన్ని ఎగుమతి చేసేందుకు ఒక దళాన్ని ఏర్పాటు చేయాలని జర్మనీ ప్రవాసులు భావించారు. ఆ దళంలో పనిచేసేందుకు స్వచ్ఛందంగా విల్‌హెల్మ్ వచ్చాడు. యీ దళం ఏర్పడక ముందే విచ్ఛిన్నం అయ్యింది. విల్‌హెల్మ్ ఆరోగ్యం దెబ్బతిన్నది.

1848 వసంతంలో జర్మనీలో విప్లవం ప్రజ్వరిల్లింది. కొంత కాలం తరువాత తన మిత్రులతో కలిసి బాడెన్‌కు వెళ్ళాలని ఆలోచించాడు. యీ ప్రయత్నంలోనే సైనికుల చేతుల్లోకి చిక్కారు. విడుదల తరువాత బాడెన్ తిరుగుబాటు కేంద్ర స్థానం అయిన కార్ల్సరూమేకి వెళ్ళాడు. బాడెన్ తిరుగుబాటును అణచివేశారు. యీ క్రమంలోనే 1849 జూన్ 5న విల్‌హెల్మ్‌ను అరెస్టు చేసి రష్టాడ్ జైలులో పెట్టారు. సైనికులను సంతోషపరిచే రాజకీయ ప్రచారం చేసి 3 రోజులలో బయటపడ్డాడు. తరువాత ప్రష్యన్ సేనలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో పాల్గొంటూ సరిహద్దుల దాకా వెళ్ళి స్విట్జర్లాండ్ చేరుకున్నారు. దీనితో 13 ఏండ్ల పాటు జర్మనీకి వెళ్ళలేక పోయాడు.

జెనీవాలో స్థిరపడి ప్రవాసుల బృందాలలో చేరాడు. అక్కడ 1849 వేసవిలో ఎంగెల్స్ స్విట్జర్లాండ్‌లోనే వుండగా కలిశాడు. యీ పరిచయం రాజకీయ ప్రాముఖ్యత పెరిగింది. దీనితో జెనీవాలో జర్మనీ కార్మికుల సంఘంలో చేరాడు. త్వరలోనే దానికి అధ్యక్షుడు అయ్యాడు. 1850లో మహాసభ జరుపుకోవాలని యత్నించగా అధికారులు నిషేధించారు. విల్‌హెల్మ్ అనేక మందితోపాటు అరెస్టు చేసి రెండు నెలలపాటు ఒంటరిగా ఖైదులో వుంచారు. విడుదల తరువాత స్విట్జర్లాండు నుంచి వెళ్ళగొట్టారు. ఇంగ్లాండు పోయాడు. లండన్‌లోనే కారల్‌మార్క్స్‌ను కలుసుకొని, ఆయన కుటుంబానికి అత్యంత సన్నిహిత మిత్రుడయ్యాడు. అక్కడ కమ్యూనిస్టు లీగ్‌లో సభ్యుడుగా చేరాడు.

మార్క్స్, ఎంగెల్స్‌ల పరిచయంతో పెటీబూర్జువా సోషలిస్టు ఆలోచనలను విల్‌హెల్మ్ వదిలేసి మార్క్సిస్టు శాస్త్రీయ దృష్టిని అలవర్చుకున్నాడు. 1862లో జర్మనీకి వెళ్ళాడు. 1863లో లైప్జింగ్ నగరంలో లాసాల్ అను అతను అఖిల జర్మన్ కార్మిక సంఘాన్ని ఏర్పరిచాడు. ఆ సంఘంలో చేరి విల్‌హెల్మ్ చురుకుగా పనిచేశాడు. ట్రేడ్ యూనియన్లను విస్తృతం చేయాలని బోధించాడు. మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలను విల్‌హెల్మ్ కార్మికులకు పరిచయం చేశాడు. బెర్లిన్ ప్రెస్ కార్మికులతో ప్రష్యన్ ప్రభుత్వం, ప్రోగ్రెసివ్ పార్టీ కార్మికుల డిమాండ్లను తీర్చలేదని ఉద్బోధించాడు. ప్రభుత్వం చెప్పే కబుర్లు, వాగ్దానాలు దగా అని బోధించాడు. బూర్జువా రాజ్యాన్ని పూర్తిగా నాశనం చేయాలన్నాడు. అప్పుడే కార్మికులకు నిజమైన మేలు జరుగుతుందని ఉద్బోదించాడు. దీనితో 1865లో 'రాజ్య భద్రతకు ముప్పు' తెస్తున్న ప్రమాదకారిగా భావించి ప్రష్యానుంచి, బెర్లిన్ నుంచి బహిష్కరించారు. దానితో సాక్యాకి వెళ్ళి దాని రాజధాని నగరం లైప్జిగ్‌లో వున్నాడు. అక్కడ బెబెల్‌తో (యువ కార్మిక నేత) పరిచయం అయ్యింది. విల్‌హెల్మ్ పరిచయంతో బెబెల్ సోషలిస్టుగా మారాడు.

జర్మనీ కార్మిక వర్గానికి సేవతో పరిచయం కాకుండా, అంతర్జాతీయ వాదిగా మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటులో పాల్గొన్నాడు. లండన్‌లో జరిగిన సమావేశానికి హాజరు కాలేక, లిఖిత నివేదిక పంపాడు.

విల్‌హెల్మ్‌ను 1867లో జర్మనీ పార్లమెంటు రిచ్‌స్టాగ్ (రైక్‌స్లాగ్)కి ఉత్తర జర్మనీ సమాఖ్య నుంచి ప్రతినిధిగా ఎన్నుకున్నారు. మార్క్స్, ఎంగెల్స్‌ల సూచనలననుసరించి ఆ పార్లమెంటును వుపయోగించుకున్నాడు. ప్రష్యన్ భూస్వాముల అభివృద్ధి నిరోధక

పి.రంగారావు

విధానాలను బట్టబయలు చేయడానికి, సైనిక నిరంకుశత్వాన్ని వెల్లడించేందుకు పార్లమెంటును నేర్పుగా వుపయోగించుకున్నారు. ఫ్రెంచి - ప్రష్యన్ యుద్ధకాలం 1870-71లో భూస్వాముల, బూర్జువాల దురాక్రమణపథకాలను వ్యతిరేకించాడు. అంతర్జాతీయ వాదిగా వ్యవహరించాడు.

అంతర్జాతీయ కార్మక సంఘంలోని వామపక్ష శక్తులను సమీకరించి 1869లో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక పార్టీని నెలకొల్పారు. యిదే జర్మనీ కార్మికవర్గపు విప్లవ సంఘానికి పునాది అయ్యింది. శ్రామిక వర్గ పోరాటాలకు యిదొక మూల మలుపు. ఈ పార్టీ ఏర్పాటు అంతర్జాతీయ కార్మిక వర్గ ఉద్యమంలో ప్రముఖ సంఘటన. యీ పార్టీ ఏర్పాటు ఘనత విల్‌హెల్మ్ లీబ్‌క్నెట్‌దే. 1869లో విల్‌హెల్మ్, బెబిల్ నేతృత్వంలో 'ప్రజారాజ్యం' (ఫోడ్ స్టాట్) వార్తాపత్రిక ఆరంభించాడు. యిది అంతర్జాతీయ కార్మిక సంఘాల, సోషల్ డెమోక్రట్ల పత్రిక.

మొదట్లో కొన్ని సందేహాలున్నా - భూమిపై వ్యక్తిగత స్వామ్యం రద్దు చేయాలని అంతర్జాతీయ కార్మిక మహాసభ తీర్మానించింది. దీని ఆధారంగా 1869 మార్చిలో పలు పట్టణాలలో వ్యవసాయ సమస్యపై ప్రసంగాలు చేశాడు. 1870లో రిచ్‌స్టాగ్‌కు జరిగిన ఎన్నికల గురించి ఆలోచించి - బూర్జువా పార్టీలతో అన్ని రకాల ఎన్నికల ఒప్పందాలను ఆయన తిరస్కరించాడు.

ప్రష్యన్ ప్రభుత్వానికి సైనిక రుణాలివ్వడానికి 1870 జూలై 21న రిచ్‌స్టాగ్‌లో జరిగిన చర్చలో విల్‌హెల్మ్, బేబెల్‌లు ఓటు వేశారు. యిది వాళ్ళు అత్యంత సాహసంతో చేశారు. యీ చర్య జర్మనీలో సంచలనం కలిగించింది. ఫ్రాన్సు - ప్రష్యన్‌ల యుద్ధ సమయంలో జరిగిన చర్చ యిది. ప్రభుత్వం యీ చర్యలతో 'దేశద్రోహి' నేరారోపణతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. 1872 మార్చి 11న ఆరంభమై 14 రోజులపాటు విచారణసాగింది. విచారణప్రాముఖ్యత వుంది. పత్రికలు బాగా కవర్ చేశాయి. కోర్టు హాలును విల్‌హెల్మ్, బేబెల్‌లు సోషలిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని, విప్లవకర విధానాన్ని వివరించేందుకు వాళ్ళిద్దరూ వినియోగించుకున్నారు. అయినా రెండేళ్ళ శిక్ష విధించి, జైలులో పెట్టారు.

కోర్టులో వీరు సాహసోపేతంగా సోషలిజం, విప్లవ కార్యక్రమం గురించి చేసిన వివరణలు వీరి ప్రతిష్టను జర్మనీలోనే గాకుండా, అంతర్జాతీయంగా పెంచాయి. జైలు నుంచి చట్టబద్ధ పద్ధతులు, చట్ట విరుద్ధమైన పద్ధతుల ద్వారా ఉద్యమ నిర్మాణం గురించి బంధు, మిత్రుల ద్వారా బయట ప్రపంచానికి తెలియజేశారు. జైలు నుంచే మార్క్స్, ఎంగెల్స్‌లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు.

1874 జనవరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సోషల్ డెమోక్రాట్లు ఆరు సీట్లు గెలుచుకున్నారు. విల్‌హెల్మ్ జైలు నుంచే సొంత నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యాడు. తరువాత విడుదలయ్యాడు. తరువాత 1875లో గోతాలో జరిగిన మహాసభ లాసానియన్‌లు, ఐసెనాఖ్‌లు రెండు కలిసి ఒకే కార్మిక వర్గ పార్టీగా ఏర్పడ్డాయి. సోషలిస్టు కార్మిక పార్టీగా 1890 నుంచి జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీగా పిలిచారు. గోతాలో ఆమోదించబడిన కార్యక్రమాల అతుకుల బొంతగా వుంది. కార్మికవర్గ స్థాయిలో అది లేదు. పైగా లాసానియన్‌ల పెటీబూర్జువా, అవకాశవాద అభిప్రాయాలతో పార్టీ రాజీపడకుండా వుండలేక పోయింది. మార్క్స్, ఎంగెల్స్‌లు సైతం ఆ ఏకీకరణప్రధాన విజయంగా అంగీకరిస్తూనే, దాని ప్రతికూల పార్శ్వాలను స్పష్టంగా చెప్పారు. విల్‌హెల్మ్, బేబెల్‌లు పార్టీ ప్రత్యక్ష కార్యకలాపాల్లో జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ విప్లవకర విధానాన్ని అనుసరించి, శ్రామిక జనబాహుళ్యంలో మార్క్స్ భావాలను వ్యాపింపజేసేందుకు తోడ్పడింది. యీ భావాలను అరికట్టేందుకు 1878 ప్రభుత్వం సోషలిస్టు వ్యతిరేక చట్టాన్ని జారీ చేసింది. యీ చట్టం సోషలిస్టు భావాలను నిర్మూలించేందుకు ఉద్దేశింపబడింది. మూడు వందల ముప్పై రెండు కేంద్ర, స్థానిక సోషల్ డెమోక్రటిక్ సంఘాలను నిషేధించారు. సభలు రద్దు చేశారు. పుస్తకాలు, కరపత్రాలను జప్తు చేశారు. తీవ్రమైన శిక్షలు విధించారు. ఒక రకమైన దిగ్బంధన పరిస్థితి ఏర్పడింది. యీ సోషలిస్టు వ్యతిరేక చట్టం జర్మనీలో 12 సం॥రాలు అమల్లో వుంది. ఆ పన్నెండేళ్ళను జర్మనీ కార్మికవర్గ ఉద్యమం వీరోచిత దశగా లెనిన్ అన్నాడు. పార్టీ ఆ కాలంలో బహిరంగ, రహస్య కార్యకలాపాలను నేర్పుగా మేళవించింది. పార్లమెంటులోనూ, బయటా ఉపన్యాసాలు సాగాయి. పార్టీ జన బాహుళ్యంతో సంబంధాలు దృఢం అయ్యాయి. జనం మధ్య భారీ స్థాయిలో శిక్షణకు కృషి నిర్వహించింది. 'ఫోర్ వార్డ్స్' పత్రిక స్థానంలో సోషల్ డెమోక్రాట్ అనే కొత్త పత్రిక రహస్యంగా ఆరంభించారు. మొదట జురిచ్ నుంచి తరువాత లండన్ నుంచి ప్రచురించారు. అనేక మంది కార్మికులు ప్రమాదాన్ని లెక్క చేయక ఆ పత్రికను జర్మనీ కార్మికులలో పంచారు.

యీ కాలంలోనే 1880లో స్విట్జర్లాండ్‌లో రహస్యంగా జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ మహాసభ జరిగింది. దీని తరువాత విల్‌హెల్మ్‌ను అరెస్టు చేసి ఆరు నెలల శిక్ష వేశారు. విడుదల తరువాత యీయన, బేబెల్‌తోపాటు 33 మంది సోషల్ డెమోక్రాట్లను 24 గంటలలో నగరం విడిచి వెళ్ళాలని సాక్సనీ ప్రభుత్వం ఆదేశించింది. నిషేధాలు, జైళ్ళ మధ్యనైనా సోషలిస్టు భావాల ప్రచారం, కార్యకలాపాల కోసం తన సమయం వెచ్చించాడు. 1881లో రిచ్‌స్టాగ్ ఎన్నికలు జరిగాయి. విల్‌హెల్మ్ 17 నియోజకవర్గాల్లో ఏక సమయంలో పోటీ చేసి, అన్ని నిర్బంధాలను, వేధింపులను తట్టుకుని సోషల్ డెమోక్రాట్స్‌కు బ్రహ్మాండమైన విజయం సాధించి పెట్టాడు.

యీ సమయంలో పార్టీ ఎదుర్కొంటున్న ఆర్థిక యిబ్బందులను అధిగమించటానికి 1886 సెప్టెంబర్‌లో అమెరికా వెళ్ళి న్యూయార్కు, ఫిలడెల్ఫియా, బోస్టన్, డెట్రాయిట్, చికాగో, పిట్స్‌బర్గ్, వాషింగ్‌టన్ తదితర నగరాల్లో తిరిగి సోషలిస్టు భావాలను ప్రచారం చేసి జర్మనీ పార్టీకి 16,000 మార్కులు (మార్కు జర్మనీ రుపాయి) పోగు చేశారు. యీ పర్యటననే 'నూతన ప్రపంచ రేఖామాత్ర దర్శనం' పేరిట వ్యాస సంపుటం ప్రచురించాడు. ఆ తరువాత కాలంలో 'ఫ్రెంచి మహా విప్లవ చరిత్ర', 'సాలీళ్ళు - ఈగలు' అనే పుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి. అణచివేత చట్టంతో కార్మికవర్గాన్ని ఆ ప్రభుత్వం అణచలేక పోయింది. ఆ చట్టాన్ని 1890లో ఎత్తివేసింది.

విల్‌హెల్మ్ 1891లో 'ముందుకు-బెర్లిన్ ప్రజాపత్రిక'కు ప్రధాన సంపాదకుడయ్యాడు. చివరి దాకా ఆ పదవి నిర్వహించాడు. 1899లో విల్‌హెల్మ్ 'రాజీలు ససేమిరావద్దు - ఎన్నికల ఒప్పందాలు ససేమిరా వద్దు' అనే చిన్న పుస్తకం వ్రాశాడు. యిది విల్‌హెల్మ్ వీలునామాగా పరిగణింపబడింది. యీ రచనలో వర్గ పోరాట ఎత్తుగడల నుంచి బెసకడం వల్ల కలిగే ప్రమాదాలను గురించి ఆయన పార్టీని హెచ్చరించాడు. విమోచనాత్మక పోరాటాన్ని పెంపొందించాలని, ఏ పెట్టుబడిదారీ వ్యవస్థలో సమస్త రాజకీయ, ఆర్థిక అధికారమూ కేంద్రీకృతమై వుందో ఆ వర్గ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్రమబద్ధంగా పోరాడవలిసిందిగా, యీ పోరాట క్రమంలో వివిధ బూర్జువా పార్టీల మధ్య తలెత్తే విబేధాలను, ఘర్షణలను బాగా వుపయోగించుకోవాల్సిందిగా పార్టీకి ఆయన విజ్ఞప్తి చేశాడు. విల్‌హెల్మ్ 1900 సం॥రం ఆగస్టు 7న మరణించాడు. తన చివరి శ్వాస దాకా రాజకీయ జీవితాన్ని గడిపాడు. చురుకైన కార్యకర్త. నాయకుడు. ఆంక్షలు, జైళ్ళను లెక్క చేయలేదు. శతృవుల మీద నిరంతరంగా పోరాడాడు. సోషలిజం పట్లా, కార్మికవర్గ ఉద్యమం పట్లా ఆయన ప్రగాఢమైన విశ్వాసం కలిగి ఉండేవాడు.

విల్‌హెల్మ్ ఏ శ్రామికవర్గ ఉద్యమం కోసం నిరంతరం పోరాడాడో, ఆ లక్ష్యాల బాటలోనే, ఆ అడుగుజాడల్లోనే ఆయన కొడుకు కార్ల్ లీబ్‌నిడ్జ్ కృషి చేశాడు. కార్ల్ జర్మనీ, అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకుల్లో ఒకడు. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకానొకడు.

విజ్ఞానశాస్త్ర అధ్యయన కలల నుంచి శ్రామిక వర్గ విముక్తి పథం కోసం, సోషలిజం కోసం పరితపించిన అహరహం శ్రమించిన వ్యక్తి విల్‌హెల్మ్ లీబ్‌నిడ్జ్.

భూమి - వైద్య సమస్యలను పరిష్కరించాలని ఉట్నూర్‌లో ప్రదర్శన

ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ఆదివాసుల భూమి-వైద్య సమస్యలు పరిష్కరించాలనీ, గిరిజన గ్రామాలకు త్రాగు నీరు, సాగునీరు అందించాలనీ, రోగాల భారిన పడి మృత్యువాతపడిన ఆదివాసులకు లక్షరూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలనీ, ఆదిలాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఉట్నూర్‌కు తరలించాలనీ, ఆదివాసుల వైద్యానికి 100 కోట్ల రూపాయలు ప్రకటించాలనీ డిమాండ్ చేస్తూ తేది 6.10.2008న అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) ఆధ్వర్యంలో ఉట్నూరులో 1000 మందితో భారీ ర్యాలీ జరిగింది. ఉట్నూరులోని విశ్రాంతి భవనము నుండి అంబేద్కర్ చౌక్, పాత బస్టాండ్ మీదుగా ప్రదర్శన సాగింది. తదుపరి ఐ.టి.డి.ఎ. ముందు ధర్నా జరిగింది. ఈ ప్రదర్శన ఐ.టి.డి.ఎ. వరకు చేరుకోగానే భారీగా మోహరించిన పోలీసు బలగాలు ఐ.టి.డి.ఎ. లోనికి పోకుండా అడ్డుకున్నారు. దీనితో గేటు వెలుపల బైటాయింపు జరిపారు. అనంతరం ఎ.పి.ఓ. జనరల్ వచ్చి వినతి పత్రం తీసుకొని ఇవి న్యాయమైన సమస్యలనీ, వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వానికి నివేదిస్తామని హామి ఇచ్చారు. అంతలోనే ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి రావడంతో లోనికి చొచ్చుకొని వెళ్ళి మరో వినతి పత్రం ఇవ్వగా ఈ సమస్యలను సత్వరమే పరిష్కారం చేస్తామనీ హామీ ఇచ్చారు.

అనంతరం జరిగిన సభలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతి మాట్లాడుతూ ఏజెన్సీలోని ఆదివాసుల పరిస్థితి ఆరు దశాబ్దాలు దాటినప్పటికీ యధాతదంగానే వుందన్నారు. ఇప్పటికీ, 30, 40 సంవత్సరాలుగా ఆదివాసులు సాగుచేస్తున్న అటవీ భూములకు పట్టాలివ్వకుండా కాలయాపన చేయడం వల్ల నిత్యం అభద్రతా భావంతో కాలం వెల్లదీస్తున్నారనీ అన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి 6 నెలలు దాటినా నేటికి సర్వేలు పూర్తి కాక పోగా ప్రభుత్వమే తమ ఎన్నికల పబ్బం గడపడానికి కోర్టు ద్వారా స్టే తెప్పించిందని ఆరోపించారు. ఏజెన్సీలోని ఆదివాసులు వైద్య సౌకర్యాలు లేక వేలాది మంది చనిపోతున్నప్పటికీ శాశ్వత వైద్య సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. జిల్లాలోని ఆదివాసులు 1998లో 5000 మంది, 2007లో 500 మందికి పైగా, ఈ సంవత్సరం 150 మందికి పైగా చనిపోయారన్నారు. ఇంకా మరణాలు కొనసాగుతూనే వున్నాయని ఏజెన్సీలోని ఆసుపత్రుల్లో ఖాళీగా వున్న డాక్టర్ల పోస్టులను భర్తీ చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికీ ఆసుపత్రుల్లో మందులు లేవని అన్నారు. పౌష్టికాహారలోపం, రక్తహీనతతో చనిపోతున్నారనీ వైద్యాధికారుల్లు చెపుతున్నారు. కాని పౌష్టికాహారం కల్పించడానికి ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. త్రాగునీటి సౌకర్యం లేక కలుషిత నీరు తాగి ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆదివాసుల భూమి, వైద్యం, తాగునీరు, సాగునీటి సమస్యలన్ను పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు.

ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కా॥ నంది రామయ్య మాట్లాడుతూ ఆదివాసులపైనా ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ది లేదని అన్నారు. ఆదివాసుల ఓట్ల కోసం గాలం వేస్తున్న పార్టీలు సమస్యలపై స్పందించడం లేదని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు కా॥ వి. నారాయణ, యం. శంకర్, డివిజన్ నాయకులు కా॥ కుడిమెత మధు, అరికిళ్ళ కేశవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ కె. సాయన్న, పీవైయల్ జిల్లా కార్యదర్శి జె. రాజు, పీఓడబ్ల్యూ నాయకులు మర్సుకొల సరస్వతి, వి. పుష్పలు పాల్గొన్నారు.

ఆదివాసుల భూమి, వైద్య సమస్యలపై సదస్సు

ఆదివాసుల భూమి, వైద్య సమస్యలు పరిష్కరించాలనీ ఆందోళన కార్యక్రమం రూపొందించుకోవడానికి తేది 22.9.2008న ఎఐకెఎంఎస్ జిల్లా ఆధ్వర్యంలో ఉట్నూరులోని గుసాడిగుట్టలో 100 మందితో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు 35 గ్రామాల ఎఐకెఎంఎస్ ముఖ్యులు హాజరయ్యారు. ఈ సదస్సుకు ఎఐకెఎంఎస్ ఉట్నూర్ డివిజన్ కార్యదర్శి కుడిమెత మధు అధ్యక్షత వహించగా ఎఐకెఎంఎస్ ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతి మాట్లాడారు.

గిరిజన ల్యాండ్ అండ్ సర్వేయర్ల ధర్నా

అటవీ హక్కుల కమిటీ బిల్లు అమలు కోసం భూములు సర్వే చేయడానికి ఏజెన్సీలో 150 మంది గిరిజన నిరుద్యోగులకు రెండు నెలలు శిక్షణనిచ్చి నియమించారు. వీరిని అటవీ భూములను సర్వే చేయడానికి నాలుగు నెలల కాలంలో వినియోగించారు. అయితే వీరికి సరియైనటువంటి జీతభత్యాలు నిర్ణయించకుండానే పనులు చేయించి వీరిని ఎటూ కాకుండా చేశారు. దీనితో గిరిజన ల్యాండ్ అండ్ సర్వేయర్లు కమిటీ వేసుకొని ఆందోళనకు పూనుకున్నారు. ఈ కమిటీకి ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతిని గౌరవ అధ్యక్షులుగా నియమించారు. స్థానిక గుసాడి గుట్ట హాలులో తేది 12.9.2008న సదస్సు నిర్వహించి ఆందోళన పిలుపునివ్వడం జరిగింది.

తేది. 22.9.08న ల్యాండ్ అండ్ సర్వేయర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐ.టి.డి.ఎ. కార్యాలయం ఎదుట 120 మందితో ఉదయం నుండి సాయంత్రం వరకు ధర్నా కార్యక్రమం నిర్వహించి ఐ.టి.డి.ఎ. పీవోకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, ఈశ్వర్, ఆత్రం గోవిందరావు నాయకత్వం వహించగా ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులను మభ్యపెట్టి ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి వీరిని మధ్యలోనే ఉద్యోగం నుండి తొలగించారని అన్నారు. డిగ్రీ, పీజీ చేసిన వారిని నియమించినట్లే నియమించి రోడ్డున పడేశారన్నారు. కావున వెంటనే ప్రభుత్వం వీరిని శాశ్వత ఉద్యోగాలలోకి తీసుకోవాలని అన్నారు.

మ్యాకులపేట భూమి సమస్యపై


దండెపల్లి మండల మ్యాకులపేట శివారులో, స.నెం. 25, 26లో అటవీ భూములు నరికి సాగుచేస్తున్న ఆదివాసులకు పట్టాలివ్వాలనీ డిమాండ్ చేస్తూ తేది. 15.9.2008న ఉట్నూర్‌లో 100 మందితో ఊరేగింపు నిర్వహించి ఐ.టి.డి.ఎ. ముందు ధర్నా చేసి పీవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతి,



ఎఐకెఎంఎస్ డివిజన్ అధ్యక్షులు కె. భీంరావు, కె. మధు, కేశవ్, మాకులపేట భూపోరాటనాయకులు బొజ్జుబాయి, కీసుపటేల్ తదితరులు పాల్గొన్నారు.


దండెపల్లిలో ధర్నా

మ్యాకులపేట ఆదివాసుల సాగుచేస్తున్న అటవీ భూములకు పట్టాలివ్వాలనీ డిమాండ్ చేస్తూ తేది. 4.10.08న దండెపల్లి మండల కేంద్రంలో 150 మందితో ఊరేగింపు చేసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ మర్సుకొల తిరుపతి, పార్టీ మంచిర్యాల డివిజన్ కార్యదర్శి కా॥ నైనాల వెంకటేశ్వర్లు, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ సుధాకర్, దేవరాజు, ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ బీడీ వర్కర్స్ యూనియను పిలుపు మేరకు బీడీ మరియు చుట్ట కార్మికుల చట్టాన్ని సవరించాలని, తునికాకు దోపిడిని వెంటనే అరికట్టాలని, 1995 పెన్షన్ పథకాన్ని సవరించి బీడీ కార్మికులకు నెలకు వేయి రూపాయల కనీస పెన్షనును చెల్లించాలని డిమాండు చేస్తూ నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి. నిజామాబాదులో సెప్టెంబరు 30న 25 వేల మందితోను, హైదరాబాద్‌లో అక్టోబరు 21న 15 వేల మందితోను జరిగిన పూరేగింపులు, మహాధర్నాలు ఈ ఆందోళనలో హైలైట్స్ (వివరమైన రిపోర్టు వచ్చే సంచికలో)

యంసీపీఐ(యూ) నాయకుడు కా॥ యం. ఓంకార్‌కు జోహార్లు



యంసీపీఐ(యూ) నాయకుడూ, మాజీ ఎమ్మెల్యే అయిన కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అక్టోబర్ 16న హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యశాలలో కన్నుమూసారు. 82 సం॥రాల వయస్సు గల ఓంకార్‌కు నలుగురు కుమారులూ, ఒక కుమార్తె, భార్య లక్ష్మమ్మ ఉన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంతో ప్రారంభమైన ఓంకార్ జీవితం, అందులోని అన్ని మలువులను పెనవేసుకున్నది.

నల్లగొండ జిల్లా ఆత్మకూరు (యస్) మండలంలోని ఏపూర్ గ్రామంలో ఓంకార్ 1926లో జన్మించారు. ఆర్య సమాజ్ ప్రభావంతో ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించినా అనతికాలంలోనే కమ్యూనిస్టుగా మారారు. చిన్న నాడే నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. తన 18వ ఏట అంటే 1944 లో ఖమ్మంలో జరిగిన ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. నిజాంను గద్దెదించటానికి జరిగిగిన మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో సైనికుడిగా, సేనానిగా, యోధుడుగా పాత్ర నిర్వహించారు. 1948 నుండి నేటి వరంగల్ జిల్లాలోని నర్సంపేట అటవీ ప్రాంతంలో గిరిజనుల్లో పనిచేసారు. వారిని నిజాం పాలనకు వ్యతిరేకంగా కూడగట్టారు. 1946 నుండి 52 వరకు అజ్ఞాతంగానే అనేక కార్యకలాపాలను సల్పారు. 1953 నుండి 63 వరకు వరంగల్ జిల్లా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, 1963లో వరంగల్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1969లో సీపీయం నుండి కమ్యూనిస్టు విప్లవకారులు అన్ని రకాలుగా తెగదెంపులు చేసుకున్నప్పుడు సీపీయంతోనే వుండిపోయారు. 1972లో తొలిసారిగా నర్సంపేట నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగానూ పనిచేశారు. 1982లో సీపీయం విధానాలు నచ్చక, దానితో విభేదించి యంసీపీఐ పార్టీని తన అనుచరులతో కలిసి స్థాపించారు.

1994 తరువాత కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికై ఐక్యకార్యాచరణకోసం విప్లవశక్తులతో, ఇతరులతో ఓంకార్ కృషి ప్రారంభించారు. ఆక్రమంలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) లాంటి విప్లవ పార్టీలతో, ఇతరులతో కలిసి ఐక్యకార్యాచరణకు ముందుకొచ్చారు. పాలకవర్గ పార్టీలతోగానీ, వారితో ఫ్రంట్‌లు కట్టే సీపీఐ, సీపీయంలతో గానీ ఎలాంటి ఎన్నికల పొత్తులుగానీ, ఫ్రంటులుగానీ ఏర్పరచుకోరాదనే అవగాహనను యంసీపీఐ రూపొందించుకోవడంలో ఆయన కీలక పాత్ర వహించారు. విద్యుత్ ఉద్యమ తదనంతరం ప్రధానంగా ఈ అవగాహనతో యంసీపీఐ నిలబడదానికి ఎంతగానో పాటుపడ్డారు.

కమ్యూనిస్టులు బూర్జువా పాలకవర్గ పార్టీలకు తోకలుగా మారకుండా పీడిత తాడిత ప్రజానీకాన్ని ఉద్యమాల్లోకి సమీకరించడం ద్వారానే అశేష ప్రజానీకపు అభిమానాన్ని చూరగొనాల్సి ఉంటుందని ఆయన తన జీవిత చరమాంకంలో పదేపదే చెప్పేవారు. ఆ మేరకు సీపీయం, సీపీఐలతో ఎన్నికల్లో ఫ్రంట్లు కట్టటాన్ని వ్యతిరేకించి అమలు జరిపారు.

ఓంకార్ మృతి ఐక్య ప్రజాఉద్యమాలకు, ప్రజలకు లోటు. తెలంగాణా సాయుధ రైతాంగం పోరాట సేనానిగా ఆయన సల్పిన పోరాటం ఆదర్శనీయమైనది. కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభ కాలంలో ఆయన నిర్వహించిన పాత్ర సాహసోపేతమైనది.

సీపీయం పార్టీతో ఆయన జీవితం ఎక్కువ కాలం పెనవేసుక పోయినప్పటికీ చరమాంకంలో ఓంకార్ అదే సీపీయం, సీపీఐల వర్గ సంకర, అవకాశవాద విధానాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. కష్టజీవుల పోరాటాలను, త్యాగాలను ఆ పార్టీలు పాలకవర్గాల పాదాల చెంత నిలిపి, ఎన్నికల్లో లబ్ది పొందాలనే వాటి నైజానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడ్డారు. కష్టజీవులను ఐక్యం చేయడం కోసం ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఐక్యకార్యాచరణను చేపట్టాలని తహతహలాడారు. అలాంటి కామ్రేడ్ ఓంకార్ మృతి పట్ల సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) రాష్ట్ర కమిటీ విచారం వ్యక్తం చేస్తూ ఆయనకు సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మృతికి జోహార్లు తెలియజేసింది. ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు తన సానుభూతిని ప్రకటించింది.

ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కా॥ వై. సాంబశివరావు, రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ డి.వి.కృష్ణ, కె. గోవర్ధన్, పీవైయల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. హన్మేష్, పీవోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ వి. సంధ్య ఆయన భౌతిక కాయంపై పూలగుచ్చాలుంచి, జోహార్లర్పించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో పార్టీ తరపున కామ్రేడ్స్ డి.వి.కృష్ణ, వేములపల్లి వెంకట్రామయ్య, ఎఐకెఎంఎస్ ఆలిండియా కార్యదర్శి కా॥ జి. దివాకర్ పాల్గొని జోహార్లర్పించారు.

రుణాలకై బయ్యారంలో రైతుల ధర్నా

రైతు లందరికీ సరిపడినన్ని పంట రుణాలు ఇవ్వాలనీ, రుణమాఫీ వర్తించిన వారికి, కౌలు రైతులకు కూడా రుణాలు ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 23న ఖమ్మం జిల్లా బయ్యారం మండలం బాలాజీ పేట స్టేట్ బ్యాంకు వద్ద ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. రెండు వందల మంది రైతులు పాల్గొన్న ఈ ధర్నా నుద్దేశించి ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కా॥ జగ్గన్న, మండల అధ్యక్షుడు కా॥ పొమ్మయ్య, పార్టీ సబ్ డివిజన్ నాయకుడు కా॥ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం రైతులందరికీ రుణాలు ఇవ్వాలనే డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు.

అదే రోజు బయ్యారం మండల కేంద్రంలో ఆంధ్రా బ్యాంకు, నాగార్జున గ్రామీణబ్యాంకు, సొసైటీ బ్యాంకుల వద్ద ధర్నాలు జరిపి, బ్యాంకు అధికారులకు మెమోరాండాలు అందజేశారు. ఈ సందర్భంగా కామ్రేడ్స్ జగ్గన్న, రామగిరి బిక్షం, నందగిరి వెంకటేశ్వర్లు కార్యక్రమాల్ని వుద్దేశించి మాట్లాడారు.

(1వ పేజీ తరువాయి)

ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. యీ పిలుపు మేరకు జిల్లాలో సుమారు 30 మండలాలలో ప్రదర్శనలు జరిగాయి.

యింతే గాకుండా గ్రామ స్థాయిలో సమావేశాలు, సదస్సులు జరిపారు. యీ క్రమంలోనే అక్టోబర్ 23న ఛలో ఖమ్మం ప్రదర్శనకు, సభకు పిలుపునిచ్చింది. యీ పిలుపులో భాగంగా మహిళాలోకం తరంగంలా కదిలి వచ్చింది. ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి మధ్యాహ్నం 1.30 గం॥లకు పెద్ద ప్రదర్శనగా కలెక్టరేట్‌కు బయలుదేరారు. ఖమ్మంలోని మెయిన్‌రోడ్డు కిక్కిరిసి పోయింది. ప్రదర్శన కలెక్టర్ కార్యాలయం ముట్టడించిన అనంతరం బహిరంగ సభగా మారిపోయింది. ఖమ్మం కలెక్టరేట్ రోడ్డంతా పర్లాంగు దూరం మహిళలతో కిక్కిరిసి పోయింది. ట్రాఫిక్ ఆగి పోయింది.

కలెక్టరేట్ వద్ద పోలీసులు కలిగించిన ఆటంకాలను అధిగమించి బహిరంగసభ జరిగింది. యీ బహిరంగ సభకు ఐకేపీ వర్కర్స్ అండ్ మెంబర్స్ యూనియన్ కన్వీనర్ చంద్ర అరుణఅధ్యక్షత వహించగా, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ ఝాన్సీ, యిల్లందు శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఖమ్మం జిల్లా కార్యదర్శి కా॥ పి. రంగారావు, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కా॥ కె. కల్పన, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ జె. సీతారామయ్య, ఐకేపీ వర్కర్స్ & మెంబర్స్ యూనియన్ నాయకులు కిన్నెర నర్సయ్య, జడ్‌పీటీసీలు ఆవునూరి పద్మ, బాటన్నలు ప్రసంగించారు.

10 వేల మందితో జరిగిన యీ సభలో వారి సమస్యలను వివరించారు. స్త్రీలను వివిధ సంఘాల పేరుతో పొదుపు చేయించి, వారి డబ్బుతో ప్రభుత్వం వ్యాపారం చేస్తున్నదనీ, మోసంతో వారిని రాజకీయాలకు వాడుకుంటుందని వక్తలు విమర్శించారు.

మహిళలు పాలకుల గారడి మాటలు నమ్మి, ఆర్థికంగా అభివృద్ధి కావచ్చునని రాష్ట్రంలో 4 లక్షల 60 వేల బృందాలను ఏర్పరచి, 61 లక్షల 48 వేల మందిని చేర్పించారని అన్నారు. నేటి కాంగ్రెస్, నాటి తెలుగుదేశం తీరు అధికారం కోసం అవసరమైనప్పుడల్లా మహిళా సభ్యులను వుపయోగించుకుంటున్నారన్నారు.

ఐకేపీలోని వర్కర్స్‌కు ఎలాంటి జీతభత్యాలు లేకుండానే ప్రభుత్వం అధికారులతో చేయించాల్సిన పనులను ఐకేపీ గ్రూపు సభ్యులతో, బుక్ కీపర్స్‌తో చేయిస్తుందని విమర్శించారు. వృద్ధాప్య పెన్షన్లు, యిండ్ల కాలనీల బిల్లుల పంపకం, ప్రభుత్వ సి.ఐ.ఎఫ్ నిధులను, వంద రోజుల పనిని, ల్యాండ్ డెవలప్‌మెంట్ సర్వే, పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకం, తదితర అనేక కార్యక్రమాలను వీరితో నిర్వహించడం సరికాదన్నారు.

ఖమ్మం జిల్లాలో 42 వేల స్వయం సహాయక బృందాలున్నాయని, వీరు 2 కోట్ల రూ॥లు పొదుపు చేస్తున్నారని, వానీ వీరికి లోన్లు యిస్తామని చెపుతున్నా వారు చెల్లించే డబ్బులలో సగం కూడా వారికి రుణాలుగా యివ్వటం లేదనీ, ప్రభుత్వం తానేదో చేస్తున్నానని చెప్పుకోవడం అన్యాయమైనదన్నారు. అనంతరం 14 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతినిధి బృందం అందజేసింది.

లారీ ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలు

తిరుగు ప్రయాణంలో అశ్వారావుపేట మండలం కేశప్పగూడెంకు చెందిన మహిళలు ప్రయాణిస్తున్న లారీని ఎదురుగా వచ్చే లారీ తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద తగలగా ఆరుగురి మహిళల చేతులు (కుడివైపు) నుజ్జు నుజ్జు అయ్యాయి. ఒక మహిళ చేయి అక్కడ తెగి క్రింద పడింది. మరో మహిళ చేయిని హైదరాబాద్ హాస్పటల్‌లో తొలగించారు. మరో 4 గురికి ఆపరేషన్ జరిగింది. వారు కోలుకుంటున్నారు. కష్ట జీవులైన మహిళలు తమ సమస్యల మీద ర్యాలికి వచ్చి పోతుంటే యీ విషాదకర సంఘటన చోటు చేసుకోవడం ఎంతో బాధాకరం.

(12వ పేజీ తరువాయి)

'మందు' మరోకథ. 1911 విప్లవ నేపథ్యంలో నడిచిన కథ. విప్లవకారుణ్ణి గురించిన కథ. శత్రువును విపరీతంగా ద్వేషించే విప్లవకారుని త్యాగాన్ని గుర్తించని ప్రజల చైతన్య రాహిత్యం కథ. విప్లవకారుని రక్తాన్ని - అస్వస్థతని బాగుచేసే మందుగా వాడుకుంటారు ప్రజలు. 1911 విప్లవ వైఫల్యాన్ని ఈ కథ ఎత్తి చూపుతుంది. 1911 నాటి విప్లవకారులు ప్రజలకు దూరంగా చేసిన ఒంటరి పోరాట వైఫల్యాన్ని ఈ కథ [illegible]చిన తీరు అద్భుతం. అయినా వీరుని రక్తం వృధా కాదన్న భావం కథను వీడదు. వీరుని రక్తాన్ని మందుగా వాడుకునే ప్రజల మూఢత్వాన్ని కోపగించుకుంటూనే ఏదో రోజు వాళ్లే మేల్కోక తప్పదని లూసన్ భా[illegible]

'పిచ్చివాని డైరీ' మరో వాస్తవికవాద చిత్రం. గోగోల్ ప్రభావంతో రా[illegible] కద [illegible] [illegible]కత, కాల్పనికతల మేళవింపులో లూసన్ కథ ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఫ్యూడల్ సమ[illegible] (మ్యాన్ ఈటింగ్) అని ఈ నరభక్షిణి నుంచి పిల్లల్ని రక్షించాలనే పిలుపుని ఈ కథ ఇస్తుంది. ఫ్యూడల్ దుర్మార్గాన్ని, రాక్షసత్వాన్ని లూసన్‌లా ఇంత శక్తివంతంగా ఎండ గట్టిన రచయిత మరెవరైనా వున్నారా? అని అనిపిస్తుంది ఈ కథను చదివితే. ఇది ఫ్యూడల్ ప్రపపంచంపై విసిరిన వ్యంగ్యాస్త్రం.

అక్కడక్కడా లూసన్ కథల్లో నిరాశా నిస్పృహలు కూడా కనబడటానికి కారణం ఇంకా ప్రజల బలంపై విశ్వాసం కుదురుకోక పోవడమేనని చెప్పాలి. ఇది లూసన్‌లో ప్రధాన అంశంకాదు.

లూసన్ తన చిన్ననాటి స్నేహితుడు - రైతుబిడ్డ రుంతూ లాగా, తనలాగా కాకుండా యువత వుజ్వలమైన కొత్త జీవితాన్ని పొందాలని కాంక్షించాడు. 'మా పాత ఇల్లు' కథలోని విషయం ఇదే.

'పన్నులు, కరువులు, అధిక సంతానం, రోగాలు రొచ్చులూ. సైనికులు, గజ దొంగలు, అధికారులు, భూస్వామ్య ప్రభువులూ ప్రజలను పీల్చి పిప్పిచేశారు. శవాలని చేశారు.' ఇదీ రుంతూలకథ. ఈ కథ హృదయాన్ని బరువెక్కిస్తుంది.

పది మంది నడిస్తేనే బాట. అలా ఒంటరి యత్నాలు రేపటి మహోద్యమంగా మారుతాయన్నదే లూసన్ విశ్వాసం. 'రేపు' ఒక చిన్న సంఘటన. 'రేపు' ఓ స్త్రీ దీనగాథ. పాత సమాజం నేర స్వభావాన్ని ఈ కథ ఎండ గడుతుంది. 'ఒక చిన్న సంఘటన' అనే కథ దేన్ని ప్రేమించాలో, దేన్ని ద్వేషించాలో తెలిపే కథ. చెకోవ్‌ని జ్ఞప్తికి తెచ్చే కథ ఇది. అప్పటికింకా లూసన్ మార్క్సిజానికి చేరువ కాలేదు. కాబట్టి పరిష్కారాన్ని చూపెట్టలేక పోయినా వాస్తవిక వాద దృష్ట్యా ఈ కథలు అనన్యమైనవి. ప్రజాస్వామిక విప్లవ యుగంలో మే 4 వుద్యమం తర్వాత తన లోతైన అనుభవం ద్వారా 'బూర్జువా, పెటీ బూర్జువా మేధావులు తమ బలహీనతల వల్లా ఆచరణా రాహిత్యం వల్లా, పూగిసలాట వైఖరివల్లా ముందుకు పోలేక పోతారని, తమను తాము పూర్తిగా మార్చుకుంటేనే విప్లవానికి దోహదం చేయగలరని, లూసన్ గ్రహించ గలిగాడు. ఆధునిక చైనా నూతన సాహిత్యానికి లూసన్ కంట్రిబ్యూషన్ ఇదే.

(ముగింపు వచ్చే సంచికలో)

PRAJAPANDHA (Telugu Fortnightly) Registered. No. HSE-673 / 2006 - 2008 & R.N.I. 66054/84-Tel

ఖమ్మంలో పీడీయస్‌యూ పూర్వ విద్యార్ధి నేతల రాష్ట్రస్థాయి విస్తృత సమ్మేళనానికి సన్నాహాలు



పీడీయస్‌యూ రాష్ట్ర 18వ మహాసభలు నవంబర్ 15, 16, 17 తేదీలలో ఖమ్మంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా నవంబర్ 15న పీడీయస్‌యూ పూర్వ విద్యార్ధి నేతల, ఉద్యమకారుల రాష్ట్రస్థాయి సమ్మేళనాన్ని అక్కడే నిర్వహించాలని పూర్వ విద్యార్థులు కొంత మంది సంకల్పించారు. పీడీయస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షులైన కా॥ బి. ప్రదీప్ (ఐఎఫ్‌టీయూ ఆలిండియా జనరల్ సెక్రటరీ) కన్వీనర్‌గా ఇప్పటికే పూర్వ విద్యార్ధి ఉద్యమకారులకూ, నేతలకూ ఆహ్వానాలు పంపే కార్యక్రమాన్ని చేపట్టారు. గత మూడున్నర దశాబ్దాలుగా ప్రగతిశీల విద్యార్ధి ఉద్యమ పథంలో నడిచిన ప్రగతిశీలురను ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి సమ్మేళనానికి సమీకరించే ప్రయత్నాలు చకచకా సాగుతున్నాయి. ఆనాటి ఉద్వేగాలూ, ఉద్విగ్నతలూ, ఉల్లాసాలూ, ఉత్తేజాలూ, ఉత్సాహాలూ, ఉద్దీపనంతో అలరారిన ఆనాటి జ్ఞాపకాలను నేమరువేసుకోందామనే పిలుపుకు ఇప్పటికీ అనేక మంది సానుకూలంగా స్పందిస్తున్నారు. జ్ఞాపకాలకు పదును పెట్టుకుంటున్నారు.

1967-'68లలో భారతదేశ రాజకీయ యవనికపై నక్సల్బరీ తుఫాను వీచి యిప్పటికే 40 ఏళ్ళు గడిచిపోయింది. నాడు భారతదేశ విప్లవ వినీలాకాశంలో కమ్మిన కారుమేఘాల హోరు విన్యాసాలకు ప్రభావితమైన తొలికాలపు విద్యార్థులు మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో విభిన్న పేర్లతో విప్లవ విద్యార్ధి సంస్థలను నిర్మించుకున్నారు. ఇవి కాలగమనంలో విలీనమై 1974 అక్టోబరు 12, 13, 14 లలో "ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్ధి సంఘం" (Progressive Democratic Students Union - PDSU)గా ఏర్పడింది. యిది భారత విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణానికొక పిలుపు.

మన రాష్ట్రంలో విద్యార్థి లోకాన్ని PDSU సంస్థ అనూహ్యమైన రీతిలో విప్లవోత్తేజితం చేసింది. వినూత్న రూపాలలో పిలుపులతో విద్యార్థి లోకాన్ని కదిలించింది. 'రాజకీయాలు' తమ గుత్త సరుకుగా దోపిడీ, పీడక వర్గాలు చెలాయిస్తున్న రోజుల్లో వాటికి ప్రత్యామ్నాయ విప్లవ రాజకీయాలను విద్యార్థులు విధిగా చేపట్టాల్సిన అవసరం వుందని ఘంటాపథంగా PDSU చాటి చెప్పింది.

PDSU ఒక నూతన విప్లవ సంస్కృతిని బోధించింది. అన్యాయాలను, అవినీతిని, అక్రమాలను, వ్యతిరేకించే సుసాంప్రదాయాన్ని నెలకొల్పింది. సామాజిక, రాజకీయ దోపిడీ పీడనల నుంచి విముక్తికై చేపట్టిన విప్లవ పంథాను బలపరిచింది. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటాలకు బాసటగా నిలిచింది. ఒక్క మాటలో చెప్పాలంటే, మన రాష్ట్రంలో ఒక తరం విద్యార్థి లోకాన్ని ఉగ్రూతలూగించింది. విద్యా సంస్థలతోపాటు వసతి గృహాలను కూడా విప్లవ వుద్యమ కేంద్రాలుగా మలిచింది. విప్లవ ఓనమాలను దిద్దింది. గుణింతాలు నేర్పింది. వాచకాలు చదివించింది. అలా అభ్యసించిన ఎందరో ఉన్నత విప్లవ శిఖరాల కెదిగారు. అందులో కొందరు తమ అమూల్యమైన ప్రాణాలను కూడా విప్లవం కోసం అర్పించారు.

ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో విప్లవ రాజకీయాలు నేర్చుకొని 40 ఏండ్ల క్రితమే విప్లవోద్యమంలో మరణించిన బత్తుల వెంకటేశ్వరరావుతో ఈ తరం విద్యార్ధి ఉద్యమ త్యాగాలు ప్రారంభమయ్యాయి. విప్లవ విద్యార్థి వుద్యమ నిర్మాణకర్తవ్యంలో జార్జిరెడ్డి తొలి అమరత్వం పొందాడు. మలి అమరత్వం జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పొందాడు. ఆనాటి శ్రీపాద శ్రీహరి, నిన్నటి నంబూరి సీతారామారావు నుంచి నేటి భోగా శ్రీరాములు దాకా వరుసగా విప్లవోద్యమంలో అనేక మంది అమరత్వం పొందారు. వీరే కాకుండా రాష్ట్రంలో మధుసూదన్‌రాజ్, కృష్ణారెడ్డి, రంగవల్లి, కోలా శంకర్, సాంబయ్య, వీరయ్య, సుశేన్ కుమారి, తదితరులెందరో అమరులయ్యారు. ఇంకా PDSUకు సహ విప్లవ విద్యార్థి సంస్థ RSU నేతలు జనార్ధన్, మురళీమోహన్, ఆనందరావు, స్నేహలత వంటి ఎందరో అమరులయ్యారు.

గత మూడున్నర దశాబ్దాల చరిత్రలో PDSU సంస్థకి వివిధ కాలాలలో, వివిధ జిల్లాలలో, వివిధ స్థాయిల్లో నాయకత్వం వహించిన వారెందరో ఈ రాష్ట్రంలోనే గాకుండా, దేశ, విదేశాల్లోనూ ఉన్నారు. వారు నేడు వివిధ రంగాలలో విభిన్న వృత్తులూ, ఉపాధులూ, ఉద్యోగాలలో వున్నారు. ఏ రంగంలో, ఏ ప్రాంతంలో వున్నా వారందరితో ఒక సమ్మేళనం జరపడం ఒక అవసరంగా భావించి, దీన్ని జయప్రదం చేయాలని కా॥ బి. ప్రదీప్ పూర్వ విద్యార్ధులను కోరుతున్నారు.

ఈ నేల మీద వేనవేల పోరాటాలను, ఆందోళనలనూ నిర్మించి, నిర్వహించి నడిపించిన ఉజ్వల చరిత్ర PDSU కు వుంది. ఆనాటి ఆటా, పాటా, మాటలను గుర్తు చేసుకోవడానికిగాను ఈ సమ్మేళనాన్ని పీడీయస్‌యూ పూర్వ విద్యార్ధులు ఏర్పాటు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 200 మంది ఎఐకెఎంఎస్‌లో చేరిక

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం అమ్మపేట గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అయిన ఊటుకూరి గోపయ్య తన 200 మంది అనుచరులతో అఖిల భారత రైతు-కూలీ సంఘంలో 9.10.08న చేరారు. సీపీఎం పార్టీ అనుసరిస్తున్న రివిజనిస్టు రాజకీయాలు, నాయకత్వం అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలకు విసుగు చెంది, రైతు-కూలీల ఐక్యత కోసం వ్యవసాయక విప్లవ ఇరుసుగా పనిచేస్తున్న ఎఐకెఎంఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు సెంటర్‌లలో జెండావిష్కరణలు అనంతరం సభ జరిగింది. ఈ సభలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి కా॥ పి. రంగారావు, డివిజన్ కార్యదర్శి కా॥ ఎ. వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ మలీదు నాగేశ్వరరావు, అర్జున్‌రావు, రామయ్య, వీరాస్వామి, గోవిందరెడ్డి, కళ్యాణ్ తదితరులు మాట్లాడారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన జ॥గింది.

బెల్టుషాపులను ఎత్తివేయాలని కోరుతూ నెల్లూరు జిల్లాలో ఆందోళన

నెల్లూరు జిల్లా సైదాపురం మండలం తుమ్మల తలుపూరు గ్రామంలో బెల్టుషాపులను ఎత్తివేయాలని ఎఐకెఎంఎస్, పి.ఓ.డబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో వందల మందలాది మంది మహిళలు ఉద్యమించారు. చిన్న గ్రామం అయినా 17 బెల్టుషాపులు నడుపుతుండడంతో, పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మహిళలపై హింస పెరిగిపోయింది. దీనితో ఆగ్రహం చెందిన వందలాది మహిళలు బెల్టుషాపులను వెంటనే ఎత్తివేయాలని మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. బెల్టు షాపులను మూసివేయాలని, లేదంటే మేమే బెల్టుషాపులపై ప్రత్యక్ష పోరాటం చేస్తామని మహిళలు ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చారు.

ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

మాయదారి మద్యం మా గ్రామాల్లో వద్దంటూ, బెల్ట్ షాపులను తక్షణం మూసివేయాలంటూ తుమ్మల తలుపూరు గ్రామ మహిళలూ, ఇంకా కొన్ని గ్రామాలకు చెందిన మహిళలు సుమారు 500 మంది వెంకటగిరి పట్టణంలో ప్రదర్శన జరిపి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆ తరువాత గంటపాటు రాస్తారోకో చేసి, అనంతరం ఎక్సైజ్ సి.ఐ.కి వినతి పత్రం ఇచ్చారు. మూడు రోజుల లోపు బెల్ట్‌షాపులను మూసివేయాలని, యజమానులపై కేసులు నమోదు చేయాలని అధికారులకు విన్నవించారు.

ఎస్.హెచ్. బెల్ట్ షాపుల ధ్వంసం

ఇచ్చిన గడువు ముగిసినా అధికారులు బెల్ట్ షాపులను మూయలేదు. బెల్ట్ షాపు యజమానులు కులాల పేరుతో మహిళలను చీల్చి, ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేశారు. వీరి కుట్రలను అధిగమించి, ముఖ్యంగా గిరిజన మహిళలు కర్రలతో, చీపురులతో ప్రదర్శన చేశారు. నినాదాలు చేసుకుంటూ, ఆగ్రహంతో మహిళలు బెల్ట్‌షాపు యజమానిపై దాడిచేశారు. షాపును ధ్వంసం చేశారు. దీంతో భయపడిన యజమానులు మద్యాన్ని గ్రామంలో ప్రత్యక్షంగా అమ్మడానికి సాహసించలేక పోతున్నారు. ఈ ఆందోళనకు ఎఐకెఎంఎస్ మహిళా సంఘం జిల్లా నాయకులు, అరుణోదయ కళాకారులు నాయకత్వం వహించారు.

ఖమ్మంలో నవంబర్ 15, 16, 17 తేదీలలో PDSU 18వ రాష్ట్ర మహాసభ

నవంబర్ 15, 2008 - విద్యార్థి ప్రదర్శన

మధ్యాహ్నం 2 గం॥లకు నయాబజార్ కాలేజి గ్రౌండ్ నుండి పెవిలీయన్ గ్రౌండ్స్ వరకు
సాయంత్రం 5 గం॥లకు బహిరంగ సభ

అధ్యక్షత : కె. భూమయ్య, PDSU రాష్ట్ర అధ్యక్షులు
వక్తలు : పి. ప్రసాద్, ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి
పి. రంగారావు, సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఖమ్మం జిల్లా కార్యదర్శి
ఎస్.ఎల్. పద్మ, PDSU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవంబర్ 16, - ప్రతినిధుల సభ

ఉదయం 10 గం॥లకు శ్రీపాద శ్రీహరి హాల్

ప్రారంభోపన్యాసం : కా॥ వై. సాంబశివరావు,
సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) కేంద్ర కమిటీ నాయకులు

విద్యాగోష్ఠి : ప్రపంచీకరణ- భారతీయ విద్య
ప్రొ॥ హరగోపాల్ (సెంట్రల్ యూనివర్సిటీ)

నవంబర్ 17

భారతదేశ పరిస్థితి - భగత్‌సింగ్ ఆవశ్యకత - యువత కర్తవ్యాలు

ప్రొ॥ జగ్‌మోహన్ సింగ్ (భగత్‌సింగ్ మేనల్లుడు), పంజాబ్ యూనివర్శిటీ
(ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌ల ప్రతినిధులు పాల్గొంటారు)

అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి

If undelivered please return to:
Manager

PRAJAPANDHA
MARX BHAVAN
H.No.1-9-295/11
7th Line,
Vidyanagar,
Hyderabad.
500 044. A.P.

Regd. No. HSE-673

BOOK-POST

To

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No.1-9-295/11/4, 7th Line, Maseedu Road, Vidyanagar, Hyderabad-44 and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P.) Editor : M. Narayana Swamy-Phone: 27607884, Fax : 27662518

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M311
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	17
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	naveeda
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good